www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
శనివారం 01 ఫిబ్రవరి 2025
సంపుటి :06 సంచిక : 244 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



## గద్దర్ తో తన అనుబంధాన్ని తెలిపిన భట్టి విక్రమార్క

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 31:** సమాజంలో అసమానతల పైన ఎన్నో పోరాటాలకు ఊపిరి పోస్తివి..దనీ పాటతో తెలంగాణకి ప్రాణం పోస్తివి అంటూ తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తాను గద్దర్ తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు, శుక్ర వారం గద్దర్ జయంతి కావడంతో ఆయన తన ట్విట్టర్ ద్వారా తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.తెలంగాణ నుండి మొదలుకొని ప్రజా యుద్ధ నౌకగా ప్రపంచమంతా నీ పాటతో పరిచయమేర్పరుచుకొని గొప్పగా జీవించావు సోదరా.ఒక తల్లి కడుపులో పుట్టకపోయినా ఎంతో ఆప్యాయతగా.అన్నగా, ఆప్తుడిగా ఎల్లప్పుడూ నా పక్కనే ఉంటూ నన్ను నడిపించావు.నీవు లేని లోటు ఎన్నటికీ తీరదు.నీ జయంతి సందర్భంగా నిన్ను( గద్దర్ ) స్మరించుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాననీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు,

## ఉప రాష్ట్రపతి ని కలిసిన బీఆర్ఎస్ పార్లమెంట్రీ సభ్యులు

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 31:** పార్లమెంట్లో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ను బి ఆర్ స్ పార్టీ పార్లమెంట్రీ పార్టీ ఫ్లోర్ లీడర్ ఎంపీ కే ఆర్ సురేష్ రెడ్డి ఆధ్వర్యం లో శుక్ర వారం నాడు కలిశారు,పార్లమెంట్ బడ్జెట్ సమావే శాలు ప్రారంభమయ్యాయి,ఈ నేపథ్యంలో ఉప రాష్ట్రపతి భవన్ నుండి పార్లమెంటు కు చేరుకున్నారు. ఉప రాష్ట్రపతి రాజ్య సభ చైర్మన్ కి మర్యాద పూర్వాంగా కలసిన ఎంపీ కే ,ఆర్ సురేష్ రెడ్డి బి ఆర్ స్ పార్టీ పార్లమెంటరీ పార్టీ లీడర్ మరియు బి ఆర్ స్ పార్టీఎంపీ లు సైతం పాల్గొన్నారు,





# చెల్లని వేయినోటు కెసిఆర్

- తెలంగాణను అప్పులకుప్పగా చేసిన ఘనుడు
- పదేళ్లలో 7లక్షల కోట్లు అప్పు చేసి..దనిక రాష్ట్రమని అబద్దాలు
- ఫామ్‌హౌజ్ జీవితంతో ప్రజలకు సంబంధాలు తెగిపోయాయి
- ఎవరేం చేశారో లెక్కలు చెప్పడానికి నేను సిద్దం
- అసెంబ్లీకి వస్తే లెక్కలు చెబుతా..ఎవరేం చేశారో తేలుద్దాం
- టిక్‌టాక్ లైకులతో సంబరపడి పోతున్న కెసిఆర్
- మొగిలిగిద్ద సభలో నిప్పులు చెరిగిన సిఎం రేవంత్ రెడ్డి

**రంగారెడ్డి,జనవరి31( వెలుతురు):** ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చి, రాష్ట్రపై ఏడు లక్షల కోట్లు అప్పు పెట్టిన కెసిఆర్, చెల్లని వేయిరూపాయిల నోటు లాంటి వాడని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేసీఆర్ రద్దయిన వెయ్యి నోటు లాంటి వారు.. ఆయనకు విలువలేదు. ఫామ్‌హౌస్‌లో ఉన్న ఆయనకు ప్రజలతో సంబంధాలు తెగిపోయినట్లున్నాయి. ఇప్పుడు మెదడు కూడా సరిగా పనిచేయడం లేదని ఘాటు విమర్శలు చేశారు. ప్రజలు తిరస్కరించినా భారాస మారలేదు. రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా జరిగిన సభలో సీఎం ప్రసంగించారు. గట్టిగా కట్టె పట్టుకుని నిలబడలేడు...గంభీరంగా గమనిస్తున్నారట..ఆయన కొడుకును, అల్లుడిని అచ్చోసిన ఆంబోతుల్లా వదిలారు...అంటూ ఘాటు విమర్శలు చేశారు. రూ.7లక్షల కోట్లు



అప్పు చేసి 2023లో మాకు అప్పగించారు. గత ప్రభుత్వం రూ.18వేల కోట్లే రుణమాఫీ చేసింది. గత ప్రభుత్వం చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయింది. మేం అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేశాం. రుణమాఫీ చేయలేదంటున్న కేసీఆర్ అసెంబ్లీకి వస్తే లెక్కలు చెబుతాం. ఫామ్‌హౌస్‌లో ఉండి సోది చెప్పటం కాదు.. అసెంబ్లీకి రండి.. లెక్కలు చెబుతాం. ఏ గ్రామంలో ఏ రైతుకు ఎంత రుణమాఫీ చేశామో శాసనసభలో పెడతాం. కేసీఆర్‌కు చిత్తశుద్ధి, నిజాయతీ ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి. రైతు భరోసా ఎగ్గొడతారని కేసీఆర్ చెబుతున్నారు. మీలాగా మాట తప్పే వ్యక్తిని కాదు. దళితులకు 3 ఎకరాల భూమి, దళిత ముఖ్యమంత్రి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అని అనేక హామీలు ఇచ్చి మాట తప్పిన చరిత్ర కేసీఆర్‌ది. పదేళ్లు పాలించి ప్రజల దగ్గరకు వెళ్తే పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయారు. పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చి.. ఇక్కడి ప్రాజెక్టులను పండబెట్టారని విమర్శలు గుప్పించారు. భారాస పదేళ్లలో ఇవ్వలేని

2 లో..

## గోషామహల్ లో ఉస్మానియా ఆస్పత్రి



- అట్టహాసంగా సిఎం రేవంత్ శంకుస్థాపన

**హైదరాబాద్,జనవరి31( వెలుతురు):** గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణానికి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి భూమిపూజ చేసారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి,

2 లో..



## ప్రత్యేక తెలంగాణలో గద్దర్ పోరాటం చిరస్మరణీయం

- గద్దర్ పేరిట అవార్డులంటే.. ఏటా స్మరించుకోవడమే
- గద్దర్‌ను విమర్శిస్తే.. వారుండే ప్రాంతానికి ఆ పేరే పెడతాం
- గద్దర్‌ను ప్రగతిభవన్‌కు రానీయని వారు ..ఇప్పుడు బయట ఉన్నారు
- గద్దర్ జయంతి వేడుకల్లో సిఎం రేవంత్ ఉద్వేగపూరిత ప్రసంగం

2 లో..

## రాష్ట్రపతి పట్ల కాంగ్రెస్ పరివారం అహంకారం



- గిరిజన మహిళ పట్ల ఇంతటి దురహంకారమా
- సోనియా, రాహుల్ తీరుపై మండిపడ్డ మోడీ

**న్యూఢిల్లీ,జనవరి31( వెలుతురు):** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పట్ల కాంగ్రెస్ నాయకత్వం అహంకారం, అగౌరవాన్ని ప్రదర్శిస్తోందని మోడీ ఆరోపించారు. 'షాహి పరివార్(రాజకుటుంబం) అహంకారాన్ని

2 లో..

## నేను కొడితే మామూలుగా ఉండదు

- అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసింది..
- కాంగ్రెస్ ముస్లింలను ఓట్ల కోసం వాడుకుంటుంది...
- మహిళలు తులం బంగారానికి ఆశపడి కాంగ్రెస్కు ఓటేశారు...
- రైతుబంధుకి రామ్ రామ్.. దళిత బంధుకి జై భీమ్...
- ఫిబ్రవరి నెలలో భారీ సభ పెడదాం మీరంతా తరలిరండి...
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంచలన వాఖ్యలు..



**జహీరాబాద్ వెలుతురు జనవరి 31:** నేను కొడితే మామూలుగా ఉండదు అది కాంగ్రెస్ నాయకులకు బాగా తెలుసు అంటూ తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ నేతలతో ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ఇన్ని రోజులుగా తాను మౌనంగా ఉన్నానని, గంభీరంగా అన్నీ గమనిస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజల సంతోషంగా లేరని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చెప్పటినప్పటి నుండి మళ్లీ కరెంటు

2 లో..

# కేసీఆర్ గర్జనలు, గంభీరాలు గమనిస్తున్నాం.

## వాషింగ్టన్ డిసి విమాన ప్రమాదం

- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,జనవరి31( వెలుతురు):** అమెరికాలోని వాషింగ్టన్ డీసీ సమీపంలో ఘోర ప్రమాదం జరిగిన ఘటనపై ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతిని,

2 లో..

**కేసీఆర్ వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

## ఫామ్ హౌస్ లోనే ఉండి మాట్లాడతారా.. లేదా అసెంబ్లీకి వస్తారా?

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 31:** 13 నెలల పాటు ఫామ్ హౌజ్ కే పరిమితమై ఇంతకాలం మౌనంగా ఉన్నానని ఇప్పుడేదో అంటే సరిపోదు. ప్రతిపక్ష నాయకుడంటే ప్రజల్లో తిరగాలి. ప్రజా సమస్యలు ప్రస్తావించాలి. వర్షాలు వచ్చినా.. వరదలు వచ్చినా కనీసం ప్రజలను పరామర్శించలేదు. ఫామ్ హౌస్ దాటలేడంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శలు గుప్పించారు,దఅధికారంలో ఉన్ననాడు సచివాలయానికి రాలేదు. ప్రతిపక్ష నేతగా ఏడాది నుంచి అసెంబ్లీకి రాలేదు. ప్రజల్లోకి రాలేదు.కేసీఆర్ జీవితమంతా ఫామ్ హౌసే అంటూ



మంత్రి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు, ప్రజలు అత్యాశకు పోయి కాంగ్రెస్ కు ఓటేశారని కేసీఆర్ వ్యాఖ్యలు నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలను అవమానించేలా ఉన్నాయి. ప్రజా తీర్పును అగౌరవ పరుస్తున్నారంటూ మంత్రి

2 లో..

# రైతు భరోసా డబ్బులు వేయండి

- ఇది కొనసాగుతున్న పథకమే...
- ఎన్నికల కోడ్ సాకుతో రైతుల పొట్టకొట్టకండి
- ఎన్నికలు గ్రాడ్యుయేట్లు, టీచర్లకే పరిమితం
- ఇప్పటికే ఏడాది రైతు భరోసా సొమ్ము ఎగొట్టారు
- అసలే అన్నదాతలు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారు
- ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు రైతు భరోసా నిధులు రైతుల అకౌంట్స్ లో వేయాల్సిందే
- రేషన్ కార్డులు అర్హులందరికీ ఇవ్వాల్సిందే
- రైతు భరోసాతో ఎన్నికలను ప్రభావితం చేసే అవకాశమే లేదు
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా .. రైతు కూలీల అకౌంట్స్ లో వేయాల్సిందే



2 లో..

- ఎన్నికల కోడ్ సాకుతో ఆపితే ఊరుకునేది లేదు ...
- ప్రభుత్వ చేతకానితనాన్ని ఎన్నికల కోడ్ తో ముడి పెట్టొద్దు
- ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను కొనసాగించండి
- అవసరమైతే బీజేపీ పక్షాన ఎన్నికల సంఘానికి లేఖ పంపిస్తాం
- తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించండి
- అవసరమైతే అందరం కలిసి ఎన్నికల సంఘానికి విజప్తి చేద్దాం...
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్

**హైదరాబాద్ వెలుతురు జనవరి 31:** ఎన్నికల కోడ్ సాకుతో రైతు భరోసా పథకాన్ని నిలిపివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. రైతు భరోసా పథకం కొనసాగుతున్న పథకమే అయినందున ఎన్నికల సంఘం నుండి ఎలాంటి ఇబ్బందులు ఉండబోవన్నారు. పైగా జరిగే ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి..)

## గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రి

ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి,ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్,ఎం ఎల్ ఏ దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు. 26 ఎకరాల విస్తీర్ణంలో నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం జరుగనుంది. 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ఆసుపత్రి...2 వేల పడకల సామర్థ్యం తో ఆస్పత్రి నిర్మాణం ..కార్పొరేట్ ఆసుపత్రిని తలదన్నేలా నిర్మాణం చేపడతారు.

## వాషింగ్టన్ డిసి విమాన ప్రమాదం

విచారాన్ని వ్యక్తం చేశారు. ప్రయాణికుల విమానం, సైనిక హెలికాప్టర్ ఢీకొని, నదిలో పడిపోయాయి. ఈ ఘటనలో 67 మంది ప్రాణాలు కోల్పోయారు. తాజాగా ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'వాషింగ్టన్ డీసీలో జరిగిన ఘోర ప్రమాదంలో అనేకమంది ప్రాణాలు కోల్పోవడం నన్ను ఎంతో బాధించింది. మృతులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నా. అమెరికా ప్రజలకు సంఘీభావంగా నిలబడతాం' అని మోదీ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. కాన్సాస్‌లోని విషిటా నుంచి బయల్దేరిన పీఎస్‌ఏ ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల విమానం వాషింగ్టన్ (చిజీబరతినిణబినీని) సమీపంలోని రోనాల్డ్ రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టు రన్‌వేపై దిగేందుకు సిద్ధమైంది. ఈక్రమంలోనే రక్షణశాఖకు చెందిన సికోర్‌స్కీ హెచ్-60 బ్లాక్‌హాక్ హెలికాప్టర్‌ను ఢీకొట్టింది. విమానంలో 60 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉండగా.. హెలికాప్టర్‌లో ముగ్గురు సైనికులు ఉన్నారు. ఈ ఘటనలో వీరంతా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు పేర్కొన్నారు.

## రాష్ట్రపతి పట్ల కాంగ్రెస్ పరివారం అహంకారం

చూడండి. గిరిజన నేపథ్యం నుంచి వచ్చి ప్రెసిడెంట్ ద్రౌపది ముర్మును అవమానించారు. షాహి కుటుంబ సభ్యుడు ఒకరు ప్రసంగాన్ని 'బోరింగ్' అని అభివర్ణించారు. మరొకరు పాపం అంటూ గిరిజనులను అవమానించారు' అని సోనియా గాంధీ పేరుని నేరుగా ప్రస్తావించకుండా ప్రధాని విమర్శించారు. బడ్జెట్ సమావేశాలకు ముందు పార్లమెంట్ సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. ఈ ప్రసంగంపై ప్రతిపక్ష కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు పెదవివిరిచాయి. అయితే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ రాష్ట్రపతిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఢిల్లీ ద్వారకలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని నరేంద్రమోడీ, సోనియా గాంధీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన వర్గం నుంచి వచ్చిన రాష్ట్రపతిని అవమానించారని మండిపడ్డారు.రాష్ట్రపతి ప్రసంగం తర్వాత సోనియా గాంధీ మాట్లాడుతూ.. 'రాష్ట్రపతి చివరికి అలసిపోయారు. ఆమె మాట్లాడలేకపోయింది, పాపం' అని సోనియా గాంధీ అన్నారు. రాహుల్ గాంధీ ప్రసంగాన్ని 'బోరింగ్' అని అన్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. రాజ్యాంగంగా అత్యున్నత పదవిని కాంగ్రెస్ అవమానించిందని, గిరిజనులపై కాంగ్రెస్ వైఖరిని ఇది స్పష్టం చేస్తుందని ఆరోపించింది. అయితే, తన తల్లి సోనియాగాంధీ వ్యాఖ్యలపై ఎంపీ ప్రియాంకా గాంధీ వివరణ ఇచ్చారు. ' నా తల్లి 78 ఏళ్ల మహిళ. రాష్ట్రపతి సుదీర్ఘ ప్రసంగం ద్వారా అలసిపోయినట్లు మాత్రమే చెప్పారు. రాష్ట్రపతిపై తమకు పూర్తి గౌరవం ఉందని, ఈ విషయాన్ని మీడియా వక్రీకరించడం దురదృష్టకరం' అని ఆమె అన్నారు.

## నేను కొడితే మామూలుగా ఉండదుల

కోతలు, మంచినీటి సమస్యలు మొదలైనయాని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనా వైఫల్యాలను నిలదీస్తే వారిపై కేసులు పెడుతున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో కాంగ్రెస్ వాళ్లు గ్రామాలకు వెళ్ళే పరిస్థితి లేదని, దొరికితే ప్రజలు కొట్టేటట్టు ఉన్నారని అన్నారు. నిన్న కాంగ్రెస్ వాళ్ళు పోలింగ్ పెడితే మనకి ఎక్కువ ఓటింగ్ వచ్చిందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నేను ముందే చెప్పాను కాని నా మాటలను ప్రజలు వినలేదని, అత్యాశకు పోయి కాంగ్రెస్కు ఓటేశారని అన్నారు. అదేవిదంగా రైతుబంధుకి రామ్ రామ్.. దళిత బంధుకి జై భీమ్ అని ఆనాడే చెప్పానని గుర్తు చేశారు. మహిళలు ఎక్కువ మంది తులం బంగారానికి ఆశపడి కాంగ్రెస్కు ఓటేశారని తెలిపారు. రాబోయే రోజుల్లో విజయం మనదే, మన విజయం తెలంగాణ ప్రజల విజయం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలు, బిఆర్ఎస్ కార్యకర్తలు ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భూముల ధరలు అమాంతం పడిపోయాయని ఆరోపించారు. ఫిబ్రవరి నెలలో భారీ సభ పెడదాం మీరంతా తరలిరండని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలను ఓట్ల కోసం వాడుకుంటుందని ఆరోపించారు. ఎక్కడి ప్రాజెక్టులు అక్కడే ఉన్నాయని వాటిని ఎండ బెడుతున్నారని అన్నారు. సంగమేశ్వర బసవేశ్వర ఎత్తిపోతల టెండర్లు ఎందుకు పిలవలేదని సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ 11 నెలల పాలనపై అంతట అన్ని వర్గాల వారు అసంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. కరోనా టైంలో కూడా మా ప్రభుత్వం రైతుబంధు ఆపలేదని గుర్తు చేశారు. అనంతరం ఝరసంఘం నుండి పాదయాత్ర గా దాదాపు 140 కిలో మీటర్ల వరకు తన బృందంతో తనను కలవడానికి వచ్చిన మ్యాదేపల్లి మాజి సర్పంచ్ పరమేష్ పాటిల్ ని వారి బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతోపాటు రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు జహీరాబాద్ శాసనసభ్యులు కోనింటి మాణిక్ రావు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, శాసనసభ్యులు చింతా ప్రభాకర్, నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీతా లక్ష్మారెడ్డి, మాజీ శాసనసభ్యులు జీవన్ రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్ తదితరులు హాజరయ్యారు.

## కేసీఆర్ గర్జనలు, గంభీరాలు గమనిస్తున్నాం.



పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ పై మండిపడ్డారు, ప్రజలన్నా.ప్రజాతీర్పు అన్నా కేసీఆర్ కు ఏనాడూ గౌరవం లేదన్నారు, పదేండ్లు అధికారం ఇచ్చిన ప్రజలకు ఓడిపోయిన తర్వాత ఈ రోజు వరకు కూడా కనీసం కృతజ్ఞత తెలపలేదన్నారు, ప్రజాతీర్పును శిరసావహిస్తున్నామని కూడా ప్రకటించలేదని విమర్శించారు, ఈ ఏడాది కాలంలో నల్గొండ, కరీంనగర్ బీఆర్ఎస్ సభల్లో కూడా. ఈరోజు మాదిరిగానే గంభీర ప్రకటనలే చేశారు. ఆ తర్వాత ఏమయ్యారో అందరికీ తెలిసిందేనని మంత్రి తెలిపారు,ప్రతిపక్షనేతగా అసెంబ్లీ ముఖం చూడని వ్యక్తి తన ఉనికిని చాటుకోవడానికి, నేనున్నానని చెప్పుకోవడానికి తుపాకీ రాముడిలా, పిట్టలదొరమాదిరిమాట్లాడుతున్నారు ప్రజలు ఏదో నమ్మి ఓటేశారని అంటున్నావు. వాస్తవాలు గ్రహించి నీ గడీల పాలన వద్దనుకుని ప్రజలు నిన్ను నీ కుటుంబాన్ని ఛీత్కరించారనీ మంత్రి గుర్తు చేశారు, పథకాలు అమలు కాలేదని ఫామ్ హౌజ్ లో కూర్చొని మాట్లాడటం కాదు. ఇప్పటికైనా ప్రజల్లోకి రావాలనే మేమంటున్నాం. అసెంబ్లీ సమావేశాలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదే పదే ఆహ్వానించారు. కానీ 80వేల పుస్తకాలు చదివినారన్నారు. మీ అమూల్యమైన సూచనలు సలహాలు ఇవ్వాలని అసెంబ్లీకి రమ్మంటే ఎందుకు రాలేదని మంత్రి శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు,2020 రెవెన్యూ చట్టం దేశానికే ఆదర్శమని ప్రకటించిన మీరు భూ భారతి చట్టం ప్రవేశ పెట్టిననాడైన అస్సెంబ్లీ కి వస్తారని ఆశించాం. కానీ నీ ఫామ్ హౌజ్ కు కరెంటు కోతలెక్కడివి. లెక్కలు తీద్దామా. ఏ రోజు ఎంత కరెంటు సరఫరా అయింది. ఎంత సరఫరా అవుతుంది. నీ ఫామ్ హౌజ్ కు నీళ్లెక్కడివి అని అడిగారు, రైతు భరోసా ఇచ్చిందే మేము. రాష్ట్రంలో ఉచిత కరెంట్ తెచ్చిందే కాంగ్రెస్. చరిత్ర ప్రజలకు తెలియదా. నీవంటున్న గురుకులాలను సందర్శిద్దామా. మాతో వస్తారా. నీవెక్కడికంటే అక్కడికి రావడానికి మేము సిద్ధంగా ఉన్నామని మంత్రి తెలిపారు,అద్దె గదుల్లో పెట్టి విద్యార్థులను నానా ఇబ్బందులకు గురిచేసిన మీరా మాట్లాడేది.రైతుల రుణమాఫీ కోసం 20 వేల కోట్ల రూపాయలు ఇచ్చిన సంగతి కళ్లకు కనిపించడం లేదా.అభివృద్ధి మీద చర్చకు సిద్ధమా. ఏదైనా మాట్లాడితే దానికొక ప్రాతిపదిక ఉండాలి. ముస్లింలను కాంగ్రెస్ వాడుకుంది అంటున్నావు. వాడుకుని వదిలేసే చరిత్ర నీది అని మంత్రి శ్రీనివాస్ రెడ్డి బీఆర్ ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పై నిప్పులు చెరిగారు.

# చెల్లని వేయినోటు కెసిఆర్

ఉద్యోగాలను ఏడాదిలో ఇచ్చాం. సోషల్ మీడియాలో నాకంటే ఎక్కువ లైక్‌లు వచ్చాయంటు న్నారు. కేంద్రమంత్రి, సీఎంగా చేసిన కేసీఆర్ సోషల్ మీడియాలో లైక్‌లు చూసి సంబరపడుతున్నారు. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొంటే. మీరో.. నేనో తేల్చుకుందాం. ప్రజలు బాధపడుతున్నారని కేసీఆర్ అంటున్నారు. ఎవరూ బాధపడటం లేదు. రూ.2లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఫీజు రీయింబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ రూ.10లక్షలు, రైతు భరోసా పథకాలు అమలు చేస్తున్నాం' అని సీఎం వివరించారు. తెలంగాణను ధనిక రాష్ట్రంగా మార్చినట్లు ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి, గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిర్ణయాలను విమర్శించారు. తెలంగాణను అప్పుల గండం నుంచి గట్టెక్కించినట్లు ధ్వజమెత్తారు. 2023లో మా వద్దకి రూ.7 లక్షల కోట్లు అప్పు చేయడంతో వచ్చిన తెలంగాణ ప్రభుత్వం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.18వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేసింది. ఈ రుణమాఫీ వడ్డీలకే సరిపోయింది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని అన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి లెక్కలు చెబుతారని నమ్ముతుంటే, ఆయన ఫామ్‌హౌస్‌లో ఉండి సోది మాట్లాడటం కాదు, నిజం చెప్పాలి. అసెంబ్లీకి రమ్మని, రైతులకు ఎన్ని రుణమాఫీలు చేశామో అసెంబ్లీ ముందు వివరంగా చెప్పాలని అన్నారు. కేసీఆర్ కు చిత్తశుద్ధి ఉంటే, అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి. దళితుల కోసం 3 ఎకరాల భూమి, దళిత సీఎం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వంటి హామీలను ఇచ్చి మాట తప్పిన చరిత్ర కేసీఆర్ కు ఉంటే, అది ప్రజల్ని మోసం చేయడమే అని రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. పదేళ్ల పాటు పాలించిన కేసీఆర్, ప్రజల నుంచి తప్పించి పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయారు. పాలమూరు ప్రాజెక్టుల గురించి హామీ ఇచ్చి, స్వంత ప్రాజెక్టులలో రుణాలు చెయ్యడమే అన్యాయంగా ఉందన్నారు. అంతేకాకుండా..'అసెంబ్లీ ఎన్నికలను అడ్డ పెట్టుకుని రైతు బంధు ఎగ్గొట్టిన చరిత్ర కేసీఆర్‌ది. ఆయన ఎగ్గొట్టిన రైతు భరోసా నిధులను మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల ఖాతాలో వేశాం. 2014 నుంచి 2023 డిసెంబర్ వరకు కేసీఆర్ చేసిన రైతు రుణమాఫీ కేవలం రూ.18వేల కోట్లు మాత్రమే. ఇందులో మిత్తికి పోగా నికరంగా ఆయన చేసిన రుణమాఫీ కేవలం రూ.3 వేల కోట్లు మాత్రమే. కానీ మేం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 21వేల కోట్లు రుణమాఫీ చేశాం. మేం రుణమాఫీ చేయలేదంటున్న కేసీఆర్ ఫాం హౌస్ కు వచ్చినోళ్లకు చోద్యం చెప్పుడు కాదు.. అసెంబ్లీకి రా లెక్కలు చెబుతాం.. రైతుల జాబితాతో సహా మేం చేసిన రుణమాఫీ లెక్కలు చూపిస్తాం.. నీకు చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి రా.. నీలా ఇచ్చిన హామీలను ఎగ్గొట్టి పంగనామాలు పెట్టిన చరిత్ర నాది కాదు..ఆయన గంభీరంగా చూస్తున్నడట.. ఎవరిని చూస్తున్నావ్? అచ్చోసిన ఆబోతుల్లా కొడుకు, అల్లుడిని ఊరిమీదకు వదిలిండు. జహంగీర్ పీర్ దర్గాకు, వేములవాడ రాజన్నకు నిధులు ఇస్తానని మోసం చేసినవ్.. పాలమూరును ఎరవేసి ఎండబెట్టిన దుర్మార్గుడు కేసీఆర్.. మాప్రభుత్వంలో రైతులకు రుణమాఫీ జరిగింది, రైతు భరోసానూ ఇస్తున్నం.. మార్చి 31 లోగా రూ.10 వేల కోట్లు రైతు భరోసా వేస్తాం.. భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఏడాదికి రూ.12 వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తాం.. మొదటి ఏడాదిలోనే 55142 ఉద్యోగ నియామకాలు పూర్తి చేసిన ఘనత మా ప్రభుత్వానిది.. నీ నాయకత్వంపై నీకు నమ్మకం ఉంటే అసెంబ్లీకి రా.. కొడితే బలంగా కొట్టడం సంగతి పక్కకు పెడితే సరిగ్గా నిలబడటం నేర్చుకో.. ట్విట్టర్ లో ఈయనకు లైకులు ఎక్కువ వచ్చాయని చెప్పుకుంటుండు.. పదేళ్లు ముఖ్యమంత్రిగా చేసిన ఆయన సోషల్ మీడియాలో లైకులు వచ్చాయని చెప్పుకుంటుండు అంటే ఆయన మానసిక స్థితి ఎట్లుందో అర్థం చేసుకోండి.. కేసీఆర్ ముందు నీ కొడుకును, అల్లుడిని దారిలో పెట్టుకో.. బీసీ కులగణన, మాదిగ వర్గీకరణపై ఫిబ్రవరి మొదటి వారంలో అసెంబ్లీ పెడుతున్నాం.. పొంకనాలు కొట్టుడు కాదు.. దమ్ముంటే అసెంబ్లీకి రా మాట్లాడుకుందాం.. ఫాం హౌస్ లో ఉన్న కేసీఆర్ కు ప్రజలతో బంధం తెగిపోయింది.. కేసీఆర్ కాలం చెల్లిన వెయ్యి నోటు.. కేసీఆర్ మమ్మల్ని అభినందించడానికి నీకు మనసు రాకపోతే ఫామ్ హౌస్ లోనే పడుకో' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

### ప్రత్యేక తెలంగాణలో గద్దర్ పోరాటం చిరస్మరణీయం

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసిన గద్దర్ పేరిట అవార్డు ఇవ్వాలని నిర్ణయించుకున్నామని.. ఆయన పేరిట అవార్డు ఇవ్వడమంటే ప్రతియేటా ఆయనను స్మరించు కోవడమేనని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమాజానికి స్ఫూర్తినిచ్చేలా గద్దర్ అవార్డు ఉండాలని భావించానని.. అందుకే గద్దర్ అవార్డుల బాధ్యతను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అప్పగించానని తెలిపారు. గద్దరన్న మరణించినప్పుడు ఆయన చివరిచూపు ప్రజలందరికీ దక్కాలని ఎల్బీ స్టేడియానికి తీసుకొచ్చామని.. కానీ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్టేడియం గేట్లకు తాళం వేసిందని ÷ర్ అయ్యారు. గద్దర్ చివరి శ్వాస వరకు తాను నమ్మిన సిద్ధాంతాల కోసం జీవించారని కొనియాడారు. గద్దర్ 77వ జయంతిక ఆర్యక్రమం రవీంద్రభారతిలో నిర్వహించారు. భాషా సాంస్కృతిక శాఖ, గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జయంతి వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాజకీయంగా ఒంటరిననే భావన వచ్చినప్పుడల్లా గద్దర్ దగ్గరకు వెళ్లి సలహాలు తీసుకునే వాడిని. నీ బాధ్యత నెరవేర్చు ప్రజలు తప్పకుండా నిన్ను గుర్తించి అవకాశం ఇస్తారని చెప్పేవారు. వారి మాట నిజమైంది' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన గద్దర్ జయంతి కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ... గద్దర్ ఆఖరి శ్వాస వరకు తాను నమ్మిన సిద్ధాంతాల కోసం జీవించారని కొనియాడారు. గద్దర్ చెప్పినట్లే నా బాధ్యత నెరవేర్చాను.. ప్రజలు నాకు అవకాశం ఇచ్చారని అన్నారు. ఈ ఏడాది రాష్ట్రం నుంచి ఐదుగురికి పద్మ అవార్డులు ఇవ్వాలని కేంద్రానికి సిఫార్సు చేశాం. గద్దర్, గోరటి వెంకన్న, చుక్కా రామయ్య, అందెశ్రీ, జయధీర తిరుమలరావుకి పద్మ అవార్డులు ఇవ్వాలని ప్రతిపాదించామని తెలిపారు. కానీ పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదుగురి పద్మ అవార్డులు ఇచ్చారు.. వాళ్ల కంటే మేం ప్రతిపాదించిన వాళ్లు తక్కువా అని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. కేంద్ర చేసిన తప్పును సరిదిద్దుకుంటుందని లేఖ కూడా రాశా.. కానీ వాళ్లు తప్పు సరిదిద్దుకోకుండా గద్దర్‌కు అవార్డ్ ఇవ్వమని అన్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇంకోసారి గద్దర్ గురించి తప్పు మాట్లాడితే.. సంబంధిత పార్టీ కార్యాలయం పరోక్షంగా బీజేపీఉండే ప్రాంతానికి గద్దర్ పేరు పెడతామని సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలోనూ కొందరు నేతలు గద్దర్ ను ప్రజా భవన్ బయట నిలబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గద్దర్ ను ప్రజా భవన్ బయట నిలబెట్టిన వ్యక్తులు.. ఇప్పుడు ప్రజా భవన్ బయట ఉన్నారని అన్నారు. గద్దర్ గురించి తప్పుగా మాట్లాడిన వ్యక్తికి ఓట్ల విప్లవం చూపిస్తామని హెచ్చరించారు. రాహుల్ గాంధీతో మాట్లాడి గద్దర్‌కు మేమే అవార్డు ఇప్పిస్తామన్నారు. అవార్డులు ఇచ్చేది మేమే అని భాజపా నేతలు అంటున్నారు. వారి పార్టీ కార్యాలయం తెలంగాణలో ఉంది. ఇంకోసారి గద్దర్ గురించి తప్పుగా మాట్లాడితే భాజపా ఆఫీసు ఉన్న ప్రాంతానికి, కాలనీకి గద్దరన్న పేరు పెడతాం. ప్రతి దానికీ మా దగ్గర మందు ఉంది. గతంలో గద్దర్‌ను అవమానించిన వారికి తగిన శాస్తి జరిగింది. గద్దరన్నపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం' అని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. మరణం తరవాత గద్దర్ భౌతిక కాయాన్ని తీసుకెళ్తే.. గత కేసీఆర్ ప్రభుత్వం ఎల్బీ స్టేడియానికి తాళం వేసిందని మండిపడ్డారు. గద్దరన్న చివరిచూపు ప్రజలందరికీ దక్కాలని ఎల్బీ స్టేడియానికి తీసుకొచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గద్దర్ చివరి శ్వాస వరకూ తాను నమ్మిన సిద్ధాంతాల కోసం జీవించారని అన్నారు. తెలుగు సినీ రంగానికి.. గద్దర్ పేరుతో తెలంగాణ ఫిలిం అవార్డులు ఇవ్వబోతున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఉగాది సందర్భంగా గద్దర్ తెలంగాణ ఫిలిం అవార్డులు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. గద్దర్‌కు కులం, మతం లేదు.. ఆయన విశ్వ మానవుడని అభివర్ణించారు. గద్దర్ తెలంగాణలో పుట్టడం మన అదృష్టమని ఉద్ఘాటించారు. గద్దర్ జయంతి, వర్ధంతిని అధికారికంగా చేస్తారని ఎవరూ ఊహించి ఉండరని చెప్పారు. గద్దర్ జయంతి, వర్ధంతిని అధికారికంగా చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారని అన్నారు. పాట, మాటతో లక్షలాదిమందిని ప్రభావితం చేశారని చెప్పుకొచ్చారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం గద్దర్ ప్రత్యేక పాట రాశారని గుర్తుచేశారు. గద్దర్ పాట తెలంగాణ ప్రజలను కదిలించిందని చెప్పారు. ఐదుగురికి పద్మ అవార్డులు ఇవ్వాలని కేంద్రానికి ప్రతిపాదన చేశామని చెప్పారు. గద్దర్, గోరటి వెంకన్న తదితరులకు ఇవ్వాలని లేఖ రాశామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

# రైతు భరోసా డబ్బులు వేయండి

(మొదటి పేజీ తరువాయి..)

పట్టభద్రులు, ఉపాధ్యాయులకు సంబంధించినవి అయినందును ఎన్నికలను ప్రభావితం చేసే అవకాశాలు కూడా లేవన్నారు. అవసరమైతే బీజేపీ పక్షాన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ద్వారా ఎన్నికల సంఘానికి లేఖ పంపిందుకు కూడా సిద్ధమన్నారు. ఈ మేరకు బండి సంజయ్ శుక్రవారం రోజున ప్రకటన విడుదల చేశారు. తక్షణమే అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించి రైతు భరోసా సహా ఇటీవల ప్రారంభించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇండ్ల నిర్మాణ లబ్దిదారులను వెంటనే ఎంపిక చేసి మంజూరు చేయాలని కోరారు. ఒకవేళ ఎన్నికల సంఘం కోడ్ సాకుతో ఆయా పథకాలను నిలిపివేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఒకవేళ ఎన్నికల సంఘం అభ్యంతరం వ్యక్తం చేస్తే అఖిలపక్షంతో కలిసి కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి రైతుల ఖాతాల్లో రైతు భరోసా పైసలు జమ చేసేందుకు అనుమతి తీసుకుందామని కోరారు. ఇప్పటికే ఏడాది పాటు రైతు భరోసా పైసలు అందక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ నెలలోనైనా ప్రస్తుతం గిట్టుబాటు ధర రాక, పంట పెట్టుబడులు పెరిగి రైతులు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారని, ఈ తరుణంలో చేతికందే సొమ్మును కూడా ఆపేస్తే రైతు నోట్లో మట్టికొట్టినట్లే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల మంది రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారని, వీరిలో 40 వేల మందికి మాత్రమే మంజూరు చేసి మిగిలిన 99 శాతం మంది పేదల కడుపు కొట్టడం అమానవీయమన్నారు. అట్లాగే వ్యవసాయ భూమిలేని 10 లక్షల మంది కూలీల కుటుంబాల బ్యాంకుల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఎకరాకు రూ.6 వేల చొప్పున డబ్బులు జమ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం 20 వేల 336 మంది ఖాతాల్లోనే డబ్బులు జమ చేసి, మిగిలిన 9 లక్షల 79 వేల మందికిపైగా కూలీలకు జమ చేయకపోవడం అన్యాయమన్నారు.అట్లాగే రాష్ట్రవ్యాప్తంగా ఇండ్ల కోసం అందిన 70 లక్షలకు పైగా దరఖాస్తుల్లో దాదాపు 40 లక్షల మంది పేదలు ఇండ్లకు అర్హులని తేలితే ఇప్పటి వరకు 72 వేల 406 మందికి మాత్రమే ఇండ్ల మంజూరు పత్రాలను అందజేసి, మిగిలిన వారిని ఎంపిక చేయకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే ప్రతి ఒక్క లబ్దిదారుడికి రైతు భరోసా సొమ్ము వేయడంతోపాటు మిగిలిన 3 పథకాలకు సంబంధించి లబ్ది చేకూర్చే ప్రక్రియను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్సీ కోడ్ ముగిశాక డీఎస్సీ నోటిఫికేషన్

- టీచర్ల బదిలీలపై ట్రాన్స్‌ఫర్ యాక్ట్ తీసుకొస్తాం
- జగన్ ఫీజు బకాయిలు 3వేల కోట్లు పెట్టారు
- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడి

**అమరావతి,జనవరి31(వెలుతురు):** రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మార్చిలో ప్రక్రియ ప్రారంభించి విద్యాసంవత్సరం ప్రారంభంలోనే టీచర్ల భర్తీ పూర్తి చేస్తామన్నారు. ఈ మేరకు డీఎస్సీ నోటిఫికేషన్‌పై మంత్రి నారా లోకేష్ కీలక ప్రకటన చేశారు. శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో లోకేష్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, నవ్యాంధ్రలోనూ 80 శాతంపైగా టీచర్ల నియామకం చేసింది తెలుగుదేశం ప్రభుత్వమే అని చెప్పుకొచ్చారు. ఉపాధ్యాయ సంఘాలతో నిత్యం సంప్రదింపులు జరుపుతూ ప్రజాస్వామ్య స్వేచ్ఛ కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వం తీసుకునే ప్రతీ నిర్ణయంలోనూ టీచర్ల అభిప్రాయ సేకరణ ఉంటోందన్నారు. ప్రతీ శుక్రవారం కమిషనర్ ఉపాధ్యాయులకు వారి సమస్యలపై అందుబాటులో ఉంటున్నారని.. తాను కలుస్తున్నట్లు తెలిపారు. టీచర్ల బదిలీ పారదర్శకంగా ఉండేందుకు ట్రాన్స్ఫర్ యాక్ట్ తీసుకొస్తున్నామన్నారు. విద్యా వ్యవస్థ అంటే అనాలోచిత నిర్ణయాలు తీసుకునే వ్యవస్థ కాదని నిరూపిస్తున్నామని.. అందులో భాగస్వామ్యులైన వారందరితో చర్చించాకే నిర్ణయం తీసుకుంటూ ప్రజాస్వామ్య విలువలు చాటుతున్నామని మంత్రి వెల్లడించారు. జగన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు 3 వేలు కోట్లు పెట్టి దిగిపోయారని విమర్శించారు. 'మేము మా విడతగా రూ.800 కోట్లు చెల్లింపులు చేశాం. జగన్ పెట్టిన జగన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై వైసీపీ నేతలు



ఆందోళనలు చేయటం విడ్డూరంగా ఉంది' అని మండిపడ్డారు. జగన్ రైతులకు పెట్టిన ధాన్యం బకాయిలు, పెండింగ్ బిల్లులు, ఉద్యోగుల బకాయిలు అన్నీ తామే తీరుస్తున్నామన్నారు. అలాగే జగన్ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తీర్చేది కూడా తామే అని స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలో విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలను వైసీపీ ప్రభుత్వం గందరగోళం చేసిందని వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల సంఖ్య ఖచ్చితత్వాన్ని తెలుసుకునేందుకు ఆపార్ కార్డ్ విధానం తెస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాప్ ఔట్స్ నివారణకు ప్రత్యేక వ్యవస్థ తీసుకొస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. నాయకులు, పార్టీ శ్రేణులు ఎదుగుదల కోసం ఒకే పదవిలో మూడు సార్లు కంటే ఎక్కువ ఉండకూడదనే ప్రతిపాదన తెచ్చానన్నారు. దీనిపై విస్తృత చర్చ తర్వాత పార్టీ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. గ్రామ స్థాయి నాయకుడు మండల స్థాయికి, మండలి స్థాయి వాళ్లు నియోజకవర్గ స్థాయికి, అక్కడి నుంచి జిల్లా స్థాయికి ఎదిగేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందన్నారు. తెలుగుదేశం సంస్థాగత నిర్మాణం ఎంతో గొప్పదని చెప్పుకొచ్చారు. అధినేత మినహా ఈ విధానం తనతో సహా అందరికీ వర్తింప చేస్తేనే కొత్తతరం రాజకీయాల్లోకి వస్తుందన్నారు. 40 ఏళ్లుగా పార్టీ పటిష్ఠంగా పనిచేస్తోందంటే అందుకు కారణం ఎన్టీఆర్ వేసిన బలమైన పునాదే అని అన్నారు. ఇదిలావుంటే పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో పోలీసుల అత్యుత్సాహంపై నారా లోకేష్ అసహనం వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయంలో పోలీసులు ఎందుకు ఎక్కువ ఉన్నారంటూ మంత్రి సీరియస్ అయ్యారు. ఇంతమంది పోలీసులు ఎందుకు వచ్చారనే దానిపై అధికారులను ప్రశ్నించారు. పార్టీ కార్యాలయంలో జరిగే పొలిట్ బ్యూరో సమావేశానికి ఇంతమంది పోలీసులు అవసరమా అని అధికారులను అడిగారు. బందోబస్తు పేరుతో పార్టీ కార్యాలయానికి వచ్చే కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేయొద్దని స్పష్టం చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయానికి ప్రతిరోజు కార్యకర్తలు వస్తారు కాబట్టి, వారి వారి సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే కార్యకర్తలను పోలీసులు ఇబ్బంది పెట్ట వద్దంటూ హితువు పలికారు. 'మా పార్టీకి కార్యకర్తలే బలం... కార్యకర్తలు సమస్యలపై వచ్చినప్పుడు పోలీసులు హడావుడితో వారిని ఇబ్బంది పెట్టొద్దు' అని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

# నాగోబా జాతరలో ఆదివాసిల చీర కట్టిన మంత్రి సీతక్క



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 31:**
అదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని రాష్ట్ర మంత్రి సీతక్క శుక్రవారం దర్శించుకున్నారు. నాగోబా జాతరకు మంత్రి సీతక్క ఆదివాసీ సంప్రదాయ చీర కట్టుతో వచ్చి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాల ప్రకారం మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు మెస్రం వంశీయులు మంత్రిని శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తదితరులున్నారు.



# కాంగ్రెస్ పార్టీ ఎం ఎల్ సి అభ్యర్థి గా నరేందర్ రెడ్డి

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 31:**
కరీంనగర్,నిజామాబాద్,ఆదిలాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి ని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆసక్తికర మలుపు

- అప్రకటిత నేరస్థులగా ప్రభాకర్ రావు, శ్రవణ్ రావు
- న్యాయస్థానంను ఆశ్రయించే అవకాశం?

**హైదరాబాద్,జనవరి31( వెలుతురు):**
సంచలనం రేపుతున్న ఫోన్ల అక్రమ ట్యాపింగ్ కేసు దర్యాప్తు ఆసక్తికర మలుపులు తిరుగుతోంది. తప్పించుకు తిరుగుతున్న నిందితులపై ఒత్తిడి పెంచేందుకు పోలీసులు మరో ప్రయత్నం ప్రారంభించారు. ప్రొక్లెయిమ్డ్ అఫెండర్ అంటే ప్రకటిత నేరస్థుడు అస్త్రాన్ని ప్రయోగించే దిశగా కార్యాచరణను ఆరంభించారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దర్యాప్తును ముందుకు సాగనీయకుండా తప్పించుకు తిరుగుతున్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావుతోపాటు మరో కీలక నిందితుడు శ్రవణ్‌రావును ప్రకటిత నేరస్థులుగా నిర్ధారించే దిశగా కసరత్తు చేపట్టారు. గతేడాది మార్చి 10న పంజాగుట్ట ఠాణాలో కేసు నమోదైన వెంటనే విదేశాలకు పారిపోయిన వారిద్దరు విచారణను ఎదుర్కోకుండా తప్పించుకు తిరుగుతున్నారు. వారిపై రెడ్‌కార్నర్ నోటీస్ జారీ చేయించే దిశగా పోలీసులు ప్రారంభించిన ప్రక్రియను అడ్డుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. తమ పాస్‌పోర్టులను రద్దు చేయొద్దంటూ విదేశీ వ్యవహారాల శాఖ వద్ద దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. దర్యాప్తు ముందుకు సాగాలన్నా.. ఈ దందాలో రాజకీయ నేతల ప్రమేయంపై ఆధారాలు బహిర్గతం కావాలన్నా వారిని విచారించాల్సిన అవసరమేర్పడిందని పోలీసులు పేర్కొంటున్నారు. వారిని ఎప్పటిలోగా అరెస్ట్ చేస్తారంటూ న్యాయస్థానం ప్రశ్నించిన నేపథ్యంలో అందుబాటులో ఉన్న అన్ని మార్గాలపై పోలీసులు దృష్టి సారించారు. విచారణకు హాజరుకాకుండా తప్పించుకుంటున్న ఎవరినైనా ప్రొక్లెయిమ్డ్ అఫెండర్లుగా గుర్తించేందుకు పోలీసులు ముందుగా న్యాయస్థానం అనుమతి పొందాలి. పోలీసులది సరైన చర్యగా న్యాయస్థానం భావిస్తే తొలుత ఒక ఉత్తర్వు జారీ చేస్తుంది. దాని ప్రతులను నిందితుడి నివాసప్రాంతంతోపాటు బహిరంగ ప్రదేశాల్లో అతికిస్తారు. కొన్ని సందర్భాల్లో దినపత్రికల్లోనూ ప్రకటన ఇస్తారు. ఆ ఉత్తర్వు వెలువరించిన 30 రోజుల్లోగా నిందితుడు న్యాయస్థానం ఎదుట హాజరు కావాలి. రాకపోతే అప్పుడు ఆ నిందితుడిని ప్రొ÷-లకెయిమ్డ్ అఫెండర్‌గా న్యాయస్థానం గుర్తిస్తుంది. అలాంటి వారిని సాధారణ పౌరులెవరైనా సరే పట్టుకొచ్చి పోలీసులకు అప్పగించొచ్చు. అలాంటి నిందితుల ఆస్తుల్ని బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 85 కింద పోలీసులు జప్తు చేసే అవకాశముంటుంది.

# ముఖ్య మంత్రి ని కలిసిన "దేశ్ పాండే ఫౌండేషన్" ప్రతినిధులు

- తెలంగాణ లో సంస్థ సేవలను విస్తరించడానికి కృషి : ప్రతినిధుల
- రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరించడానికి సిద్ధం: సీఎం

(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు,హైదరాబాద్ బ్యూరో, జనవరి 31:**
సామాజిక సేవలో పేరుపొందిన ప్రఖ్యాత స్వచ్ఛంద సంస్థ 'దేశ్‌పాండే ఫౌండేషన్' తెలంగాణలో సేవలను విస్తరించడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. శుక్ర వారం నాడు దేశ్‌పాండే ఫౌండేషన్ సభ్యులు ముఖ్యమంత్రిని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి, సేవా





కార్యక్రమాల విస్తృతిపై చర్చించారు. రాష్ట్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాల నిర్వహణలో దేశ్‌పాండే ఫౌండేషన్ పాలుపంచుకుంటే సముచితంగా ఉంటుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అలాగే, మహబూబ్ నగర్ లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను దత్తత తీసుకోవాలని కోరారు.

సీఎం రేవంత్ రెడ్డి సూచనలను దేశ్‌పాండే ఫౌండేషన్ ప్రతినిధులు అంగీకరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,కోమటిరెడ్డి వెంకటరెడ్డి , ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి , దేశ్‌పాండే ఫౌండేషన్ వ్యవస్థాపకులు గురురాజ్ దేశ్‌పాండే , జయశ్రీ దేశ్‌పాండే , దేశ్‌పాండే స్టార్టప్స్ రాజు రెడ్డి , ప్రతినిధి జి.అనిల్ తదితరులు పాల్గొన్నారు. దేశ్‌పాండే ఫౌండేషన్ అమెరికాతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక పరిస్థితుల మార్పు కోసం పని చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఆంగ్లంలో శిక్షణ ఇవ్వడం, విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

# మంత్రి పొన్నం ప్రభాకర్‌తో బీసీ కమిషన్ భేటీ

- ఉమ్మడి జిల్లా పర్యటనలో పలు కులాల పేరు మార్పు అభ్యంతరాలు తదితర వాటిపై చర్చ
- సెంట్రల్ ఓబీసీ లిస్ట్ లో లేని 40 కులాలను సెంట్రల్ ఓబీసీ లో చేర్చే విధంగా మరోసారి కేంద్రానికి ప్రతిపాదనలు

(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 31:**
రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ , బీసీ కమిషన్ సభ్యులు శుక్ర వారం నాడు



సచివాలయంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో భేటీ అయ్యారు. ఇప్పటికే బీసీ కమిషన్ 10 ఉమ్మడి జిల్లాల పర్యటన తరువాత వచ్చిన విజ్ఞప్తుల మేరకు కొన్ని కులాల పేర్లు మార్పు మరియు ఏమైనా అభ్యంతరాలుంటే స్వీకరించిన తరువాత వచ్చిన అన్ని అంశాలను బిసి కమీషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మీ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి అన్ని విషయాలు సవివరంగా చర్చించారు,వివిధ విజ్ఞప్తులను వాటి పర్యవసానాలను మంత్రి ప్రభాకర్ తో కూలంకషంగా చర్చించారు, అలాగే సెంట్రల్ ఓబీసీ లిస్ట్ లో లేని 40 కులాలను సెంట్రల్ ఓబీసీ లస్ట్ లో చేర్చే విధంగా కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున మరోసారి ప్రతిపాదన పంపాలని ఈ సమావేశంలో నిర్ణయించారు,బిసిల అభ్యున్నతికి కమీషన్ మంత్రిత్వ శాఖ చర్చలు జరిపి కొన్ని కీలక అంశాలతో ముందుకు పోవాలని నిర్ణయించడం జరిగింది,ఈ సమావేశంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్రీధర్, మెంబర్ సెక్రటరీ బాల మాయాదేవి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆకట్టుకునే కథనాల రూపకల్పనపై వర్క్ షాప్..

- సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖతో కలిసి జేఎన్ఏఎఫ్ఏయూలో నిర్వహించిన డాన్సింగ్ ఆటమ్స్ స్టూడియోస్
- వేవ్స్ లో భాగంగా నిర్వహిస్తున్న 'క్రియేట్ ఇన్ ఇండియా చాలెంజ్'లో పాల్గొనాలంటూ విద్యార్థులకు పిలుపు

**వెలుతురు 31 జనవరి 2025, హైదరాబాద్:**
అంతర్జాతీయ దృశ్య శ్రవ్య వినోద సదస్సు (వేవ్స్)లో భాగంగా నిర్వహిస్తున్న 'క్రియేట్ ఇన్ ఇండియా చాలెంజ్' పోటీల్లో యువత భాగస్వామ్యాన్ని పెంచడం కోసం నగరంలోని జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో డాన్సింగ్ ఆటమ్స్ స్టూడియోస్ తో కలిసి సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ విద్యార్థుల కోసం గురువారం వర్క్ షాప్ నిర్వహించింది. 'అన్ లాకింగ్: స్టోరీ టెల్లింగ్ వర్క్ షాప్' పేరుతో నిర్వహించిన ఈ వర్క్ షాప్ సందర్భంగా ప్రముఖ రచయిత – దర్శకురాలు, విజువల్ యానిమేషన్ స్టూడియో డాన్సింగ్ ఆటమ్స్ డైరెక్టర్ శ్రీమతి సరస్వతీ బుయ్యాల మాట్లాడుతూ.. ప్రేక్షకులకు, సంబంధిత రంగంలో నిపుణులను హత్తుకునేలా విద్యార్థులు కథలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. తమలోని కథకులను ఆవిష్కరించడం ద్వారానే దేశ సృజనాత్మక భవితను దేదీప్యం చేయగలరని వ్యాఖ్యానించారు. ప్రభావవంతమైన ప్రదర్శనల రూపకల్పన ప్రధానమైన అంశమని ఆమె తెలిపారు. నిధులు, భాగస్వామ్యాలను పొందడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. మీడియా, వినోద రంగాలకు చెందిన అంతర్జాతీయ సదస్సు వేవ్స్ లో భాగంగా వచ్చే నెలలో నిర్వహిస్తున్న 'క్రియేట్ ఇన్ ఇండియా చాలెంజ్' పోటీల్లో పాల్గొనాల్సిందిగా విద్యార్థులను ఆమె కోరారు.

### జేఎన్ఏఎఫ్ఏయూలో వర్క్ షాప్

క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్ (సీఐసీ)కు భారత్ తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఔత్సాహికులైన, నిపుణులైన సృజనకారుల నుంచి విశేష స్పందన లభించింది. 70 వేల



మందికి పైగా నమోదు చేసుకోగా, రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి. ఈ పోటీ విభిన్న నేపథ్యాలకు చెందిన వ్యక్తులు, బృందాల దృష్టిని ఆకట్టుకుంది. తద్వారా ప్రభావవంతమైన సృజనాత్మకత, ఆవిష్కరణల కోసం సమగ్ర వ్యవస్థను ఏర్పరుస్తోంది. ప్రణాళికాబద్ధంగా ఎంపిక చేసి నిర్వహిస్తున్న 31 చాలెంజిల్లో.. సంగీతం, ప్రకటనలు, గేమింగ్, యానిమేషన్, వీఎఫ్ఎక్స్, చిత్ర నిర్మాణం, కామిక్స్, ఎక్స్ఆర్/వీఆర్, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా వంటి విస్తృతశ్రేణి సృజనాత్మక విభాగాలున్నాయి. ప్రస్తుతం ఔత్సాహిక సృజనకారుల నుంచి నిపుణుల వరకు విస్తృత స్థాయిలో కళాకారులు భాగస్వాములవడానికి 25 పోటీల్లో ఇంకా అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా ఉన్న కళాకారులను సాధికారులను చేయడంతోపాటు దేశంలోని సుసంపన్నమైన సృజనాత్మక విశిష్టతను చాటడం ఈ కార్యక్రమ లక్ష్యం. 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి క్రియేట్ ఇన్ ఇండియా చాలెంజిలో కళాకారులు భాగస్వాములయ్యారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మంత్రప్రదంగా భావించే 'మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' లక్ష్యానికి అనుగుణంగా ఈ పోటీలను రూపొందించారు. 31 చాలెంజిల్లో 22 పోటీల్లో అంతర్జాతీయ స్థాయి భాగస్వామ్యానికి అవకాశం ఉంది. ఇది అంతర్జాతీయ వేదికపై భారత ప్రతిష్ఠను ఇనుమడింపజేయడం మాత్రమే కాకుండా.. దేశంలో పెద్దసంఖ్యలో ఉన్న సమర్థులైన కళాకారుల ప్రతిభను చాటుతుంది. 35 దేశాల నుంచి కళాకారులు





భాగస్వాములవుతున్న ఈ కార్యక్రమం సృజనాత్మక ఉన్నతికి భారత్ ను నిలయంగా నిలపడంతోపాటు అంతర్జాతీయ సహకారాన్నీ పెంపొందిస్తోంది. 'క్రియేట్ ఇన్ ఇండియా' చాలెంజ్ సీజన్ 1 కళాకారులకు ప్రోత్సాహాన్నిస్తూ వారిని సాధికారులను చేస్తోంది. వారి ప్రతిభను చాటడానికి, గుర్తింపును పొందడానికి ఇది విశిష్టమైన వేదికను అందిస్తుంది. దేశ సృజనాత్మక రంగాన్ని బలోపేతం చేయడానికి తోడ్పాటును అందిస్తుంది.

## బిఆర్ఎస్ హయాంలో పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేశాం
- ఉమ్మడి ఎపిలో పట్టణాల తీరు అధ్వాన్నం
- కాంగ్రెస్ హయాంలో మళ్లీ యధాతథ స్థితి
- తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కెటిఆర్

**హైదరాబాద్,జనవరి31(వెలుతురు):**
బిఆర్ఎస్ హయాంలో పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో కెసిఆర్ ముందుకు సాగారని పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. ఆనాడు ప్రత్యేకంగా నిధులు విడుదల చేశామని అన్నారు. అందుకే ఆర్థిక ఇంజిన్లుగా ఉన్న పట్టణాలను, వాటిని సమగ్రంగా డెవలప్ చేయాలని అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. సమైక్య రాష్ట్రంలో మున్సిపాలిటీలు మురికి కూపాలుగా ఉండేవని.. బల్దియాలు అంటే ఖాయా.. పియా.. చల్దియా.. అనే సామెత ఉండేది కెటి రామారావు అన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మున్సిపల్ చైర్‌పర్సన్ సన్మాన కార్యక్రమంలో కేటీఆర్, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కేసీఆర్ పట్టణాల అభివృద్ధి కోసం ప్రత్యేక విజన్‌తో పని చేయాలని దిశా నిర్దేశం చేశారన్నారు. పట్టణీకరణ ఆపాలని కొన్ని దేశాలు చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయన్నారు. పట్టాణాల విస్తరణ ఆపడం వీలు కాదు.. కానీ ప్రభుత్వాలకు వాటిని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి మాత్రం అవకాశం ఉంటుందన్నారు. అందుకే ఆ దిశగా పదేళ్లు పనిచేశామన్నారు. చేసిన పనిని అభివృద్ధి నివేదికల రూపంలో ప్రజల ముందుంచామన్నారు. దేళ్ల పాటు జరిగిన పట్టణాలు అభివృద్ధి కేవలం డైలాగులు కొడితే కాలేదన్నారు. పక్కా ప్రణాళికతో పాటు అవసరమైన సంస్కరణలు, నిరంతర పర్యవేక్షణ



అవసరమైన నిధులు అందించడం తదితర నిరంతర ఫోకస్‌తోనే తెలంగాణలోని పట్టణాలు ఈ రోజు మోడల్ పట్టణాలుగా తయారయ్యాయన్నారు. తెలంగాణ పట్టణాలకు పదేళ్లలో అనేక జాతీయ అవార్డులు దక్కాయన్నారు. గత పది సంవత్సరాలుగా మున్సిపల్ చైర్‌పర్సన్లు కౌన్సిలర్లుగా పట్టణాల అభివృద్ధి కోసం పని చేశారన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి పూర్తి చేశారని చెప్పారు. పదవీ కాలం ముగిసిన చైర్మన్లు, కౌన్సిలర్లు ప్రజల్లోనే ఉండాలని.. మళ్లీ ఎన్నికలు వస్తే ప్రజలు గెలిపించుకుంటారన్నారు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున పరిపాలన వికేంద్రీకరణ కార్యక్రమాలు చేపట్టామన్నారు. కొత్త జిల్లాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు పరిపాలన మరింత దగ్గరైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధితో పట్టణాలతో పాటు ప్రజల ఆస్తుల విలువ కూడా పెరిగిందన్న కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పట్టణాలు అభివృద్ధి కుంటుపడడంతో పాటు ప్రజల ఆస్తుల విలువ కూడా భారీగా పడిపోయిందని అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన కొత్తగా కట్టాల్సింది పోయి హైడ్రా, మూసి ప్రాజెక్టుల పేరుతో కూలగొడు తున్నారన్నారు. ప్రభుత్వాన్ని నడిపే వారి ఆలోచనలు సానుకూలంగా ఉంటే రాష్ట్రం, పట్టణాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గతంలో నల్లగొండ పట్టణాన్ని సమూలంగా అభివృద్ధి చేసిన మనల్ని కాంగ్రెస్ మంత్రులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని.. కానీ అదే నల్లగొండ పట్టణంలో నాలుగు నెలలుగా సిబ్బందికి జీతాలు లేకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నల్లగొండ పర్యటన తర్వాత నన్ను బచ్చగాడు అంటున్న మంత్రి.. సీనియర్ అయ్యుండి పట్టణ అభివృద్ధిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. మోసపూరిత 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పాలన చేతకావడం లేదన్నారు. టకీ టకీ మని పైసలు పడుతాయన్నారని.. కానీ, టకీ టకీమని ఢిల్లీలో పైసలు పడుతున్నాయన్నారు. ఆరున్నర లక్షల కొత్త రేషన్ కార్డులను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ రేషన్ కార్డులు ఇవ్వనేలేదంటూ అబద్దాలు చెబుతుందన్నారు. ఈ విషయం అప్పటి రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు కాంగ్రెస్ నాయకులను అడిగితే తెలుస్తుందన్నారు. డూప్లికేట్ గాంధీలకు తెలంగాణ ఇచ్చిన హామీలను అమలు చేసేలా బుద్ధి ఇవ్వాలని మహాత్ముడి విగ్రహాలకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు.

## సంపాదకీయం..

# బడ్జెట్ అంటే..... ప్రజల నడ్డి విరచడమేనా ?


బడ్జెట్ అంటే పన్నులతో పీక్కు తినడం అన్న భావన రూఢీ అయ్యింది. ఎక్కడి నుంచి ఏ రూపంలో ఎంత వసూలు చేయవచ్చో అన్న లెక్కలు కట్టి..దానికి కొంత జోడించి...కొన్ని పనులను కొంత కేటాయింపులు చేసి చూపడమే బడ్జెట్. ఈ లెక్కల ప్రకారం వచ్చే ఆదాయానికి, చెల్లించే ఖర్చులకు లెక్కల పొంతన కుదరాలి. నిజానికి ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన మొత్తాన్ని దేశాన్ని నడపడానికి ఉపయోగించాలి. జీతాలు, ఆస్పత్రులు, విద్యా, రైలు, రోడ్డు తదితర అభివృద్ధి పనులకు వినియోగించాలి. అంతేగానీ ఉచితపథకాలతో దుబారా చేయరాదు. పన్నులు కూడా హేతుబద్దంగా ఉండాలి. ప్రజల నడ్డి విరిచేలా పన్నులు ఉంటే...వారు పన్నులు కట్టలేని దుస్థితి ఏర్పడుతుంది. ఇకపోతే ప్రజలు సంపాదించు కున్న డబ్బుల్లో నేరుగా 30 శాతం ప్రభుత్వం లాగేసుకుంటుంది. ఉద్యోగుల నుంచి కూడా టిడిఎస్ ద్వారా నేరుగా లాగేసుకుంటుంది. అంటే మనం ఎంత సంపాదించినా ముందుగా 30శాతం బొక్క పెట్టుకోవాల్సిందే. అలాగే మనం పెట్టుకునే ఖర్చులకు లెక్కలు చెప్పుకోవాలి. ఇలా ఏటా మన సంపాదన నుంచి కాబూలీవాల వడ్డీలాగా చెల్లించుకోవాల్సిందే. తేడా వస్తే ప్రభుత్వం వారు దాడి చేసి, కేసులు పెట్టి వేధించే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇలా మన ఆర్థిక చట్టం నిర్దేశించుకున్నాం. అందుకే ఇన్‌కమ్ ట్యాక్స్ అనగానే ఉద్యోగులు, వ్యాపారులు భయపడుతుంటారు. నిజానికి ఇలాంటి భయాలు లేని ఆదాయపు చట్టం రావాలి. పెరుగుతున్న ధరల నేపథ్యంలో వాటిని ఎలాగే కంట్రోల్ చేయడం లేదు. కనీసం పన్నుల భారం అయినా తగ్గుతుందా అంటే అదీ ఉండడం లేదు. కట్టిన డబ్బులతో అధికారంలో ఉన్న నేతలు వారి జల్సాలకు ఎక్కువగా వినయోగిస్తున్నారు. మంత్రులు, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, రాష్ట్రపతి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలకు కూడా మనం చెల్లించే పన్నుల నుంచే జీతభత్యాలు చెల్లించాలి. ఉద్యోగులకు కూడా జీతాలు, పెన్షన్లు కూడా ఇందులో నుంచే ఇవ్వాలి. ఇవి గాకుండా దేశంలో ఏ పని చేపట్టాలన్నా ఇందులో నుంచే ఖర్చు చేయాలి. ఇవన్నీ సమతూకం పాటించేలా, లెక్కలు బేరీజు వేసుకుని బడ్జెట్ రూపొందిస్తారు. ఈ క్రమంలో దేశ ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్న బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. శుక్రవారం రాష్ట్రపతి ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి.ఫిబ్రవరి 1న అంటే శనివారం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వరసగా 8వ సారి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఏటాలాగానే పేద, మధ్యతరగతి ప్రజలు తమకు చేకూరే లబ్ది గురించి ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే చాలా మందికి బడ్జెట్ లెక్కలు పెద్దగా అర్థం కావు. బడ్జెట్‌లో దేనికి పెంచారు..దేనికి తగ్గించారు అని చూస్తుంటారు. సిగరెట్లు, మద్యం వంటి వాటికి ఏటా పన్నుపోటు తప్పదు. ఎలక్ట్రానిక్స్ తదితర దిగుమతి వస్తువలపైనా సుంకాలు పెంచుతూనే ఉంటారు. ఇలా పత్రికల్లో వచ్చిన, లేదా టీవీల్లో వచ్చిన వార్తల ఆధారంగా ప్రజలు బడ్జెట్ గురించి బేరీజు వేసుకుంటారు. తమ జేబులకు ఎంత చిల్లు పడబోతున్నదో లేక్కలేసుకుంటారు. స్థూలంగా చెప్పాలంటే బడ్జెట్ ఇదే. కొన్ని ప్రధాన అంశాలపై దృష్టి పెట్టగలిగితే బ్జడెట్ గురించి తెలుసుకునే అవకాశం లభిస్తుంది. వాటిలోని గణాంకాలను అర్థం చేసుకోగలిగితే ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లేందు కు దేనిపై దృష్టి పెట్టాలో అర్థమవుతుంది. రుణాలు కాకుండా ప్రభుత్వ మొత్తం ఖర్చులు దాని ఆదాయాన్ని మించిపోయినప్పుడు ఆర్థికలోటు ఏర్పడుతుంది. అప్పులు తెచ్చి వాటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకూ ఉంటుంది. ఇందులో రాబడి ఎంత..ఖర్చులు ఎంత అన్నది లెక్కలు వేస్తారు.బడ్జెట్లో ఆర్థికలోటును జీడీపీలో 4.9 శాతంగా కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక లోటుపై కేంద్రం ఏం చెప్తుందోనని మార్కెట్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. అంవటే ఈ లోటు ఎలా పూర్తి చేస్తారన్నదే ఇక్కడ ప్రశ్న. అందుకు పన్నులు వేయడం వంటివి ప్రధానంగా ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం తన ఆర్థిక లోటును తీర్చుకునేందుకు పలు రకాలుగా రుణాలు సేకరిస్తుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రం స్థూల రుణ బడ్జెట్ రూ. 14.01 లక్షల కోట్లుగా ఉంది. కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన స్థూల రుణ బ్జడెట్ గురించి మార్కెట్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. కేంద్రం పన్నుల ద్వారా ప్రభుత్వ నిర్వహణకు అవసరమయ్యే ఆదాయం సమకూర్చుకుంటుంది. 2024-25 బ్జడెట్‌లో స్థూల పన్ను ఆదాయాన్ని రూ.38.40 లక్షల కోట్లుగా కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. దీంట్లో ప్రత్యక్ష పన్నుల ద్వారా రూ.22.07 లక్షల కోట్లు, పరోక్ష పన్నుల ద్వారా రూ.16.33 లక్షల కోట్లు వస్తాయని అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూలధన వ్యయం రూ.11.1 లక్షల కోట్లుగా కేంద్రం అంచనా వేసింది. అయితే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా 2024 మొదట్లో ఖర్చులు బాగా నెమ్మదించాయి. దీనికి ఎన్నికల కోడ్ కారణమనే చెప్పొచ్చు. కాగా, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్లో మూలధన వ్యయం ప్రకటనపై ఉత్కంఠ నెలకొంది. ఈ ఏడాది కేంద్రం వివిధ పథకాలు, అభివృద్ధి పనుల కింద ఎంత ఖర్చు చేయనుందో బడ్జెట్ సమావేశాల్లో తెలియనుంది. 2024లో సాధారణ ప్రభుత్వ రుణం- జీడీపీ నిష్పత్తి 85 శాతం ఉండగా.. అందులో ఒక్క కేంద్ర ప్రభుత్వ రుణమే 57 శాతంగా ఉంది. నిర్మలా సీతారామన్ 2024-25 బడ్జెట్ ప్రసంగంలో 2026-27 నుంచి జీడీపీలో ద్రవ్యలోటు తగ్గించేందుకు నిరంతరం ప్రయత్ని స్తామని చెప్పిన విషయం తెలిసిందే. స్తు, సేవల పన్ను అంటే జీఎస్టీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.10.62 లక్షల కోట్లకు చేరుకుంటుందని అధికార వర్గాలు అంచనా వేశాయి. కావున 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీఎస్టీ రాబడి భారీగానే ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారతదేశ జీడీపీ వృద్ధి రేటును ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 10.5 శాతంగా కేంద్రం అంచనా వేసింది. కాకపోతే వాస్తవ జీడీపీ వృద్ధి 6.4 శాతంగా ఉంటుందని ఆర్థిక పండితులు చెబుతున్నారు. అయితే జిఎస్టీ పన్నులు తలకు మించిన భారంగా ఉన్నాయి. హెల్త్ ఇన్సూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్ లాంటి వాటిపైనా 18శాతం జిఎస్టీ విధించడం వల్ల సామాన్యులు గగ్గోలు పెట్టినా కేంద్రం పట్టించుకోలేదు. మొత్తంగా పన్నుల హేతుబ్దీకరణతో పాటు, ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నం చేసినప్పుడే ప్రజలకు ఊరట కలుగుతుంది. అలాగే ధరల స్థిరీకరణకు చర్యలు కూడా అవసరం. ఈ రకమైన చర్యలు లేకుండా ఏ ప్రభుత్వం ఉన్నా ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఉండదు.

# ట్యాక్స్ ఫ్రీ రాష్ట్రంగా సిక్కిం

- అక్కడ ఆదాయపు పన్ను వర్తించదు
- ఎంత సంపాదించుకున్న నో ట్యాక్స్

**న్యూఢిల్లీ,జనవరి31( వెలుతురు):**

రాబోయే కేంద్ర బడ్జెట్‌లో ఆదాయ పన్ను కూడా ఒక అంశం కావడంతో దీనిపై ఎలాంటి నిర్ణయాలు ఉంటాయన్న దానిపై ఉద్యోగుల్లో ఏటా ఆశలు ఉంటాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ప్రారంభం కానుండగా, ఫిబ్రవరి 1వ తేదీన బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. టాక్స్ శ్లాబ్‌లు, మినహాయింపులపై ఎలాంటి ప్రకటన వస్తుందోనని ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. అయితే, ఆదాయ పన్ను గురించి పట్టింపే లేని రాష్ట్రం మన దేశంలోనే ఒకటి ఉంది. ఎందుకంటే, ఆ రాష్ట్రంలో ఆదాయ పన్ను 100శాతం రద్దయింది. ఆ రాష్ట్రం.. 'సిక్కిం' ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ వరుసగా ఎనిమిదో బ్జడెట్ సమర్పణకు సిద్ధమయ్యారు, ఫిబ్రవరి 01 శనివారం రోజున కేంద్ర బ్జడెట్ 2025ను సమర్పిస్తారు. ఈ నేపథ్యంలో, భారతదేశంలోని ఏకైక పన్ను రహిత రాష్ట్రమైన సిక్కిం ఇప్పుడు హెడ్‌లైన్స్‌లోకి వచ్చింది. ఆదాయ పన్ను చట్టంలోని ఆర్టికల్ 371(ఈ) కింద, సిక్కిం నివాసితులు పూర్తి ఆదాయ పన్ను మినహాయింపును పొందుతారు. 1975లో, ఇండియన్ యూనియన్‌లో సిక్కిం రాష్ట్రం విలీనమైన సమయంలో, భారత ప్రభుత్వంతో ఈ రాష్ట్రం ప్రత్యేక ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం ప్రకారం సిక్కిం ప్రజలకు పన్ను చెల్లింపు నుంచి మినహాయింపు లభించింది. ఈ ప్రత్యేక హక్కు అక్కడి ప్రజల ఆదాయాన్ని పెంచుతోంది .. పెట్టుబడులను ఆకర్షిస్తోంది. భారతదేశంలోని మిగిలిన ప్రాంతాల మాదిరిగా కాకుండా, సిక్కిం నివాసితులు ఆదాయ పన్ను నుంచి 100 శాతం మినహాయింపు పొందారు, రూ.కోట్ల సంపాదించినా ఒక్క రూపాయి కూడా పన్ను కట్టక్కరలేదు. ఈ పన్ను రహిత ప్రత్యేకత సిక్కిం ఆర్థిక వృద్ధిని వడివడిగా నడిపిస్తోంది. పర్యాటకం, వ్యవసాయం / చిన్న వ్యాపారాలకు ప్రయోజనం చేకూరుస్తోంది. సిక్కిం సబ్జెక్ట్స్ రెగ్యులేషన్ 1961 కింద 'సిక్కిమీస్' గా గుర్తింపు పొందిన అందరు వ్యక్తులు.. తాము సంపాదించే వడ్డీ రాబడి, డివిడెండ్‌లతో సహా ప్రతి రూపాయి ఆదాయంపైనా పూర్తి పన్ను మినహాయింపు పొందుతారు. సిక్కిం ప్రజలకు లభించే ఈ ప్రత్యేక హక్కుకు భద్రత కూడా కల్పించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 (ఈ) / ఆదాయ పన్ను చట్టం 1961లోని సెక్షన్ 10 ద్వారా ఈ మినహాయింపునకు రక్షణ ఏర్పాటు చేశారు. భారతదేశంలోని మిగిలిన ప్రాంతాల ప్రజలు ఒక పరిమితిని దాఖలు చేయడానికి, సాధారణంగా, జులై 31 చివరి తేదీగా ఉంటుంది. అయితే, సిక్కిం నివాసితుల ఆదాయం రూ.కోట్లకు చేరుకున్నప్పటికీ వాళ్లకు ఇన్‌కమ్ టాక్స్ రూల్స్ వర్తించవు. కాబట్టి, సిక్కిం నివాసితులు ఆదాయ పన్ను పత్రాలను కూడా సమర్పించాల్సిన అవసరం లేదు, ఐటి దాఖలు నుంచి మినహాయింపు పొందారు. ఆదాయ పన్ను చెల్లింపు మినహాయింపు మాత్రమే కాదు.. మార్కెట్ రెగ్యులేటర్ 'సెబీ', సిక్కిం నివాసితులకు పాన్ కార్డ్ అంశంలోనూ ప్రత్యేక మినహాయింపు ఇచ్చింది. భారతదేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలు షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టాలంటే పాన్ కార్డ్ కచ్చితంగా అవసరం. ఈ విషయంలో సిక్కిం ప్రజలకు మినహాయింపు ఉంది. వాళ్లు పాన్ కార్డ్ లేకుండా కూడా స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చు.




# ఊరిస్తున్న కొత్త ఆదాయపన్ను చట్టం

- పాతది ఉంటుందా..కొత్తది వస్తుందా..?
- ఎలా ఉంటుందోనని సర్వత్రా ఉత్కంఠ

**న్యూఢిల్లీ,జనవరి31( వెలుతురు):**

ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం ఈ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కొత్త ఆదాయపు పన్ను చట్టం ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఇది ప్రస్తుత చట్టానికి సవరణ కాదు. ప్రస్తుత ఐటీ చట్టాన్ని సరళీకృతం చేయడం, దానిని అర్థమయ్యేలా చేయడం, పేజీల సంఖ్యను దాదాపు 60 శాతం తగ్గించడమే లక్ష్యంగా ఉంటుందని సంకేతాలు అందుతున్నాయి. బడ్జెట్ సమావేశాల్లో కొత్త ఆదాయపు పన్ను బిల్లును ప్రవేశ పెట్టవచ్చు. ఆరు దశాబ్దాల నాటి 1961 ఆదాయపు పన్ను చట్టాన్ని ఆరు నెలల్లోపు సమగ్రంగా సమీక్షిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జూలై బడ్జెట్లో ప్రకటించారు. ఓ నివేదిక ప్రకారం 'కొత్త ఆదాయపు పన్ను చట్టం పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టబడుతుంది. ఇది కొత్త చట్టం అవుతుంది. ఇది ప్రస్తుత చట్టానికి సవరణ కాదు. ప్రస్తుతం చట్టం ముసాయిదాను పరిశీలిస్తోంది. మంత్రిత్వ శాఖకు దీనికి ఆమోద ముద్ర వేయనుంది. బడ్జెట్ సమావేశాల రెండో భాగంలో ఇది ఆమోదించ బడుతుంది. ఆ తర్వాత దీనిని పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి ఏప్రిల్ 4 వరకు జరుగుతాయి. బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి ఏప్రిల్ 4 వరకు జరుగుతాయి. 2025-26 కేంద్ర బడ్జెట్ ఫిబ్రవరి 1న సమర్పించబడుతుంది. పార్లమెంటు మార్చి 10న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 4 వరకు కొనసాగుతుంది. 1961 ఆదాయపు పన్ను చట్టం సమగ్ర సమీక్ష కోసం సీతారామన్ బడ్జెట్ ప్రకటనను అనుసరించి, సమీక్షను పర్యవేక్షించడానికి, చట్టాన్ని సంక్షిప్తంగా అర్థం చేసుకోవడానికి సులభంగా రూపొందించడానికి ఒక అంతర్గత కమిటీని ఏర్పాటు చేసింది. ఇది వివాదాలు, వ్యాజ్యాలను తగ్గిస్తుంది. పన్ను చెల్లింపుదారులకు ఎక్కువ పన్ను నిశ్చయత లభిస్తుంది. అదనంగా చట్టంలోని వివిధ అంశాలను సమీక్షించడానికి 22 ప్రత్యేక ఉప కమిటీలను ఏర్పాటు చేశారు. నాలుగు విభాగాలలో ప్రజల నుంచి సూచనలు, సమాచారాన్ని ఆహ్వానించారు. ఈ చట్టం సమీక్షకు సంబంధించి వాటాదారుల నుంచి ఆదాయపు పన్ను శాఖకు 6,500 సూచనలు అందాయి. నిబంధనలు, అధ్యాయాలు గణనీయంగా తగ్గించబడతాయి. వాడుకలో లేని నిబంధనలు తొలగించబడతాయి. వ్యక్తిగత ఐటీ, కార్పొరేట్ పన్ను, సెక్యూరిటీల లావాదేవీల పన్ను, సంపద పన్నుతో పాటు ప్రత్యక్ష పన్నుల విధింపుతో వ్యవహరించే ఆదాయపు పన్ను చట్టం, 1961లో ప్రస్తుతం దాదాపు 298 విభాగాలు, 23 అధ్యాయాలు ఉన్నాయి.ఈ విభాగాలు, అధ్యాయాలను దాదాపు 60 శాతం తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయా వర్గాలు తెలిపాయి. జూలై 2024 బ్జడెట్ ప్రసంగంలో సీతారామన్ ఈ చట్టాన్ని సంక్షిప్తంగా, స్పష్టంగా, చదవడానికి, అర్థం చేసుకోవడానికి సులభంగా ఉండేలా చేయడమే సమీక్ష లక్ష్యం అని అన్నారు. ఇది వివాదాలు, వ్యాజ్యాలను తగ్గిస్తుంది. తద్వారా పన్ను చెల్లింపుదారులకు పన్ను ఖచ్చితత్వాన్ని అందిస్తుంది. ఇది వ్యాజ్యంలో చిక్కుకున్న డిమాండ్‌ను కూడా తగ్గిస్తుంది.




# గజిబిజిగా ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్లు

- రెండు విధానాలతో చెల్లింపు దారుల్లో గందరగోళం
- సరళీకరణ కోసం దేశ ప్రజల ఎదురుచూపు

**న్యూఢిల్లీ,జనవరి31( వెలుతురు):**

2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్ ను, ఫిబ్రవరి 1న, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ సమర్పించబోతున్నారు. ఈ బడ్జెట్ లో, కేంద్ర ప్రభుత్వం, దేశ ఆర్థిక విధానాల బ్లూప్రింట్‌ను వెల్లడిస్తుంది. పన్ను చెల్లింపుదార్లు ఈసారి బడ్జెట్ పై అధిక అంచనాలతో ఉన్నారు. పన్ను రేట్లు, రాయితీలు / మినహాయింపులపై ప్రకటనల కోసం ఎదురు చూస్తున్నారు. పాత ఆదాయ పన్ను విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి ప్రకటించవచ్చన్న చర్చ కూడా జరుగుతోంది. గత కొన్నేళ్లుగా, భారతీయ పన్నుల విధానంలో చాలా కీలక మార్పులు వచ్చాయి. ప్రస్తుతం, మన దేశంలో రెండు ఆదాయ పన్ను వ్యవస్థలు ఉన్నాయి. సంప్రదాయంగా వస్తున్న పాత పన్ను విధానానికి ప్రత్యామ్నాయంగా, 2020లో, కేంద్ర ప్రభుత్వం కొత్త పన్ను విధానాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ డేటా ప్రకారం, ఆదాయ పన్ను పత్రాలు దాఖలు చేస్తున్న వ్యక్తిగత పన్ను చెల్లింపుదార్లలో 73 శాతం మంది కొత్త పన్ను విధానాన్ని అనుసరిస్తున్నారు. ఆదాయ పన్ను చట్టంలో సెక్షన్ 80అ కింద, రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడులను మీ మొత్తం ఆదాయం నుంచి తీసివేయవచ్చు. తద్వారా పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం తగ్గుతుంది. ఉదాహరణకు, మీ ఆదాయం రూ.6 లక్షలు / మీరు రూ. 1.5 లక్షలను 80అ కింద పెట్టుబడి పెడితే, పన్ను పరిధిలోకి వచ్చే మీ ఆదాయం రూ.4.50 లక్షలు అవుతుంది, మీరు పను చెల్లించాల్సిన అవసరం లేదు. వార్షికాదాయం రూ. 6.50 లక్షల వరకు ఉన్నా మీరు పన్ను నుంచి పూర్తి మినహాయింపు పొందవచ్చు. రూ. 5 లక్షల వరకు ఆదాయంపై పన్ను లేదు / సెక్షన్ 80అ కింద రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడిపై మినహాయింపు లభిస్తుంది. అంటే మీ రూ. 6.50 లక్షల ఆదాయంపై ఎలాంటి పన్ను ఉండదు. పాత పన్ను విధానంలో స్లాబ్ రేట్లు ప్రకారం రూ. 2.50 లక్షల వరకు ఆదాయంపై పూర్తిగా పన్ను మినహాయింపు ఉంది.

రూ. 2.5 లక్షల నుంచి రూ. 5 లక్షల మధ్య ఆదాయంపై 5 శాతం పన్ను, రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల మధ్య ఆదాయంపై 20శాతం పన్ను, రూ. 10 లక్షల కంటే ఎక్కువ ఆదాయంపై 30శాతం పన్ను, సీనియర్ సిటిజన్ (60 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు) కొన్ని అదనపు తగ్గింపులు పొందవచ్చు. పాత పన్ను విధానంలో, మీ ఖర్చులను లెక్కించడంలో మీకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. మీ ఆదాయాన్ని ప్లాన్ ప్రకారం ఖర్చు చేస్తే, పన్ను ఆదా చేయడానికి అనేక అవకాశాలు ఉన్నాయి. కానీ ఇది సంక్లిష్టమైన పక్రియ / అందరికీ సులంభంగా అర్థం కాదు. కొత్త వ్యవస్థలో పన్ను దాఖలు చేయడం సులభం. ఇందులో మీరు ఎలాంటి పెట్టుబడి లేదా వ్యయానికి సంబంధించిన లెక్కలు సమర్పించాల్సిన అవసరం లేదు. పాత విధానంలో, మీ పెట్టుబడులు / ఖర్చుల వివరాలు ఇవ్వాలి, ఇది కొంచెం గజిబిజిగా ఉంటుంది. పన్ను రేట్లు - పాత విధానంలో, పన్ను రేట్లు కొంచెం ఎక్కువగా ఉన్నాయి. కొత్త విధానంలో పన్ను రేట్లు తక్కువగా ఉండగా, రూ. 3 లక్షల వరకు ఆదాయంపై పన్ను లేదు, రూ. 6 లక్షల వరకు ఆదాయంపై కేవలం 5శాతం పన్ను మాత్రమే. ఫ్లెక్సిబిలిటీ- పాత విధానంలో, వివిధ పెట్టుబడులు / ఖర్చుల ద్వారా పన్నును తద్వారా మీ ఆదాయాన్ని ఆదా చేసుకోవచ్చు. కొత్త వ్యవస్థలో ఈ సౌలభ్యం లేదు. కానీ. పన్ను స్లాబ్‌లలో తగ్గింపు కారణంగా పన్ను తక్కువ పడుతుంది. మీ ఆదాయం, ఖర్చులు / పెట్టుబడి పద్ధతులపై ఇది ఆధారపడి ఉంటుంది. మీ ఆదాయం తక్కువగా ఉంటే / పన్ను ఆదా చేసే ఎలాంటి పెట్టుబడి లేకపోతే, కొత్త పన్ను విధానం అతనికి ప్రయోజనకరంగా ఉంటుందని టాక్స్ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. మీరు పన్ను ఆదా చేయడానికి ఖఖఈ, ఇఒ÷ూ, ఔఖా లేదా ఇతర పథకాలలో పెట్టుబడి పెడితే, పాత పన్ను విధానాన్ని ఎంచుకోవడం సమంజసం. ఇందులో, పన్ను మినహాయింపుల ద్వారా ఎక్కువ ప్రయోజనాలు పొందుతారు.



## చర్చ లేకుండానే జిహెచ్ఎంసి బడ్జెట్ కు ఆమోదం తెలపడం దారుణం...

- కార్పొరేటర్ మాధవరం రోజా దేవి...



**కూకట్ పల్లి జనవరి 31 వెలుతురు:**
జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశంలో ఎలాంటి చర్చ లేకుండానే బడ్జెట్ కు ఆమోదం తెలపడం దారుణమని వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అన్నారు. గురువారం జరిగిన జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశంలో చర్చ లేకుండా బడ్జెట్ ను ఆమోదించడంపై శుక్రవారం జిహెచ్ఎంసి కమిషనర్ కు తన తోటి కార్పొరేటర్ల తో కలిసి రోజా దేవి ఫిర్యాదు అందజేయడానికి వెళ్లగా కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయక్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది బడ్జెట్లో ఖర్చు చేసిన నిధులపై, ఈ ఏడాది బడ్జెట్లో కేటాయించిన నిధులపై ఎలాంటి చర్చ లేకుండా బడ్జెట్ ని ఆమోదించడం సబబు కాదన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడితే బిఆర్ఎస్ కార్పొరేటర్ లను అరెస్టు చేయడం అన్యాయం అన్నారు. ఇట్టి విషయంపై తగిన చర్యలు తీసుకొని మరొకసారి బడ్జెట్ పై చర్చ నిర్వహించాలని కోరుతూ వినతి పత్రంలో పేర్కొన్నట్లు ఆమె తెలిపారు.

## విద్యారంగంలో సంఘటిత చైతన్యం అవసరం

- తుంగతుర్తి రవి



**మేడిపల్లి, వెలుతురు:-**
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి శుక్రవారం ఏఐఎస్ఎఫ్ డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. విద్యారంగంలో సంఘటిత చైతన్యం ఎంతగానో అవసరమని ఆయన పేర్కొన్నారు.. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఏఐఎస్ఎఫ్ కృషి చేస్తుందని ఆయన ప్రశంసించారు.. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థుల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడం, విద్యా వ్యవస్థను మరింత మెరుగుపరచడం అవసరమని ఆయన పేర్కొన్నారు.. విద్యార్థులు చదువుతో పాటు సమాజహితానికి దోహదపడే కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు ఆయన.. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండి.అన్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్, జిల్లా నాయకులు కొత్తపేట సాయికుమార్, సాయి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రామయ్య సేవలు మరువలేనివి

- అమర్ సింగ్



**మేడిపల్లి, వెలుతురు:-**
పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ స్కూల్ హెడ్ మాస్టర్ టీ. రామయ్య రిటైర్మెంట్ వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మేయర్ అమర్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఉపాధ్యాయ బృందంతో కలిసి రామయ్య సన్మానం చేసి, ఆయన అందించిన సేవలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రామయ్య చేసిన విద్యా సేవలను ప్రశంసించారు. రామయ్య తన సేవా విరుద్ధమైన పట్టుదలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించారని కొనియాడారు.. ఆయన విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విశేషమైన పాత్ర పోషించారని అన్నారు.. ఆయన సేవలు మరువలేనివి అని కొనియాడారు.. ఈ వేడుకలో ఎంఈఓ శ్రీనివాస్, మేడిపల్లి హెడ్ మాస్టర్ సత్యప్రసాద్, పీర్జాదిగూడ హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వరద నీటి కాలువ నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ కళ్లెం



**వెలుతురు, హయత్ నగర్, జనవరి 31:**
హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శుక్ర వారంనాడు డివిజన్ లోని కమలా నగర్ లో జరుగుతున్న వరద నీటి కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నవ జీవన్ రెడ్డి మాట్లాడుతూ వరద నీటి కాలువ నిర్మాణం లో అక్కడే ఉన్న భూగర్భ డ్రైనేజ్ మరియు మంచినీటి పైప్ లైన్లకు ఎలాంటి ఆటంకం కలగకుండా తగుజాగ్రతలు తీసుకుంటూ వరద నీటి కాలువ నిర్మాణం చేపట్టాలని ఏఈ హేము కు సూచించారు,ఈ కార్యక్రమంలో జలమండలి సిబ్బంది బాలు , కమలానగర్ ప్రధాన కార్యదర్శి సుబ్బా రావు,మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు,

# సార్లూ...రోడ్డుపై కృష్ణవాటర్ మెయిన్ వాల్ తొలగించరూ...!



- ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా....?
- అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలి
- గ్రామస్థులు, వాహనదారుల ఆవేదన

వెలుతురు,తుక్కుగూడ 31, జనవరి: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు ప్రమాదభరి తంగా మారాయి. మహేశ్వరం ని యోజకవర్గంలోని తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని రవిరాల గ్రామం నుండి తుక్కుగూడ వెళ్లే రహదారిలో సురంగుట్ట రేణుక ఎల్లమ్మ దేవాలయం సమీపం వద్ద వాహనదారులకు శాపంగా మారిం ది. దారి మధ్యలో ఉన్న కృష్ణ వాట ర్ మెయిన్ వాల్ తొలగించి..రోడ్డు వేయాల్సి ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల ధనదాహం కారణంగా రోడ్డు వేసి చేతులు దులుపుకున్నారు. దీంతో ప్రజాధ నం వృధా అయ్యింది. రోడ్డుకు మధ్యలో కృష్ణవాటర్ మెయిన్ వాల్ ఉండడం వల్ల వాహనదారులకి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఏలాంటి ప్రమాదాలు జరగక ముందే ఆ యొక్క వాల్ ని అక్కడ నుంచి తొలగించి రోడ్డుకి బయట ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ విషయంపై గతంలో అనేకసార్లు స్థానిక అధికారులకు, ప్రజాప్రతి నిధులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు సమీపంలో వాహనదారులు నిత్యం వందలాది మంది ఈ రోడ్డు సమీపంలో ప్రయాణం చేస్తుంటా మని వాపోయారు. ఇప్పటికైనా మున్సిపల్, ప్రత్యేక అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగక ముందే ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. లేనిప క్షంలో ఆ సమస్య పరిష్కరించేంత వరకు పెద్ద ఎత్తున ఆందోళన చేప డతామని గ్రామస్తులు, వాహనదా రులు హెచ్చరించారు.

## గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ చైర్మన్ ను కలిసిన సీపీఐ నేతలు



**వెలుతురు, అబ్దుల్లా పూర్ మెట్, జనవరి 31:**
రంగారెడ్డి జిల్లా అబ్దుల్లా పూర్ మెట్ మండలం గడ్డి అన్నారం, బాటసింగారం పండ్ల మార్కెట్ చైర్మన్, చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కరాచారి లను కలిసి సీపీఐ పార్టీ నాయకులు సన్మానించారు, అలాగే గడ్డి అన్నారం, బాటసింగారం పండ్ల మార్కెట్ హమాలి లోడింగ్ మరియు అన్లోడింగ్, జీవో నెంబర్ 396 ప్రకారంగా పెరిగిన రేట్లను ఇవ్వాలని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా సీపీఐ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి ,ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, సిపిఐ పార్టీ మాజీ కౌన్సిలర్ అజ్మీరా హరి సింగ్ నాయక్,ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు కేతరాజు నరసింహ,సైదులు ముదిరాజ్. బాటసింగారం ఫ్రూట్ మార్కెట్. ఏఐటియుసి యూనియన్ నాయకులు, చిన్న గౌడ్, షరీఫ్, పోశయ్య, రాములన్న, శంకర్ నాయక్, మున్నా, కృష్ణ రాజా, ముస్తఫా, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు,

## తుక్కుగూడలో ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు...

- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

**వెలుతురు, తుక్కుగూడ 31 జనవరి:**



సీఎం రేవంత్ రెడ్డి అధికారికంగా చేపట్టిన గద్దర్ జయంతి వేడుకలు శుక్రవారం మహేశ్వరం నియోజకవ ర్గంలోని తుక్కుగూడ మున్సిపాలిటీ బస్ స్టాప్ ఆవరణంలో ఘనంగా ని ర్వహించారు. ఈ సందర్భంగా తె లంగాణ సాంస్కృతిక బృందం ప్రద ర్శించిన కళాకారులు ఆటపాటలు ఆకట్టుకున్నాయి. ఈ కారక్రమానికి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ కిచెన్నగారి లక్ష్మారెడ్డి ము ఖ్య అతిథిగా హాజరై గద్దరు చిత్రప టానికి పులవేసి ఘన నివాళు లు అర్పించి, ప్రసంగించారు. ప్రజాస్వామ్యయుతంగా ఉద్యమం చేస్తే రా జ్యాధికారం సాధ్యమని గద్దర్ భా వించరని పేర్కొన్నారు. ఓటుహక్కుతో మార్పు సాధ్యమని ఆఖరి జీవితంలో కాంగ్రెస్ పార్టీలో ఆయన చేరారని తెలిపారు. ఈ కార్యక్రమం టీపీసీసీ సభ్యులు దేపా భాస్కర్ రెడ్డి, టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచారకమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరు లు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి బడ్జెట్లో బీసీలకు లక్ష కోట్లు కేటాయించాలి

- బీసీ నేత లింగంగౌడ్ డిమాండ్



**హైదరాబాద్ వెలుతురు జనవరి 31:**
కేంద్ర ప్రభుత్వం 2025-2026 ప్రవేశపెట్టే బడ్జెట్లో జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు లక్ష కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 60 శాతానికి పైగా ఉన్నటువంటి బీసీలకు కేవలం బిక్షం వేసినట్లు కొద్ది శాతం మాత్రమే నిధులు కేటాయిస్తు ప్రతీ సంవత్సరం మొండి చేయి చూపిస్తున్నారని ఈరోజు బీసీ ప్రధాని చెప్పుకునే నరేంద్ర మోడీ కూడా బీసీల పక్షాన నిలవకుండా వ్యవహరిస్తున్నారని లింగంగౌడ్ అన్నారు. పన్నులు కట్టేది బీసీలు కానీ నిధులు మాత్రం అరకొర కేటాయిస్థారా అని ప్రశ్నిస్తున్నాము బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పించకపోతే బీజేపీ పార్టీకి తగిన బుద్ధి చెపుతాం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్, గోదా రవీందర్ పాల్గొన్నారు,

## దేవర యాంజల్ లో జరిగిన పౌర హక్కుల దినోత్సవం




**వెలుతురు, మేడ్చల్ మల్కాజ్ గిరి, జనవరి 31:**
పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్ర వారం నాడు శామీర్ పేట్ మండలంలోని దేవరయంజాల్ గ్రామంలో గల కమ్యూనిటి హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఛైర్మన్ బి.వెంకయ్య హాజరయ్యారు. అంబేద్కర్ ఫోటోకు, విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రజలు ఇచ్చిన అభ్యర్థనలను ఛైర్మన్ స్వీకరించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజన కార్యక్రమంలో పాల్గొని వారితో కలిసి భోజనం చేసారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డిఒ ఉపేందర్ రెడ్డి, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను మానవీయ కోణంలో చూడాలి

## ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ వెంకటయ్య



**వెలుతురు, మేడ్చల్ మల్కాజిగిరి, జనవరి 31:**
అణచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను మానవీయ కోణంగా ఆలోచించి ఒత్తిడులకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా చట్టపరమైన న్యాయం అందించే దిశగా జిల్లాయంత్రాంగం కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఛైర్మన్ వెంకటయ్య కోరారు. శుక్రవారం మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశమందిరంలో జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఛైర్మన్ వెంకటయ్య హాజరైనారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి వాటిని తక్షణమే పరిష్కరించి బాధితులకు వెంటనే న్యాయం చేయాలని ఈ విషయంలో సంబంధిత శాఖల అధికారులు అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టే పౌరహక్కుల రక్షణ చట్టం (ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్) - పీసీఆర్), అట్రాసిటీ నివారణ చట్టం (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ - పీవోఏ) చట్టాలను ఖచ్చితంగా అమలయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు ఉన్న కేసుల వివరాలు వాటి పురోగతి ని ఛైర్మన్ అడిగి తెలుసుకొన్నారు. ఈ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏమాత్రం పెండింగ్లో ఉంచరాదని ఆయన సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వివరించారు. ఈ కేసులపై విచారణ చర్యలను వేగవంతం చేసి సకాలంలో బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీంతో పాటు అధికారులు ఎఫ్ఐఆర్ కేసులు నమోదు అయిన వెంటనే విచారణ దశలో ఉన్న బాధితులకు నిబంధనల మేరకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్కు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సభ్యులను ఈ సందర్భంగా ఛైర్మన్ కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సంబంధిత అధికారులు పూర్తి నిబద్ధతతో తమ విధులు నిర్వర్తించాలనిఅధికారులకు సూచించారు. కేసులు పెట్టిన వారిపై రకరకాల ఒత్తిడులు వస్తుంటాయని దీనిని దృష్టిలో పెట్టుకొని వారికి పోలీసులు, ఇతర శాఖలు అండగా నిలవాలని ఛైర్మన్ స్పష్టం చేశారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ విషయంలో కేసులు నమోదైన వెంటనే త్వరితగతిన దర్యాప్తు ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ మానిటరింగ్ కమిటీకి అధ్యక్షత వహించిన మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం మాట్లాడుతూ కమీషన్ అందించిన సూచనలు పాటిస్తూ, సమస్యలను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీకి సంబంధించిన భూసమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలను 15 పని దినాలలో అందజేయాలని ఆర్డిఓలను, తహాసీల్దార్లను ఆదేశించారు. అనంతరం ప్రజలు అందించిన వినతులను ఛైర్మన్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డిసిపిలు కోటిరెడ్డి, పద్మజారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి, రాచకొండ, సైబరాబాద్ పోలీసు అధికారులు, జిల్లా ఏస్సి,ఎస్టి కమీటీ మెంబర్లు జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి వినోద్ కుమార్, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అట్టడుగు వర్గాల కోసం పోరాటం చేసిన యుద్ధ నౌక గద్దర్

- తెలంగాణ సాంస్కృతిక సారధి ఛైర్మన్ వెన్నెల

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 31:**
అట్టడుగు వర్గాల, ముఖ్యంగా దళితులు మరియు వెనుకబడిన కులాల అభ్యున్నతి కోసం కలం, గళం ద్వారా పోరాడిన మహా గాయకుడు గద్దర్ అని తెలంగాణ సాంస్కృతిక సారధి ఛైర్మన్ డాక్టర్ వెన్నెల కొనియాడారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తరపున శుక్రవారం, "మహా బోధి" విద్యాలయం, భూదేవి నగర్, వెంకటాపురం, అల్వాల్ నందు నిర్వహిస్తున్న ప్రజా గాయకుడు గద్దర్ జయంతి వేడుకలకు తెలంగాణ సాంస్కృతిక సారధి ఛైర్మన్ డాక్టర్ వెన్నెల ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అట్టడుగు వర్గాల, ముఖ్యంగా దళితులు మరియు వెనుకబడిన కులాల అభ్యున్నతి కోసం కలం, గళం ద్వారా పోరాడిన మహా గాయకుడు గద్దర్ అన్నారు. తెలంగాణరాష్ట్ర సాధనలో ముందుండి పోరాడిరాష్ట్ర సాధనలో తన వంతు కృషి చేసారని, ప్రేరేపిత పాటలను రచించి పాడి ప్రజలలో చైతన్యం నింపారని ఛైర్మన్ అన్నారు. సమాచార శాఖ ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లోని అల్వాల్ లో గద్దర్ స్థాపించిన మహా బోధి పాఠశాలలో గద్దర్ జయంతి వేడులకు నిర్వహించడం చాలా అనందంగా



ఉందన్నారు. ఛైర్మన్ గద్దర్ పాటలను పాడి అందరిని ఉత్తేజపరిచారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు గద్దర్ రచించిన పాటలు పాడి గద్దర్ జయంతి వేడుకలను విజయవంతంగా పూర్తి చేసారు. ఈ వేడుకలలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఉత్సహాంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమునికి పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం వారు ఎంతగానో సహాకరించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ఎంతో ఆకర్షనీయంగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి గద్దర్ సతీమణి



విమల, కుమారుడు సత్యం హాజరై గద్దర్ కు ఘనంగా నివాళు లర్పించారు.

# మాథర్ డైరీ రైతులకు రావాల్సిన 2నెలల పెండింగ్ పాల బిల్లులు 25కోట్లు చెల్లించాలి

- లాబాల్లో ఉన్న మాథర్ డైరీ నష్టాల్లోకి ఎందుకెళ్లిందో పాలకవర్గం రైతులకు తెలపాలి
- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి

**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 31**
రంగారెడ్డి-నల్లగొండ మథరడైరీ పాల రైతులకు రావాల్సిన పెండింగ్ పాల బిల్లులు వెంటనే విడుదల చేసి పాడి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి అన్నారు. స్థానిక సిపిఎం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాడి రైతుల సమావేశంలో మాట్లాడుతూ 1986 నుండి రంగారెడ్డి-నల్లగొండ పాల ఉత్పత్తిదారులకు సేవలందిస్తూ రైతుల కృషితో దినదినం ఆదాయంతో ముందుకు పోతుంది 24 చిల్లింగ్ కేంద్రాలు, 422సొసైటీలు, 50 వేల రైతు కుటుంబాలతో రోజుకు లక్షా పదిహేను వేల లీటర్ల పాలు పోస్తున్నారు. పాల ఉత్పత్తిరైతులకు ప్రతీ 15 రోజులకు ఒకసారి పాల బిల్లు నికరంగా చెల్లించేది కానీ పాలకవర్గం నిర్లక్ష్యం మూలంగా గత 2 నెలలుగా,నాలుగు దఫాలుగా రైతులకు 25 కోట్ల రూపాయలు పెండింగ్ ఉండటంతో పాడి రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. పాల బిల్లు సకాలంలో రాకపోవడంతో పశువులకు ఫీడు కొనలేక, ఇంటి ఖర్చులకు డబ్బులు లేక ప్రయివేట్ వ్యక్తుల వద్ద అప్పులు తెచ్చి



పశువులు అమ్ముకునే దుస్థితి ఎదురయ్యిందన్నారు. గత కాలంనుండి లాబాల్లో వెలుగొంది, భూములు, ఆస్తులను కొనుగోలు చేసిన మథర్ డైరీ ఇప్పుడు ఎందుకు నష్టాల్లో, అప్పుల్లో ఉందో పాలకవర్గం రైతులకు చెప్పాలన్నారు. ఇంతకు ముందు లీటర్ కు 4రూపాయల ప్రోత్సహాకం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఒకే దఫా వేసి చేతులు దులుపుకుందని అన్నారు. వెంటనే పాడి రైతులకు బకాయి బిల్లులు విడుదల చేసి పశు వుల దానాకు, పాడి సంరక్షణకై, మందులు, గడ్డి విత్తనాలకు యాభై శాతం సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలన్నారు. గత ప్రభుత్వం నష్టాల్లో ఉన్న విజయ డైరీకి 160కోట్లు ఎలా ఇచ్చిందో అలాగే మథర్ డైరీని కూడా ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. లేని పక్షంలో పాడి రైతులతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామ్మన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, సిరిపురం గ్రామ శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, పాలసంఘం మాజీ ఛైర్మెన్ బిట్ల రాంరెడ్డి,ఎల్ల సంతోష్ రెడ్డి, మాజీ కార్యదర్శి కూనూరు వెంకటేశం, ఎండీ రషీద్, అవనగంటి స్వామి, పల్లె సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలను తీస్తున్న మానవ మృగాలు!!!

- జీవితంలో మరణం అనేది ఎవరికి తప్పదు, కానీ ఇతరుల ప్రాణాలను హరించే హక్కు ఎవరికి లేదు.
- అది కేవలం మానవ మృగాలకు మాత్రమే సాధ్యం.

**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 31**
నేటి సమాజంలో సమయం లేదు అని సమాధి వరకు రాని చుట్టపక్కలు, చితికాలే వరకు ఉండని బంధువులు, కడచూపు వరకు రాని స్నేహితులు, కాసులు, ఆస్తులు, కొరకు కొట్టుకునే కడుపులో పుట్టిన వాళ్ళు,ఇంతలా దిగజారిపోయిన మానవీయ సమాజంలో కేవలం మతాంతర, కులాంతర, వివాహాలు చేసుకున్న కారుణంతో సొంత కుటుంబ సభ్యులను హతమార్చే ధోరణి అత్యంత దుర్మార్గనీయం. ఈ సమాజంలో మానవుడు కోతి నుండి పుట్టాడు అనేది ఎంత సహజమో కేవలం ఆడ, మగ జాతులు తప్ప మిగిలినవన్నీ కల్పితమే అంతే నిజం! ప్రేమ , కులాంతర వివాహాలు అలనాటి రాజుల కాలం నుండి నేటి ఆధునిక కాలం వరకు ప్రకృతి సిద్ధంగా జరుగుచున్నవే. కేవలం పని విభజన ప్రకారం కులాలు, మతాలు పుట్టినవి. ఎవరైనా తమ విచక్షణ జ్ఞానంతో, ఇష్ట ఇష్టాలతో వివాహం చేసుకోవడం అనేది ధర్మం, న్యాయబద్ధమైనది,వారి హక్కు. ముఖ్యంగా గత కొద్ది కాలంగా పరిస్థితులను గమనించినట్లయితే చదువుకున్నవారు, సమాజంలో అవగాహన ఉన్నవారు సైతం కులం మతం పరువు అంటూ ప్రా కులాడుతు తము ఏమి చేస్తున్నామన్న విచక్షణ కూడా కోల్పోయి హత్యలకు పాల్పడుతున్నారు. ఇందులో గమనిస్తే మిర్యాలగూడ పట్టణంలో ప్రణయ్ హత్య నుండి మొదలు, ఇబ్రహీంపట్నం 4డిసెంబర్ 2024న కానిస్టేబుల్ కొంగరి నాగమణి హత్య, సరూర్నగర్ కు చెందిన బల్లిపురం నాగరాజ్, మే 4న హత్య, జనవరి 26,2025 వడ్లకొండ కృష్ణ, కోట్ల భార్గవి సూర్యాపేట జిల్లా భార్గవి కుటుంబ సభ్యులు కృష్ణను



వ్యాసకర్త
**కునూరు శ్రీనివాస్ గౌడ్**

అతి కిరాతకంగా చంపిన చంపిన సంఘటననే ప్రస్తుతం అంశం. కేవలం కులాంతర వివాహలు చేసుకున్న కారణం చేత పగ, ఆవేశం, పరువు అనే కుల దురంకాహంకార హత్యలు మాత్రమే! రోజు రోజుకి పెట్రేగిపోతున్న పరువు హత్యలు పై ప్రభుత్వం వెంటనే స్పందించి కఠిన శిక్షలువిధించాల్సిన బాధ్యత ఉంది. సుమారు ఇప్పటికీ 128 కుల దృహంకారాత్యలు జరిగినవి. పౌర సమాజం మానవీయ కోణంలో వీటిని ఖండిస్తూ ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రవర్తించాలి. కులాంతర మతాంతర వివాహాలు చేసుకున్న జంటలు కూడా ప్రస్తుతమున్న రాగద్వేషాలు గుర్తిస్తూ కొంత దూరం ప్రాంతం వెళ్లి నివసించడం, సమాజాన్ని ఎదిరించి వివాహం చేసుకున్నందుకు మంచి ఉద్యోగ,ఉపాధి సాధించుకొని బాధ్యతగా బతకడం అలవర్చుకోవాలి. ఈ పరువు హత్యల్లో హంతకులకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ సత్వరంగా చేసి కఠిన శిక్షలు అమలు చేయాలి. కులాంతర వివాహం, ప్రేమ వివాహాలు చేసుకున్న జంటలకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి. కులం మతం అని పైశాచిక ఉన్మాదంతో మానవ ప్రాణాలను బలి తీస్తున్న మానవ మృగాలకు ప్రభుత్వపరంగా అందాల్సిన వాటిని నిలిపివేయాలి, గడువులోక శిక్ష అమలు చేయాలి. అంతేకాకుండా కుటుంబ సభ్యులు ఇష్టం లేని వివాహం చేసుకున్నారన్న కారణంతో అత్యంత దుర్మార్గంగా ఆవేశాలకు లోనై ఒకరి ప్రాణాలు తీయడం ద్వారా తీసిన వారే కాకుండా మిగిలిన కుటుంబ సభ్యులు కూడా చట్టపరమైన న్యాయపరమైన సమస్యలు ఎదుర్కోవడమే కాకుండా చనిపోయిన వాడు చనిపోతే మిగిలిన వారు కోర్టుల చుట్టూ జైలచుట్టూ తిరుగుతూ శిక్ష అనుభవించాల్సి వస్తుంది. మాన వ జీవితం క్షణభంగురం ఏ క్షణంలోనైనా ఎవరి ప్రాణమైన గాల్లో కలిసిపోవచ్చు. అలాంటి నిలకడ లేని ప్రాణం కోసం కులం, మతం అని గింజుకుంటూ చంపడం, చంపించడం మృగంతో సమానం. కావున సమస్త ప్రజలు కులం మతమని మూడ విశ్వాసాలకు పోకుండా కేవలం మానవత్వ విలువలు నైతిక విలువలతో పాటిస్తూ సమాజంలో మానవులు అందరూ సమానమని మానవుడు సంఘజీవని జీవించాల్సిందే.

**'సర్వేజనా సుఖినోభవంతు'**

# అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తాం

**నల్లగొండ వెలుతురు జనవరి 31:**
అర్హత కలిగిన పేద జర్నలిస్టులందరికీ ఇల్లు స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర రోడ్డు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక టీఎన్జీవోస్ భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని పట్టణ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా ఫోటోలు క్రీడా పోటీల్లో గెలుపొందిన జర్నలిస్టులకు బహుమతు ప్రధానం చేయడంతో పాటు, అర్హులైన జర్నలిస్టులకు ఐకాన్ ఆస్పత్రి సౌజన్యంతో 50 శాతం రాయితీతో కూడిన హెల్త్ కార్డులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకాన్ ఆస్పత్రి సౌజన్యంతో 50% రాయితో కూడిన ఉచిత వైద్య సేవలను అందించడం అభినందనీయం అన్నారు. నల్లగొండ పట్టణంలో అర్హత కలిగిన జర్నలిస్టులకు గతంలో దివంగము దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. కాని సుప్రీంకోర్టు నిర్ణయం మేరకు పట్టాల పంపిణీ ఆలస్యం జరుగుతుందన్నారు. ఇప్పటికే పట్టణంలో పేదలందరికీ ఇండ్లను ఇచ్చే కార్యక్రమం కొనసాగుతుందని పేద విలేకరులందరికి కూడా అందులో అవకాశం కల్పిస్తామన్నారు. ప్రతి ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడం జరుగుతుంది అన్నారు. ఐఐటి, ఎంబిబిఎస్ వంటి వాటిల్లో ప్రతిభ చాటిన పేద విద్యార్థులకు పూర్తి సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. దేశంలో ఎక్కడైనా ప్రతిభ కనబర్చిన వారికి ప్రతి ఫౌండేషన్ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. నల్లగొండ పట్టణాభివృద్ధికి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఘాట్ రోడ్ నిర్మాణంతోపాటు కోట్ల రూపాయల వ్యయంతో అనేక కార్యక్రమాలు చేపడం జరిగింది అన్నారు. జర్నలిస్ట్ సంక్షేమం కోసం ఎల్లవేళలా కృషి చేయడం జరుగుతుంది అన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కోటగిరి దైవాదినం, ఏచూరి భాస్కర్ , పహీముద్దీన్, గుండె గోని జయశంకర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పులి మామిడి మహేందర్ రెడ్డి గాదె రమేష్ , కోశాధికారి దండంపల్లి రవికుమార్ తదితరు పాల్గొన్నారు .

# సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ సర్వీసెస్ పైన అవగాహన సదస్సు.





**హైదరాబాద్, వెలుతురు జనవరి 30:**
21st సెంచరీ ఐఏఎస్ అకాడమీ సహకారంతో వింగ్స్ మీడియా, జి5 మీడియా గ్రూప్‌ల ఆధ్వర్యంలో కొంపల్లిలోని సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో "మొదటి ప్రయత్నంలోనే సివిల్ సర్వీసెస్‌ను ఎలా ఛేదించాలి" అనే అంశంపై సెమినార్‌ను గురువారం విజయవంతంగా నిర్వహించారు. 21st సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ శ్రీ పి. కృష్ణ ప్రదీప్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ , ఒకరి చిరునామా అవసరమైన వారికి మనం "కేర్-ఆఫ్ అడ్రస్" గా నిలిచే స్థితిలో ఉండాలని , అది మనకి గౌరవాన్ని అందిస్తుందని అన్నారు . "దబాంగ్ ఆఫీసర్" గా ప్రసిద్ధి చెందిన ఐఏఎస్ అధికారి అమిత్ కటారియా గురించి చెబుతూ తన భార్య ఆదాయం ద్వారా తన కుటుంబాన్ని పోషిస్తూ కేవలం ఒక రూపాయిని తన జీతంగా తీసుకొని దేశం కోసం నిస్వార్థ సేవ చేస్తున్నారని , విద్యార్థులు కూడా ఇలా ప్రిపేర్ అవాలని చెప్పారు. 21st సెంచరీ ఐఏఎస్ అకాడమీ చీఫ్ మెంటర్ మరియు డైరెక్టర్ డాక్టర్ భవానీ శంకర్ మాట్లాడుతూ ఐఐటీలు మరియు ఐఐఎంల వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు మాత్రమే సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించగలరనే అపోహను కొట్టిపారేశారు. 6వ తరగతి పాఠ్యాంశాల్లోని అనేక UPSC ప్రశ్నలు కాన్సెప్ట్‌ల ఆధారంగానే ఉంటాయి కాబట్టి సాధారణ డిగ్రీ కళాశాలల విద్యార్థులు కూడా విజయం సాధించవచ్చని ఆయన హైలైట్ చేశారు. ఈ కార్యక్రమంలో లో సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ పి. సంతోష్ కుమార్ పాత్ర ,ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గార్ల రమేష్, వింగ్స్ మీడియా డైరెక్టర్ శ్రీ గిరి ప్రకాష్ , ఎడిటర్ శ్రీ గణేష్ , మేనేజర్ . ప్రసాద్ -మేనేజర్ , అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు .

# వలిగొండ శాంతి నిలయం బాలికల గృహం ను తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జ్ ఎం ఉషశ్రీ

- పిల్లలకు ఎలాంటి లోటు రాకుండా చూసుకోవాలి





**వలిగొండ వెలుతురు న్యూస్ జనవరి 31**
మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో, చైర్మన్ ఎం ఉషశ్రీ శాంతి నిలయం బాలికల గృహాన్ని తనిఖీ చేసి వసతులు ఏర్పాట్లు భోజనం డార్మెటరీ బాత్రూంలను తనిఖీ చేయడం జరిగింది. అనంతరం మాట్లాడుతూ పిల్లలకు ఎలాంటి లోటు రాకుండా ప్రభుత్వం పెట్టిన నిబంధనలకు అనుగుణంగా పిల్లలకి సేవలు అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ మామిడి వెంకట్ రెడ్డి ,అడ్వకేట్ రోసి, మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఇన్చార్జి బాలగోని సాయి దీప్, పారా లీగల్ వాలంటీర్స్ శ్రీశైలం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గొంతుకై పోరాడిన వ్యక్తి గద్దర్

- ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్



**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 31:**
కాళ్లకు గజ్జె కట్టి తన ఆటపాటలతో పేద ప్రజల గొంతుకై నిలిచిన ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళులను తెలంగాణ రాష్ట్ర ప్రజా నాట్య మండలి అధ్యక్షుడు కురిమిద్దే శ్రీనివాస్ అర్పించారు, హైదరాబాద్ రవీంద్ర భారతీ లో నిర్వహించిన గద్దర్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు, ఈ సందర్భంగా గద్దర్ గురించి మాట్లాడారు, సమాజంలో దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా ప్రశ్నిస్తూ. జీవితాంతం పేదవర్గాల పక్షాన గొంతెత్తిన బాహుబలి గద్దర్ అని శ్రీనివాస్ పేర్కొన్నారు,అణచివేతలను ఎదిరించి అడవిలోకి వెళ్లినా. తిరిగి వచ్చి ప్రజా సమీకరణతో పోరాటం చేసిన అది ధీనజనుల పక్షమేనని చెప్పారు,తెలంగాణ కోసం పాదయాత్ర నిర్వహించి. తన ఆటపాటలతో ప్రజల్లో తెలంగాణ ఆకాంక్షను రగిలించిన గొప్ప వ్యక్తి గద్దర్ అని శ్రీనివాస్ తెలిపారు,ఆయన పోరాటంలో ఐసుమంతైనా వ్యక్తిగత ప్రయోజనం లేదు. కడవరకు పేదల కోసమై నిలబడిన గద్దర్ జయంతి సందర్భంగా ఆ మహానీయుడు త్యాగాన్ని, పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకుందామంటూ శ్రీనివాస్ తెలిపారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా సంఘాల నాయకులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు,

# తండాలన్నీ కలిపి ఒక ఏం.పి.టి.సి గా ఏర్పాటు చేయాలి

- ఎస్సీ నాయకుల వినతి



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు జనవరి 31:** నారాయణపురం మండల పరిధిలో గుడిమల్కాపురం ఎంపీటీసీ పరిధి ఉన్న రాచకొండ కడిల బావి తండా, తుంబావి తండా, వెంకం భావి తండా గ్రామ పంచాయతీలను కలిపి నూతనంగా ఎంపీటీసీ పరిధి ఏర్పాటు చేయాలని ఈరోజు నారాయణపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రమోద్ కుమార్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ మాధవ రెడ్డి , జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ బాలు నాయక్, మండల నాయకుడు గోవర్ధన్ నాయక్, ఎస్టీషియల్ అధ్యక్షుడు కరంటోత్ రమేష్ నాయక్, మండల్ నాయకుడు రవీందర్ నాయక్,ప్రజ్ఞా నాయక్ ,లచ్చనాయక్ నాగరాజు ,కే శీను నాయక్ ,మోతియా నాయక్, రాజు నాయక్, గన్నునాయక్, సిద్దు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# హయత్ నగర్ లో ఇంటిరీయర్స్ కార్యాలయంను ప్రారంభించిన గాదరి



**వెలుతురు, హయత్ నగర్, జనవరి 31:** నేటి సమాజంలో గృహ నిర్మాణం ఆధునికత వైపు మొగ్గు చూపడం ద్వారా ఇంటిరీయర్స్ కు మంచి భవిష్యత్తు ఉందని తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ అన్నారు, రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ లో నాంపల్లి ప్రణయ్ నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్, ఆర్, వై- ఇంటిరీయర్స్ కార్యాలయం ను మాజీ ఎమ్మెల్యే కిషోర్ కుమార్ శుక్ర వారం నాడు ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ఎస్ ఆర్ వై ఇంటిరీయర్స్ కార్యాలయ ప్రతినిధులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మంజూరైన డ్రిప్ లక్ష్యాన్ని తొందరలోనే పూర్తి చేస్తాం....





**జహీరాబాద్ వెలుతురు జనవరి 31:** జిల్లాకు మంజూరైన డ్రిప్ లక్ష్యాన్ని తొందరలోనే పూర్తి చేస్తామని జిల్లా హార్టికల్చర్, సెరికల్చర్ అధికారి సోమేశ్వర్ రావు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామంలోని రైతులకు మంజూరైన డ్రిప్ పరికరాలు, డ్రిప్ పైప్ లను, బిగించుకున్న విషయమై పరిశీలించేందుకు అయన క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. అయన వెంట జహీరాబాద్ హార్టికల్చర్ అధికారి పండరి, వివిధ డ్రిప్ ఇరిగేషన్ సంస్థ ల సిబ్బంది విజయ్, మాణయ్య, సతీష్, మోహన్ ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా హార్టికల్చర్ అధికారి సోమేశ్వర్ రావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2,400 హెక్టార్ల విస్తీర్ణం లో డ్రిప్ మంజూరాయిందని, ఇప్పటి వరకు 1300 హెక్టార్ల మేర డ్రిప్ సిస్టం ను రైతులు బిగించుకున్నారని, మరో 1100హెక్టార్లలో 750 హెక్టార్ల మేర డ్రిప్ ప్రగతి లో ఉందని తెలిపారు. తమ శాఖ మంజూరు చేసిన డ్రిప్ సిస్టం ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, చెరుకు అల్లం తో పాటు ఆయిల్ పామ్ పండించే రైతులకు సైతం డ్రిప్ ను మంజూరు చేశామని, ఇవి బిగించుకున్నవారి పొలాలను పరిశీలించేందుకు క్షేత్ర స్థాయి లో పర్యటిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న డ్రిప్ ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# 9 వ వార్డు సీసీ రోడ్ల పనుల పర్యవేక్షణ



**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 31 :** నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని తొమ్మిదవ వార్డులో సీసీ రోడ్ల పనుల తాజా మాజీ కౌన్సిలర్లు శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా 9వ వార్డు కౌన్సిలర్ సవిత మన్మాండ్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సహకారంతో 9వ వార్డులో అన్ని రోడ్లు కవర్ అయ్యేలా సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని తద్వారా వార్డు ప్రజలకి మంచి రవాణా సౌకర్యాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వివేకానంద, రాజేష్ చౌహన్ తదితరులు ఉన్నారు.

# జిహెచ్ఎస్ గంజ్ బోనగిరి ప్రధానోపాధ్యాయురాలు గారికి ఘనంగా ఉద్యోగ విరమణ అభినందన సభ

**భువనగిరి వెలుతురు జనవరి 31:** శుక్రవారం రోజున 31 జనవరి 2025న గవర్నమెంట్ హైస్కూల్ గంజ్ భువనగిరి ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి బి రేణుక గారి ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ గారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు చాలా ఘనంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా శ్రీమతి రేణుక పాఠశాలకు చేసిన సేవలను పలువురు కొనియాడారు. పదవీ విరమణ పొందుతున్న రేణుక మాట్లాడుతూ పాఠశాల స్టాఫ్ సహాయంతో శ్రేయోభిలాషుల సహకారంతో తక్కువ సమయంలోనే వీలైనంత చేయగలిగానని అన్నారు. ఈ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులు చక్కగా చదివి ఉపాధ్యాయుల యొక్క సూచనలు సలహాలు పొంది 100% ఉత్తీర్ణత పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సీనియర్ ఉపాధ్యాయులు మూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు





వెంకటరమణ, రామలింగయ్య, కృష్ణ, సంతోష్, శ్రవణ్, రాము, ఉపాధ్యాయినిలు విజయ శ్రీ, ఉపేంద్ర, పావని, ఇంగ్లీషు ఉపాధ్యాయులు మల్లేష్ హిందు ఉపాధ్యాయులు సుధాకర్, షెహనాజ్ తదితరులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు. సోమేశ్వర శర్మ పాడిన పాటలు, సన్మాన పత్రం లయబద్ధంగా చదవటం, వారి యొక్క వ్యాఖ్యానం అందరినీ ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో జిటిఏ జిల్లా అధ్యక్షులు పాశం కృష్ణమూర్తి , తపస్ జిల్లా అధ్యక్షురాలు ఉమా ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పాఠశాల సిబ్బంది ఉద్యోగ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి రేణుక, కరుణాకర్ రెడ్డి గార్ల దంపతులను ఘనంగా సన్మానించారు



# తెల్లరేషన్ కార్డ్ ఉన్న ప్రతీ ఒక్కరికి లేబర్ కార్డ్ ఇవ్వాలి

- సిపిఐ నాయకులు చిరంజీవి





**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 31 :** నారాయణఖేడ్ పట్టణంలోని సహాయ కార్మిక శాఖ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన కార్మికులను సహాయ కార్మిక అధికారి గిరిరాజు మరియు కార్యాలయ సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని సిపిఐ నాయకులు అన్నారు. శుక్రవారం కొందరు కార్మికులతో కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లేబర్ కార్డ్ కోసం మీ సేవలో ఆన్లైన్ చేసుకొని డాక్యుమెంట్స్ తీసుకోచ్చిన వారందరికీ అధికారి చేతులు,కాళ్ళు చూపించు నీ చేతులకు మట్టిలేదు,కాళ్లకు దుమ్ములేదు,నీ బట్టలు తెల్లగా ఉన్నాయి, చెప్పులు మంచివి వేశావు కాబట్టి నువ్వు లేబర్ కావు అంటు ఇబ్బందుకు గురిచేస్తున్నాడు అన్నారు.అదేవిధంగా ప్రతీ పేపర్ పై గజిటెడ్ సంతకం కావాలి లేనియెడల చెల్లుబాటు కాదు అంటున్నాడు.అప్పుడప్పుడు మాత్రమే విధులకు హాజరవుతు కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఆన్లైన్ అయినా తర్వాత కార్డ్ కోసం వచ్చిన వారిని హైదరాబాద్ ఆఫీస్ కు వెళ్ళండి,గట్టిగ మాట్లాడితే ఇక్కడినుండి ఆఫీస్ తీసేస్తాము సంగారెడ్డి, హైదరాబాద్ వెళ్లి పనులు చేసుకోండి అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు అన్నారు.చాలామంది కార్మికులు గతంలోనే ధరఖాస్తూ చేసుకున్నవారు కార్డ్ కోసం కార్యాలయానికి వస్తే ఎవరికి ఇచ్చావు లేదా మళ్ళీ ధరఖాస్తూ చేసుకో అంటూ ఉచిత సలహాలు ఇస్తున్నాడు అన్నారు. ఇటువంటి అధికారిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని లేనియెడల కలెక్టర్ కు పిర్యాదు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు అశోక్,కార్మికులు విజయ్, నరేష్, యాదగిరి, సాయులు తదితరులు ఉన్నారు.

# సేంద్రీయ ఎరువులు వాడి పంటలను పండించాలి





**జహీరాబాద్ వెలుతురు జనవరి 31:** 25వ పాత పంటల జాతరలో భాగంగా ఈ శుక్రవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని జంలైతాండ, శేఖాపూర్ తాండలలో నిర్వహించడం జరిగింది. ఉదయం 11.40ని.లకు వెలుగు సి.ఎ, వార్డ్ మెంబర్, గ్రామస్తులు కలిసి బండ్లకు పూజలు చేసి జాతరను ప్రారంభించినారు. జాతరలో భాగంగా తాండ ప్రజలు ఆటపాటలతో, విత్తనాలతో అలంకరించిన బండ్ల ఊరేగింపును తాండలోని వీధి వీధి యందు కొనసాగింది. ఈ జాతరలో తాండకు చెందిన చిన్న, పెద్ద అందరు కలిసి జాతరలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్ కుమార్, డిడియస్ మాట్లాడుతూ ఈ పాత పంటల జాతరను అందరు మనది అనే విధంగా జరుపుకుంటున్నారు. చిరుధాన్యాలు పండించే పద్ధతి, పశువులు, మన భూమి, మన ఆరోగ్యం మంచిగా వుండాలని, ఈ పంటలు పెట్టి మన ఆరోగ్యం కాపాడుకోవాలి అనేది మన ఉద్దేశమన్నారు. సర్కార్ ఎరువులు వాడకుండా. సేంద్రీయ ఎరువులు వాడాలని వారు రైతులకు సూచించారు. అదేవిదంగా రమేష్, పంటల యాజమాన్య శాస్త్రవేత్త, డిడియన్ కెవికె మాట్లాడుతూ డిడియస్ కెవికె యందు మట్టి పరీక్షలు చేయించుకోవాలి, మన భూమి మట్టి పరీక్షలు చేస్తే ఎటువంటి ఎరువులు వాడాలి, ఎటువంటి పంటలు పండించాలి. అనేది తెలస్తుంది. విత్తనాలు మనవి మనమే దాచుకోవాలి. చిరుధాన్యాలతో చిన్న పిల్లలకు బిస్కెట్లు, మురుకులు చేసి ఇవ్వవచ్చు. మన సేంద్రీయ ఎరువులు వాడాలి, సర్కార్ ఎరువులు వాడడం వలన మన ఆరోగ్యం ఖరాబు అయి లక్షల కొద్ది రూపాయిలు ఆసుపత్రిలకు ఖర్చు చేస్తున్నాము. అటువంటివి వాడకుండా మన పెంట ఎరువులు వాడాలి, మన ఆరోగ్యం కాపాడుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో జాతర కోఆర్డినేటర్లు వినయ్ కుమార్, మంజుల, డిడియస్ సిబ్బంది చుక్కమ్మ, విజయలక్ష్మి, జనరల్ నర్సమ్మ, అల్గోల్ నర్సమ్మ, హుమ్నాపూర్ లక్ష్మమ్మ, చిన్న నర్సమ్మ, శ్రీలయ, నర్సిములు, ప్రహ్లాద్, బాలయ్య గ్రామ కార్యకర్తలతో పాటు డిడియస్ కెవికె పంటల యాజమాన్య శాస్త్రవేత్త రమేష్, గ్రామస్తులతో పాటు హైద్రాబాద్ నుండి వచ్చిన విజిటర్స్ పాల్గొన్నారు.

## నూతన చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ చేర్మెన్ వై.నరోత్తం..



**జహీరాబాద్ వెలుతురు జనవరి 31:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండలం ఇప్పేపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన నూతన చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీఎస్ఎస్ సిసిడిసి మాజీ చేర్మెన్ వై.నరోత్తం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జీసస్ చూపిన సన్మార్గంలో అందరూ నడుచుకోవాలని, చర్చిలు ప్రశాంతతకు నిలయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డి.యస్. సుకుమార్, సి.ప్రకాష్, పాస్టర్ డి.అరుణ్ కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం రోజున తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వ కలసిన కోలా రమేష్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు జనవరి 31:**

## బాదం ఆకుపై మార్కండేయుడు



**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 31 :** నారాయణఖేడ్ పట్టణంలో ప్రపంచమంతా దేవి యొక్క మహిమాన్వితమైన శక్తితో నడుస్తుంది అని శ్రీ భక్త మార్కండేయుడు శ్రీ దుర్గా సప్తశతి లో వివరించారు .పద్మశాలి వంశ మూల పురుషుడు మార్కండేయుడు అటువంటి మహనీయుడు భక్తమర్కండేయుడు.ఈ మహనీయుని జయంతి సందర్భంగా బాదం ఆకుపై మార్కండేయుని చిత్రంలో శ్రీ భక్త మార్కండేయ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. గుండు శివ కుమార్ లీఫ్ ఆర్టిస్ట్ నారాయణఖేడ్..

## ప్రతిష్టాత్మకంగా ద్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం



**జహీరాబాద్ వెలుతురు జనవరి 31:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హొతి కే గ్రామ శివారులోగల తుల్జా భవాని మాత మరియు మహేశ్వరి మాత శ్రీ ఆయి మాత ఆలయము ప్రాంగణం నందు శుక్రవారం శ్రీ వేణు భట్ మహారాజు ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రం నుండి వచ్చిన వేద పండితులచే ప్రతిష్టాత్మక మగ ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. కార్యక్రమంలో నందున శ్రీమంత్ పూజారి, గడ్డం జనార్ధన్,నరసింహారెడ్డి ,సగ్గంశ్రీనివాస్, ఎర్రమల్లి సుధాకర్, మాణిక్యం, చంద్రయ్య , హరి, ప్రభు ,అంబదాస్, బెజగం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లాలో పులి సంచారం భయాందోళనలో బెల్లంపల్లి నియోజకవర్గం



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 31:** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం లోని కాజీపేట మండలం గ్రామ శివారులో పెద్దపులి అడుగుజాడలను గుర్తించిన ఫారెస్ట్ అధికారులు పరిశోధ గ్రామ ప్రజలు రాత్రిపూట సంచరి వద్దని పొలాలకు వెళ్లే రైతులు గుంపులుగా వెళ్లాలని అలాగే అప్రమత్తంగా ప్రజలు ఉండాలని ఫారెస్ట్ అధికారిలు కోరారు.

# బాలికలు అన్ని రంగాలలో రాణించాలి

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 31:** బాలికల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి అన్నారు. శుక్రవారం బేటి బచావో – భేటీ పడావో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మహాత్మా గాంధీ జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని, చదువులపై ప్రత్యేక శ్రద్ధ కలిగి, ఉత్తమ లక్ష్యాన్ని ఎంచుకుని లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలని సూచించారు. బాలికలు, మహిళల సంక్షేమం కోసం న్యాయవ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఏదైనా సలహా కోసం డిఎల్ఎస్ఎ ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నెంబర్ 15100 లో సంప్రదించాలని తెలిపారు. ప్రతి ఆడపిల్ల



సమాజంలో భద్రతాయుతమైన జీవనాన్ని గడిపే విధంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వం జిల్లా మహిళా, సంక్షేమ శాఖ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ఆపత్కర పరిస్థితిల్లో బాలికలు చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 ను సంప్రదించాలని తెలిపారు. పిల్లల రక్షణ కొరకు పోక్సో చట్టం ద్వారా బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నామని, బాలికలు, మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త సౌజన్య, డిస్ట్రిక్ట్ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ మహమ్మద్ సందాని, మహిళా సాధికారత కేంద్రం, ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు లిప్సిక, పాఠశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# మన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నది

## ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్





**ఆదిలాబాద్ వెలుతురు జనవరి 31:** మన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు శుక్రవారం పట్టణంలోని బాలాజీ హెూమ్స్ కాలనీలో శ్రీ హనుమాన్ మందిరం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ఆలయ శంకుస్థాపనకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హిందూ సంస్కృతి సంప్రదాయాలను పిల్లలకు తెలియజేయాలని సూచించారు. నిత్యజీవితంలో ప్రతిరోజు సాధ్యమైనంతవరకు గుడికి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మయూర్ చంద్ర అశోక్ రెడ్డి గంగ్రత్ మహేందర్ కార్తీక్. గంగాధర్ శివ కాలనీవాసులు తదితరులున్నారు.

# అందరి ఆరాధ్య దైవం నాగోబా

**భారతదేశంలోని అతిపెద్ద ఆదివాసి జాతర పేరు ఉన్నటువంటి కెస్లాపూర్ నాగోబా జాతర**

**ఆదిలాబాద్ ఎంపీ గేడం నగేష్, ఎమ్మెల్యే పాయాల్ శంకర్,**



**ఆదిలాబాద్ వెలుతురు జనవరి 31:** ఎన్నో ఏళ్ల నుంచి సాంప్రదాయంగా వస్తున్నటువంటి ఆదివాసులకుల దైవం నాగోబా జాతర గిరిజన సాంప్రదాయాల్లో మాకున్నటువంటి సంస్కృతి, సంప్రదాయాలు , అలవాట్లు, జీవన విధానంలో అంతర్భాగమనీ అదిలాబాద్ ఎంపీ జి. నగేష్ అన్నారు. ఈ సమాజంలో ఆదివాసి దేవతలందరిని కూడా ఆరాధించడం, రెండు రోజుల కిందట మహా పూజ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనేక సంవత్సరాలుగా అఖిలప జిల్లా నే కాకుండా తెలంగాణ రాష్ట్రం, చత్తీస్గఢ్, ఆనేక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు నమ్మకంతో తరలివస్తున్నారన్నారు. భారతదేశంలోని అతిపెద్ద ఆదివాసి జాతర పేరు ఉన్నటువంటి కెస్లాపూర్ నాగోబా ఆలయాన్ని దర్శించడం జరిగిందని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆదిలాబాద్ అన్నారు. నాగోబా జాతర సందర్భంగా శుక్రవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పయాల్ శంకర్, అదిలాబాద్ ఎంపీ జి. నగేష్ తో కలిసి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ అందరి ఆరాధ్య దైవం నాగోబా అని అన్నారు. ఈ ఆలయానికి తెలంగాణ, మహారాష్ట్ర, వివిధ ప్రాంతాల నుండి వందల సంవత్సరాల నుండి భక్తులు దర్శించుకుంటున్నారన్నారు. నాగోబా ఆలయాన్ని గొప్పగా అభివృద్ధి చేసినటువంటి నాగోబా కేంద్రాన్ని భవిష్యత్తులో ఇంకా అభివృద్ధి చేయాల్సింది అన్నారు. గత ఎంపీ సమయంలో అభివృద్ధి జరిగిందని, ప్రస్తుత ఎంపీ ఇంకా అభివృద్ధి కోసం కేంద్రం నుండి నిధులు తీసుకురావాలని ఎంపీ కు కోరారు..



# వారం రోజులుగా తల్లి శవంతో ఇంట్లోనే కూతుళ్లు

- అంత్యక్రియలకు డబ్బులు లేక .. ఎవరికీ చెప్పలేదన్న వాదన
- తల్లి మరణంతో డిప్రెషన్‌లోకి వెళ్లారని మరో కథనం
- విషయం తెలుసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**హైదరాబాద్,జనవరి31(వెలుతురు):**

అకస్మాత్తుగా తల్లి మరణం.. ఆమె ఇద్దరు కుమార్తెలను మానసికంగా కుంగిపోయేలా చేసింది. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో తల్లి మృతదేహంతో ఒకే ఇంట్లో నాలుగు రోజులుగా ఉండిపోయారు కుమార్తెలు. ఈ హృదయవిదారక ఘటన సికింద్రాబాద్ వారాసిగూడలో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. సికింద్రాబాద్ వారాసిగూడ పోలీసుస్టేషన్ పరిధిలోని బౌద్ధనగర్‌లో లలిత అనే మహిళ మృతిచెందారు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు.. లలిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. లలిత చనిపోయి నాలుగు రోజులవుతోందని పోలీసులు భావిస్తున్నారు. ఆమె గుండెపోటుతో మరణించిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధరణకు వచ్చారు. తల్లి అకస్మాత్తుగా చనిపోవడంతో ఆమె ఇద్దరు కుమార్తెలు రవళిక, యశ్విత మానసిక ఒత్తిడికి గురయ్యారు. ఏం చేయాలో తెలియక నాలుగు రోజులపాటు అదే ఇంట్లో ఒక గదిలో తల్లి మృతదేహాన్ని ఉంచి, మరో గదిలో వారిద్దరూ ఉన్నట్లు తెలుస్తోంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని వారాసిగూడ పోలీసులు తెలిపారు. అయితే మరో కథనం కూడా ఇందులో ఉంది. సికింద్రాబాద్ వారాసిగూడలో వెలుగులోకి వచ్చిన ఘటన.. అందరికీ కన్నీళ్లు తెప్పిస్తుంది. తల్లి చనిపోయి వారం రోజులు అవుతుంటే.. అంత్యక్రియలకు డబ్బులు లేక ఇంట్లోనే వారం రోజులు.. తల్లి శవంతో గడిపిన ఆ ఇద్దరు పిల్లల మానసిక పరిస్థితి ఏంటన్నది చర్చ సాగుతోంది. బౌద్ధనగర్‌లో లలిత (45) తన ఇద్దరు కూతుర్లు రవళిక (25), అశ్విత (23)తో కలిసి నివాసం ఉంటుంది. కరోనా సమయంలో లలిత భర్త కుటుంబాన్ని వదిలి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇద్దరు ఆడకూతుర్ల బాగోగులు లలితనే చూసుకుంటుంది. ఈ క్రమంలోనే లలిత అనారోగ్యానికి గురి అయ్యింది. ట్రీట్మెంట్ చేయించుకునేందుకు డబ్బులు లేకపోవడంతో అలాగే ఇంట్లో ఉంటుంది. దీంతో ఆరోగ్యం మరింత విషమించి జనవరి 23న అంటే తొమ్మిది రోజుల క్రితం లలిత మరణించింది. తల్లి మరణంతో డిప్రెషన్ లోకి వెళ్లిన కూతుర్లు.. దహన సంస్కారాలకు డబ్బులు లేక తల్లి మరణవార్తను ఎవరికీ చెప్పలేదు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి చూడగా లలిత మృతి చెంది ఉంది. కూతుళ్లను ప్రశ్నించగా.. జనవరి 23వ తేదీన తమ తల్లి చనిపోయిందని.. అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో విషయాన్ని ఎవరికీ చెప్పలేదన్నారు. మొదట ఖంగుతున్న పోలీసులు.. చివరకు అర్థం చేసుకుని లలిత మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. తల్లి శవంతోటే ఇద్దరు కూతుర్లు తొమ్మిది రోజుల పాటు ఇంట్లో ఉన్నారన్న విషయం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. లలిత మృతికి గల కారణం ఏంటన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.



# అభయారణ్యంలోని ప్రధాన ప్రాంతం గుండా వెళ్ళే వాహనాలకు పర్యావరణ రుసుము

- జిల్లా అటవీ అధికారి శివ్ఆశిష్ సింగ్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 31:**

మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు డివిజన్ ప్రాణహిత కృష్ణ జింకల వన్యప్రాణుల అభయారణ్యం ప్రధాన ప్రాంతం గుండా వెళ్లే వాహనాల నుండి పర్యావరణ రుసుము వసూలు చేయడం కొరకు ప్రతిపాదించడం జరిగిందని జిల్లా అటవీ అధికారి శివ్ఆశిష్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూరు డివిజన్ పరిధిలోని ప్రాణహిత కృష్ణ జింకల అభయారణ్యంలోకి ప్రవేశించే వాహనాలకు పర్యావరణ రుసుము వసూలు చేసేందుకు యెంచపల్లి రక్షిత అటవీ ప్రాంతంలోని కంపార్ట్మెంట్ నం.329 లో, కోటపల్లి క్షేత్రంలోని పార్పల్లి, చెన్నూర్ క్షేత్రంలోని కిష్టంపేట బీట్ వై –జంక్షన్ వద్ద 2 చెక్ పాయింట్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. అభయారణ్యంలోని ప్రధాన ప్రాంతం గుండా వెళ్లే రహదారిలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, వాటర్ బాటిల్లు, విస్మరించిన ఆహార పదార్థాలు లేకుండా ఉంచడం ప్రధాన ఉద్దేశంగా పర్యావరణ రుసుము వసూలు చేసేందుకు ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు.

# వైద్యం వికటించి వివాహిత మృతి




**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 31:**

మంచిర్యాల జిల్లా కేంద్రంలో ని ఓ ప్రవేటు ఆసుపత్రి లో వైద్యుల నిర్లక్ష్యంతో వైద్యం వికటించి వివాహిత మృతి చెందిందని ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన... దండేపల్లి మండలం కన్నె పెల్లి గ్రామానికి చెందిన ముత్తెం రాజేశ్వరి అనే మహిళ అస్వస్థత కు గురవడంతో నిన్న రాత్రి మంచిర్యాల పట్టణంలోని టచ్ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించిన కుటుంబ సభ్యులు... గుండెకు అంజియోగ్రం చేసి రెండు గదులకు స్టంట్స్ వేసిన వైద్యులు, ఆపరేషన్ విఫలం అవడంతోనే మృతి చెందిందని బంధువుల ఆరోపణ, మృత దేహంతో ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టిన మృతురాలి బంధువులు, విచారణ చేపట్టిన పోలీసులు.

# మంచిర్యాల జిల్లాలో గుండె సంబంధిత మరణాలపై ఆందోళన

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 31:**



ఇటీవల మంచిర్యాల జిల్లాలో గుండె సంబంధిత వ్యాధులతో మరణాల సంఖ్య పెరుగుతున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. వైద్య నిపుణులు, ఆరోగ్య సంస్థలు ఈ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి, ప్రైవేట్ ఆస్పత్రుల పనితీరు, చికిత్సా విధానాలు, అధిక బిల్లులు వంటి అంశాలపై దృష్టి సారించాలి. వైద్య నిపుణులు గుండె సంబంధిత వ్యాధుల పెరుగుదలకు మారుతున్న జీవనశైలి, అధిక ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం లోపం వంటి అంశాలు కారణమని సూచిస్తున్నారు. అయితే, ప్రైవేట్ ఆస్పత్రులలో అధిక బిల్లులు, నిర్లక్ష్య వైద్యం వంటి ఆరోపణలు కూడా ఉన్నాయి.ఈ నేపథ్యంలో, ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడం, గుండె సంబంధిత సమస్యల కోసం నమ్మకమైన వైద్యులను సంప్రదించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం ముఖ్యమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# ఫామ్‌హౌజ్‌లో కెసిఆర్ కుంభకర్ణ నిద్ర

- అసెంబ్లీకి రావాలంటేనే భయపడుతున్న నేత
- మంత్రి కోమటిరెడ్డి ఘాటు వ్యాఖ్యలు



**హైదరాబాద్,జనవరి31( వెలుతురు):**

అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలపై చర్చించాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫాంహౌస్ లో కుంభకర్ణుడిలా నిద్రపోతున్నాడని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. అసెంబ్లీకి రావాలంటే భయపడుతున్నాడంటూ.... బిచ్చగాళ్లు అవగాహన లేకుండా మాట్లాడుతుంటే సమాధానం చెప్పాల్సిన అవసరంలేదన్నారు. కాంగ్రెస్ ఎంపీలు కొట్లాడితేనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్న మంత్రి కోమటిరెడ్డి... తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పాత్ర శూన్యమన్నారు. అప్పట్లో రాజీనామా చేయడం.. బైఎలక్షన్ నిర్వహించడం.. ఆంధ్రనేతల దగ్గర డబ్బులు తీసుకోవడం కేసీఆర్‌కు అలవాటుగా మారిందన్నారు. మ్మడి నల్గొండ జిల్లా, పాలమూరుకు నీళ్లు అందించే ఎస్ ఎల్‌బీసీ ప్రాజెక్టు లపై కక్షగట్టి కేసీఆర్ పూర్తి చేయలేదన్నారు. అందుకే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారంటూ... ఇప్పుడు బయటకు వచ్చిన కేసీఆర్?.. దెబ్బ కొడితే లేవలేరు అంటున్నారు ... మేము తిరగబడితే కేసీఆర్, కేసీఆర్ పార్టీ ఉండదని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. కొంతమంది బీఆర్?ఎస్? నేతలు ఫోన్ టాపింగ్ కేసులో తప్పించుకొని తిరుగుతున్నారు ... అమెరికా నుంచి ఇండియాకు రావాలంటే భయపడుతున్నారని .. కేసిఆర్ కుటుంబంపై అవినీతి.. అక్రమాలపై అనేక కేసులు ఉన్నాయి . పదేళ్లలో పేదలకు ఇల్లు ఇవ్వకపోగా.. కనీసం ఎన్నికల్లో హామీ ఇచ్చిన పథకాలు అమలు చేయలేదని విమర్శించారు మంత్రి కోమటిరెడ్డి.

# ప్రజలు కేసీఆర్‌ను రోజూ గుర్తు చేసుకుంటున్నారు - నిరంజన్‌రెడ్డి



హైదరాబాద్,జనవరి31( వెలుతురు):

తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడు.. కానీ ఈ రాష్ట్ర ప్రజలు ప్రతిరోజు కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారు అని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను కోరుకుంటుంటే.. కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేక పోతుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ రైతు అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 420 రోజులు అవుతుంది. కానీ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదు. రాష్ట్రంలో వివిధ రకాల పంటలు పండించిన రైతులు, మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ హయంలో ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించాం. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర రావడం లేదు. రైతు భరోసా రాక, రుణమాఫీ జరగక నిరాశతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని నిరంజన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులపైన రాష్ట్ర వ్యాప్త పర్యటనకు శ్రీకారం చుట్టాం. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను పరామర్శించి, కొంత ఆర్థిక సాయం అందజేశాం. మేము రైతులను పరామర్శిస్తుంటే కాంగ్రెస్ పార్టీ అక్కసు వెళ్లగక్కుతుంది. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తుంటే పోలీసులు అనుమతి ఇవ్వడం లేదు. ప్రజా పాలనలో పోలీస్ కమాండ్ కంట్రోల్ నుంచి పరిపాలన చేస్తున్నారని నిరంజన్ రెడ్డి విమర్శించారు. రాజ్యాంగ విలువలు పట్టించుకోకుండా.. రాజ్యాంగాన్ని పట్టుకొని తిరుగుతున్న వ్యక్తి రాహుల్ గాంధీ. రాజకీయాలు మాట్లాడకూడని చెప్పిన స్పీకర్ రాజకీయాలు మాట్లాడుతున్నారు. మహాత్మాగాంధీ ఆశయాలకు వారసులమని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారు. మహాత్మా గాంధీ అబద్ధాలు చెప్పొద్దని అనేవారు.. కాంగ్రెస్ నాయకులు మాత్రం రోజు అబద్ధాలు మాట్లాడుతున్నారు. తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యలపై స్పందిస్తాం.. కానీ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యలను మేము పట్టించుకోం అని నిరంజన్ రెడ్డి తేల్చిచెప్పారు.

# రేవంత్‌రెడ్డి అధికారం కోసమే బూటకమే హామీలు - గొంగిడి సునీత



హైదరాబాద్,జనవరి31( వెలుతురు):

సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చేందుకు బూటకపు హామీలు ఇచ్చాడని, తెలంగాణలో 420 హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీ చార్ సౌ బీస్ పార్టీగా మారిందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత తీవ్ర విమర్శలు చేశారు. దొంగ గాంధీలు తెలంగాణకు వచ్చి తప్పుడు డిక్లరేషన్లు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మీడియాతో మాట్లాడారు. ఈ రోజు కాంగ్రెస్ ప్రభుత్వానికి 420 రోజులు నిండాయి. హామీలు అమలు చేయలేకపోతున్న కాంగ్రెస్ పార్టీకి సద్బుద్ధిని ప్రసాదించాలని మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పించాం. గాంధీ విలువలు కేసీఆర్ పాటిస్తే కాంగ్రెస్ వాటిని తుంగలో తొక్కింది. రైతు భరోసా, రుణమాఫీ, రేషన్ కార్డుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. కేసీఆర్‌పై అబద్ధాలు ప్రచారం చేస్తూ కాంగ్రెస్ నేతలు గోబెల్స్‌ను మించిపోయారు అని గొంగిడి సునీత మండిపడ్డారు. ఏడాదిలోపే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అశోక్ నగర్‌లో నిరుద్యోగులకు రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. కనీసం అందులో పావలా వంతు కూడా ఇప్పించలేక పోయారు. కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా ఉద్యోగాలు ఇచ్చినా కాంగ్రెస్ నేతలు ఉద్యోగాలు ఇవ్వలేదని ప్రచారం చేశారు. గురుకులాల్లో పిల్లలు వసతులు లేకుండా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి పట్టింపు లేదు. విద్యార్థుల తల్లిదండ్రుల గుండె కోతపై ప్రభుత్వం స్పందించడం లేదు. యూరియాకు కూడా రైతులు చెప్పులు క్యూలో పెట్టే పరిస్థితి వచ్చింది. రేవంత్ రెడ్డికి మంచి బుద్ధిని ప్రసాదించి హామీలు అమలు చేసేలా చూడాలని జాతి పితను వేడుకుంటున్నాం అని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత పేర్కొన్నారు.

# కేంద్ర మంత్రులకు తప్పిన ప్రమాదం

హైదరాబాద్,జనవరి31( వెలుతురు):

ఏపీ పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రులకు తృటిలో ప్రమాదం తప్పింది. విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మిక, ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపేందుకు వచ్చిన వారికి దారిలో ఊహించని ప్రమాదం ఎదురైంది. విశాఖ షీలానగర్‌లో మంత్రులు ప్రయాణిస్తున్న కాన్వాయ్‌లో మూడు వాహనాలు ఒకదానితో మరొకటి ఢీకొన్నాయి. ఎనిమిది వాహనాల కాన్వాయ్‌లో మూడు కార్లు ఢీ కొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మూడు కార్లు దెబ్బతిన్నాయి. మాజీ ఎంపీ జీవీఎల్ కారు ధ్వంసమైంది. అయితే ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది జీవీఎల్ కారును పక్కకు తీశారు. అనంతరం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రమంత్రులు వెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసుల సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసింది.

# గడ్డకట్టే ఉష్ణోగ్రతలతో ఇబ్బందులు

- విమానం కూలిన నదిలో మైనస్ డిగ్రీ
- నదిలో పడ్డవారు బతకడం కష్టమే అంటున్న అధికారులు

వాషింగ్టన్,జనవరి31( వెలుతురు):

అమెరికా రాజధాని వాషింగ్టన్ సమీపంలో విమానం-హెలికాప్టర్ ఢీకొన్న ఘటనలో బాధితులకు మరో ముప్పు పొంచి ఉంది. ఆ శకలాలు పడిన పోటోమాక్ నదిలో ఉష్ణోగ్రతలు -1 నుంచి -2 సెల్సియస్ వరకు ఉండొచ్చని అక్కడి నేషనల్ వెదర్ సర్వీస్ పేర్కొంది. దీనివల్ల ఒక్కసారిగా బాధితుల శరీరాలు కోల్డ్ షాక్‌కు గురికావచ్చని నిపుణులు చెబుతున్నారు. దీంతో ఊపిరాడకపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు లేదా హైపర్ రీవెంటిలేషన్ వంటి పరిస్థితి తలెత్తొచ్చు. దీంతో వారు స్పందించే వేగం తగ్గిపోయి.. హృదయ స్పందన, రక్తపోటులో తీవ్రమైన మార్పులకు గురికావచ్చని వెదర్ సర్వీస్ విభాగం వెల్లడించింది. వారు అధిక సమయం అదే నీటిలో ఉంటే.. హైపోథెర్మియా అనే పరిస్థితికి గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉన్నట్లు చెబుతున్నారు. గాలితో పోలిస్తే మనిషిలోని ఉష్ణోగ్రతను నీరు



26 రెట్లు వేగంగా తగ్గిస్తుంది. శరీరం కంటే నీటి ఉష్ణోగ్రత చాలా తక్కువ కావడంతో కేవలం మూడు నిమిషాల్లోనే మానసికంగా బాగా కుంగిపోతారు. కేవలం 15 నిమిషాల్లో స్పృహ కోల్పోయే అవకాశం ఉంది. అటువంటి వాతావరణంలో గాయపడిన వ్యక్తులు 30 నుంచి 90 నిమిషాలు మాత్రమే బతికే అవకాశం ఉన్నట్లు వెదర్ సర్వీస్ వెల్లడించింది. రీగన్ ఎయిర్‌పోర్టులో రన్‌వే వైపు ప్రయాణిస్తుండగా.. విమానాన్ని అమెరికా ఆర్మీకి చెందిన బ్లాక్‌హాక్ హెలికాప్టర్ ఢీకొన్నట్లు తెలుస్తోంది. దీంతో అమెరికన్ ఈగల్ ÷÷-లట్ 5342 రెండు ముక్కలుగా విరిగిపోయి కూలినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మరోవైపు హెలికాప్టర్ తల్లకిందులుగా పడినట్లు పేర్కొన్నారు. ఈ బ్లాక్‌హాక్ వర్జీనియాలో ఫోర్ట్ బెల్వోయి స్థావరం నుంచి సైనికులతో వస్తున్నట్లు గుర్తించారు. ఈ ప్రమాద వివరాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయనే స్వయంగా గాలింపు చర్యలను పర్యవేక్షిస్తానని వెల్లడించారు. ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు రీగన్ ఎయిర్‌పోర్టు కార్యకలాపాలను సస్పెండ్ చేశారు. ఇక్కడికి రావాల్సిన విమానాలను మరోచోటికి మళ్లించారు. అమెరికాలోనే అత్యంత రద్దీ రన్‌వే రీగన్ ఎయిర్‌పోర్టులోనే ఉంది. దీనిపై నుంచి నిత్యం సగటున 800 విమానాలు టేకాఫ్ అవుతాయని ఎన్‌బీసీ న్యూస్ పేర్కొంది. పైలట్లకు ఇక్కడ ల్యాండింగ్, టేకాఫ్ అత్యంత సవాళ్లతో కూడుకున్నదని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రమాదానికి గురైన బ్లాక్ హాక్ హెలికాప్టర్‌ను శిక్షణకు వాడుతున్నట్లు అమెరికా సైనిక వర్గాలు ధ్రువీకరించాయి. విమానాన్ని ఢీకొన్న సమయంలో కూడా అందులో శిక్షణ ఇస్తున్నట్లు తేలింది. ఇది 12వ ఏవియేషన్ బెటాలియన్‌కు చెందినదిగా తేలింది.

# ఏపీ అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ

అమరావతి,జనవరి31( వెలుతురు):

ఆంధ్రప్రదేశ్‌లో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి సర్కార్ విధివిధానాలు ఖరారు చేసింది. ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం 2025 పేరిట ఆక్రమించుకున్న భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి నిబంధనలు జారీ చేసింది. ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించి గతంలో జారీ చేసిన ఉత్తర్వులన్నింటిని పక్కన పెడుతూ జీవో నెంబర్ 30ని జారీ చేసింది. 2019 అక్టోబర్ 15 తేదీని కట్ ఆఫ్ డేట్‌గా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తేదీ కంటే ముందు ఆక్రమిత స్థలాల్లో నివాసం ఉంటేనే క్రమబద్ధీకరణ దరఖాస్తు చేసేందుకు అవకాశం కల్పించింది. మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, లే అవుట్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ గట్లు, ఇతర జలవనరులకు సంబంధించిన స్థలాల్లో క్రమబద్ధీకరణ సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఖాళీ స్థలాలు, వాటిలో తాత్కాలిక ఇళ్లు కట్టుకున్నా క్రమబద్ధీకరణకు అనర్హులని పేర్కొంటూ మార్గదర్శకాలు జారీ చేసింది. 150 గజాల వరకూ ఉచితంగానే క్రమబద్ధీకరణ చేయనున్నట్టు వెల్లడించింది. 301 గజాల కంటే ఎక్కువ




భూమి ఆక్రమణలో ఉంటే సాధారణ రిజిస్ట్రేషన్ విలువతోనే క్రమబద్ధీకరణ చేసేందుకు అవకాశం కల్పిస్తూ.. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలు (బీపీఎల్) ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని ఇళ్లు, గుడిసెలు వేసుకొని ఉంటే అందులో 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు. పేదలు కాని వారు ఉన్నా 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు. దీనికోసం ఈ ఏడాది డిసెంబరు 31 వరకు గ్రామ,వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలి. వీటిపై గ్రామ వీఆర్వో, వార్డు అధికారులు విచారణ జరిపి ఆయా ప్రాంతాలను బట్టి తహసిల్దార్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లకు నివేదికలు ఇస్తారు. వాటిని సబ్ డివిజనల్ కమిటీలో చర్చించి ఆమోదిస్తారు. ఆ తర్వాత లబ్ధిదారుల ఎంపికపై ఆదేశాలు ఇస్తారు. వాటి ఆధారంగా తహసిల్దార్ కన్వేయెన్స్ డీడ్ల రూపంలో క్రమబద్ధీకరణ ఉత్తర్వులు ఇస్తారు. రెండేళ్ల తర్వాత లబ్ధిదారులకు ఆ భూములపై శాశ్వత హక్కులు ఇస్తారు. ఇదిలాఉండగా, గతంలో జగన్ సర్కారు వద్ద దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నవారు,అసలు దరఖాస్తు చేసుకోనివారు కూడా ఇప్పుడు తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చునని రె వెన్యూశాఖ మార్గదర్శకాల్లో పేర్కొంది. ఇంటిస్థలాల క్రమబద్ధీకరణకు ఎంపికై న వారు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులను రెండు వాయిదాల్లో చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. సీఎఫ్ఎంఎస్‌లో ఫీజులు చెల్లింపు ఉంటుందని రెవెన్యూశాఖ తెలిపింది. భూముల బేసిక్ విలువను జిల్లా కలెక్టర్ ఖరారు చేస్తారని పేర్కొంది.

# గన్‌మెన్ లేకుండా జనంలోకి వెళ్లిన ఎమ్మెల్యే

అమరావతి,జనవరి31( వెలుతురు):

ఎమ్మెల్యే అంటేనే ఆయన చుట్టూ గన్‌మెన్‌లు, వ్యక్తిగత సిబ్బంది, కార్యకర్తలు ఉంటారు. ఎక్కడికి వెళ్లిన ఆయన వెంట భద్రతా సిబ్బంది ఖచ్చితంగా ఉంటారు. ఎమ్మెల్యే ఎలాంటి అభివృద్ధి పనులు చేసినా, ప్రజలను కలిసినా మీడియాలో వచ్చేస్తుంది. కానీ ఇప్పుడు మనం చెప్పుకోబోయే ఎమ్మెల్యే మాత్రం అందుకు భిన్నంగా ప్రవర్తించారు. ఎలాంటి సెక్యూరిటీ లేకుండా ప్రజల వద్దకు వెళ్లారు ఎమ్మెల్యే. బైక్‌పై వీధుల్లో తిరుగూతూ ప్రజలతో ముచ్చటించారు. ద్విచక్రవాహనంపై తిరుగుతున్న ఎమ్మెల్యేను వీడియో తీసిన కొందరు వాహనదారులు దాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అది కాస్తా వైరల్‌గా మారింది. ఇంతకీ ఎవరా ఎమ్మెల్యే.. బైక్‌పై తిరుగుతూ ఆయన చేసిన పనులేంటో ఇప్పుడు చూద్దాం. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. "ప్రజలారా ప్రశ్నించండి... మీరు ఎన్నుకున్న ఈ ప్రజా ప్రభుత్వం మీకోసమే పనిచేస్తుందంటూ" ద్విచక్ర వాహనంపై గుడివాడ వీధుల్లో తిరిగారు ఎమ్మెల్యే. గన్ మ్యాన్, వ్యక్తిగత సిబ్బంది లేకుండానే రాము పర్యటించారు. రోడ్ల వెంబడి చిరు వ్యాపారులు, దుకాణదారులు, టీ స్టాల్స్, హోటళ్లకు వెళుతూ ప్రజలతో మాట్లాడారు. రాము వెంట ఆఖరికి మీడియాను



గాని అధికారులను కానీ ఎవరిని రానివ్వకుండా ప్రత్యక్షంగా ప్రజల వద్దకు వెళ్లి వాళ్లతో ముచ్చటించారు.. " నన్ను ఎన్నుకున్న మీకు నాకు మధ్య.. మధ్యవర్తులు ఉండరు" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలతో నేరుగా మాట్లాడేందుకే వెళుతున్నా అంటూ మీడియాకు తెలియజేశారు. తాను అడిగిన ప్రశ్నలకు ప్రజలు సంతృప్తికరమైన సమాధానాలు ఇస్తున్నారన్నారు. గుడివాడలో కొన్ని వర్గాల నుంచి టీడీపీకి చెందినవారు డబ్బులు వసూలు చేస్తున్నారనే ప్రచారంపై ప్రజలను నేరుగా ప్రశ్నించినట్లు తెలిపారు. అనేక ప్రాంతాల్లో తిరిగిన తనకు అలాంటిదేం లేదని ప్రజలు నేరుగా చెప్పారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. తమ తమ ప్రాంతంలో అధికారులు కానీ, రాజకీయపక్షాలు కానీ ఎక్కడైనా అవినీతికి అక్రమాలకు పాల్పడితే తక్షణమే సమాచారం ఇవ్వాలని కలిసిన ప్రజలకు ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే రాము పర్యటనకు సంబంధించి వీడియోలను వాహనదారులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవి కాస్తా వైరల్‌గా మారాయి. ప్రధాన రహదారులతో పాటు రైతు బజార్లోనూ రాము తిరిగారు. విషయం తెలుసుకున్న వెంటనే మీడియా ప్రతినిధులు రైతు బజార్‌కు చేరుకున్నారు. "గుడివాడ అభివృద్ధికి మీకేం కావాలి నేనేం చేయాలి నేరుగా నాతో చెప్పండనీ ప్రజలతో అన్నారు ఎమ్మెల్యే. నేరుగా మీ సమస్యలు ఇబ్బందులు నాకు తెలియచేయండి. మీ ప్రాంతంలోని అపరిష్కృత సమస్యలను తెలియజేసి వెంటనే వాటి పరిష్కారానికి నాంది పలకాలి" అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు.

# భారీ జన సందోహం నడుమ ఈదమ్మ తల్లి ఊరేగింపు

కొల్లాపూర్,జనవరి31( వెలుతురు):

సురభి రాజుల సంస్థానంలో ప్రజలను ప్లేగు వ్యాధి నుండి కాపాడితే ఈదమ్మ తల్లికి గుడి నిర్మాణం చేపడతానని సురభి సంస్థానాధీశులు ముడుపు కట్టారు. దీంతో సంస్థానంలో ప్లేగు వ్యాధులు తగ్గడంతో సున్నపు గచ్చుతో అమ్మవారి విగ్రహం చేయించి ప్రతిష్టించారు. వందల సంవత్సరాల క్రితం ఈదమ్మ తల్లి కొల్లాపూర్ ప్రజలకే కాక సమీప గ్రామాల ప్రజలకు ఇలవేల్పుగా ఉన్నది. గత కొన్ని దశాబ్దాలుగా ఆలయం శిథిల వ్యవస్థకు చేరడంతో పాటు అమ్మవారి విగ్రహం కండనం జరిగింది. కండనం జరిగిన విగ్రహానికి పూజలు జరగడం ఆగమ శాస్త్రానికి విరుద్ధమని కొల్లాపూర్ ప్రజలు, రైతులు ఆలయ పునర్ నిర్మాణం చేపట్టడం కోసం ఎంతో ప్రయత్నించారు. ఎంతోమంది నాయకులు చుట్టు తిరిగిన ఆలయం పునర్నిర్మాణం కోసం ఎవరు ముందుకు రాలేదు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి దృష్టికి రావడంతో విగ్రహంతో పాటు నా సొంత నిధులతో ఆలయ పున:నిర్మాణం చేపడతానని ముందుకొచ్చి పనులు ప్రారంభించారు. మహాబలిపురంలో కృష్ణశిల రాయితో అమ్మవారి విగ్రహాన్ని తయారు చేయించారు. ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావడంతో



ఈ నెల 29న గణపతి పూజతో ఆలయ ప్రతిష్ట కార్యక్రమం ప్రారంభమైంది. రెండో రోజైన గురువారం నాడు వేలాది భక్త జన సందోహం మధ్యలో కొల్లాపూర్ పట్టణంలోని మాధవస్వామి ఆలయం నుంచి ఈదమ్మ తల్లి ఆలయం వరకు అమ్మవారి విగ్రహం ఊరేగింపు కన్నుల పండువగా కొనసాగింది. అమ్మవారి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దూరెడ్డి రఘువర్ధన్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సందర్భంగా చిన్నారుల కోలాటంతో పాటు పోతురాజుల వేషాలు, డప్పు వాయిద్యాలు ప్రదర్శన అలరింపజేశాయి.

# బీఆర్ఎస్ కార్పొరేటర్ల అరెస్టు అక్రమం : కేటీఆర్

హైదరాబాద్,జనవరి31( వెలుతురు):



జీహెచ్ఎంసీ పాలకమండలి సమావేశంలో హైదరాబాద్ నగరాన్ని పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టినందుకు బీఆర్ఎస్ కార్పొరేటర్‌లను అరెస్టు చేయడం దుర్మార్గం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హైదరాబాద్ నగరానికి నిధులు ఇవ్వడం లేదని కోటి మంది నగర ప్రజల తరఫున ప్రశ్నిస్తే బయటకి గెంటేస్తారా? అని నిలదీశారు. గత సంవత్సరం పెట్టిన బడ్జెట్ నిధులను కనీసం కూడా ఖర్చు చేయకుండా.. మరోసారి అవే కాగితాలపైన అంకెలు మార్చి గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ మోసాన్ని అడ్డుకున్నందుకు మా ప్రజాప్రతినిధుల గొంతు నొక్కుతారా? అని రేవంత్ సర్కార్‌ను కేటీఆర్ ప్రశ్నించారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి కనీస ప్రజావసరాలను కూడా సరిగ్గా నిర్వహించలేని జీహెచ్ఎంసీ అసమర్థ తీరును ప్రశ్నిస్తే కూడా ఈ ప్రభుత్వం జీర్ణించుకోవడం లేదు. హైదరాబాద్ నగర ప్రజల సమగ్ర అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ప్రారంభించిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు.

# జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్ సమావేశం రసాభాసగా

- మేయర్ పోడియంపైకి ప్లకార్డులను విసిరేసిన కార్పొరేటర్లు
- మేయర్‌ను అడ్డుకున్న బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు
- తోసేసుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు



**హైదరాబాద్,జనవరి31( వెలుతురు):**
జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్ సమావేశం రసాభాసగా మారింది. మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం గురువారం ఉదయం ప్రారంభమైంది. అయితే సమావేశం మొదలైన వెంటనే గందరగోళ పరిస్థితి నెలకొంది. ముందుగా బడ్జెట్ ప్రవేశపెడుతామని మేయర్ చెప్పగా.. అందుకు బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు ససేమిరా అన్నారు. ముందు ప్రజా సమస్యలపై మాట్లాడాలని రెండు పార్టీల సభ్యులు పట్టుబట్టారు. ప్లకార్డులు పట్టుకుని మేయర్ పోడియం వద్దకు వచ్చిన బీఆర్ఎస్ కార్పొరేటర్లను కాంగ్రెస్ కార్పొరేటర్లు అడ్డుకున్నారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్.. బీఆర్ఎస్ సభ్యుల నుంచి ప్లకార్డులను లాక్కొని చించేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఇరు పార్టీల కార్పొరేటర్లు ఒకరినొకరు తోసేసుకున్నారు. సమావేశం మొదలైన ఐదు నిమిషాల్లోనే తీవ్ర గందరగోళం నెలకొనడంతో మార్షల్స్ కౌన్సిల్ మీటింగ్‌లోకి ప్రవేశించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు ఒకరినొకరు తోసుకోవడంతో పాటు దుర్భాషలాడుకున్నారు. మేయర్ పోడియంపై బీఆర్ఎస్ సభ్యులు ప్లకార్డులు విసిరారు. వెంటనే మార్షల్స్ అక్కడకు చేరుకుని బీఆర్ఎస్ కార్పొరేటర్లను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను రాష్ట్రంలో అమలుకావడం లేదని, గ్రేటర్ హైదరాబాద్‌లో నిధులు ఎక్కడిక్కడ దుర్వినియోగం అవుతున్నాయని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగట్లేదని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్లకార్డులు పట్టుకుని కౌన్సిల్ మీటింగ్‌కు వచ్చారు. మేయర్ వద్దకు దూసుకెళ్తున్న క్రమంలో కాంగ్రెస్ కార్పేరేటర్లు సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్ వారిని అడ్డుకున్నారు. వెంటనే మార్షల్స్ అక్కడకు చేరుకుని బీఆర్ఎస్ కార్పొరేటర్లను అరెస్ట్ చేశారు. మరోవైపు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై బీఆర్ఎస్ కార్పొరేటర్లు విరుచుకుపడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒకటే అని అందుకే సమావేశం ముందుకు జరగకుండా ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారని కమలం పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు.

# 27 ఎకరాల్లో రూ. 2వేల కోట్లతో ఉస్మానియా ఆసుపత్రి

- 30 డిపార్టుమెంట్‌లు, 2వేల పడకలు




**హైదరాబాద్,జనవరి31( వెలుతురు):**
హైదరాబాద్ గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో 27 ఎకరాల్లో దాదాపు 2వేల కోట్ల అంచనా వ్యయం తో ఈ కొత్త ఆస్పత్రి నిర్మాణం జరగనుంది. 30 డిపార్ట్‌మెంట్‌లు, 2వేల పడకలు, ఫిజియోథెరపీ, డెంటల్, కాలేజ్‌లు, హాస్టల్ వసతితో ఆసుపత్రి నిర్మాణం జరగనుంది. అడ్డంకులు దాటుకొని శంకుస్థాపనకు సిద్ధం అయింది ఉస్మానియా జనరల్ ఆసుపత్రి. రానున్న టెక్నాలజీ కాలానికి అనుగుణంగా హెలిప్యాడ్ వసతి,ఆసుపత్రి మురుగు నీరు శుద్ధి చేసేందుకు ప్లాంట్, విశాలమైన పార్కింగ్ ఫెసిలిటీ తో కొత్త ఆస్పత్రి అందుబాటులోకి రానుంది. ప్రతి డిపార్ట్‌మెంట్ కోసం స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఫెసిలిటీస్‌తో కూడిన ఆపరేషన్ థియేటర్లు, పోస్ట్ ఆపరేటివ్ వార్డులు, ఐసీయూ వార్డులు అందుబాటులో ఉంటాయన్నారు. కిడ్నీ, లివర్, స్కిన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ల కోసం అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగం కొత్త ఉస్మానియాలో అందుబాటులోకి రానున్నాయి. పేషెంట్ల సౌకర్యార్థం అన్ని రకాల డయాగ్నసిస్ సేవలను ఒకే చోట అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లో ఓపీ సేవలు అందించాలని పేషెంట్ల కోసం విశాలమైన వెయిటింగ్ హాల్స్, కనీసం రోజూ 3 వేల నుంచి 5 వేల మంది పేషెంట్లు వచ్చే అవకాశం ఉన్నందున, ఇందుకు అనుగుణంగా ఓపీ కౌంటర్ల నిర్మాణం జరగనుంది.ఓపీ కోసం గంటల తరబడి లైన్‌లో నిలబడే ప్రసక్తే ఉండకుండా నిర్మాణం. కొత్త ఉస్మానియాలో నర్సింగ్, డెంటల్, ఫిజియో థెరపీ కాలేజీలు అందుబాటులోకి..స్టూడెంట్ల కోసం హాస్పిటల్ ఆవరణలోనే హాస్టల్స్‌ను నిర్మనం. 750 సీట్లతో కూడిన భారీ ఆడిటోరియం అందుబాటులోకి రానుంది.

# వేములవాడలో లారీ బీభత్సం

**వేములవాడ,జనవరి31( వెలుతురు):**
వేములవాడలో లారీ బీభత్సం సృష్టించింది. గురువారం ఉదయం పట్టణంలోని మొదటి బైపాస్ రోడ్డులోని మహాలక్ష్మి వీధిలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. అక్కడితో ఆగని లారీ.. మూలవాగు వంతెనపై డివైడర్లను ఢీకొట్టి.. తిప్పాపూర్‌లోని కదిరే రాజమల్లయ్య దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో రాజ మల్లయ్య బైక్ కన్సల్టెన్సీలోని ఐదు వాహనాలు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో ఓ కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లి చెందిన అజ్మీరా కల్యాణ్ నాయక్(29) నిజామాబాద్ జిల్లా డిచ్ పల్లి 7 వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా, బుధవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళుతున్న క్రమంలో కల్యాణ్ నాయక్‌ను లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో మృతుడి స్వగ్రామం గర్జనపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సుష్మ, కుమార్తె అభియుక్త, కుమారుడు అభిషేక్ ఉన్నారు.

# సచివాలయంలో నకిలీ ఉద్యోగుల హల్‌చల్

- ఉద్యోగుల పేరుతో దర్జాగా చక్కర్లు

**హైదరాబాద్,జనవరి31( వెలుతురు):**
తెలంగాణ సచివాలయంలో నకిలీ ఉద్యోగుల వ్యవహారం కలకలం రేపింది. ఫేక్ ఐడెంటిటీ కార్డులతో సచివాలయంలోకి ఎంట్రీ ఇచ్చిన సదరు వ్యక్తులు.. ఉద్యోగుల పేరిట దర్జాగా తిరుగుతూ సెక్షన్ ఆఫీసుల్లో హల్‌చల్ చేశారు. సెక్షన్ ఆఫీసుల్లో పనులు చేపిస్తామంటూ దందాలకు దిగారు. నకిలీ ఉద్యోగుల సమాచారంతో సచివాలయ భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. నకిలీ ఉద్యోగుల కదలికలపై సెక్రటేరియట్ సిఎస్ఓ దేవిదాస్ ఆదేశాల మేరకు ఇంటెలిజెన్స్ నిఘా పెట్టింది. పూర్తి ఆధారాలు సేకరించిన తర్వాత ఎంతో చాకచక్యంగా ఓ నకిలీ ఉద్యోగిని ఎస్పీఎఫ్ ఇంటెలిజెన్స్ ఏఎస్ఐ యూసుఫ్,హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు పట్టుకున్నారు. ఖమ్మంకు చెందిన భాస్కర్ రావు... రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా ఫేక్ ఐడీ కార్డుతో చలామణి అవుతున్నట్లు గుర్తించారు. మైనార్టీ డిపార్ట్మెంట్ సెక్షన్ ఆఫీసర్ వి. ప్రశాంత్ డ్రైవర్ రవి.. భాస్కర్ రావు ఫేక్ ఐడి కార్డు తయారు చేసినట్లు ఎస్పీఎఫ్ ఇంటెలిజెన్స్ గుర్తించింది. ఈ క్రమంలో డ్రైవర్ రవిని కూడా ఎస్పీఎఫ్ ఇంటెలిజెన్స్ అదుపులోకి తీసుకుంది. రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్‌గా ఫేక్ ఐడీ కార్డుతో చలామణి అవుతున్న భాస్కర్ రావు, డ్రైవర్ రవిని ఇంటెలిజెన్స్ ఫిర్యాదుతో సైఫాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రాష్ట్ర పరిపాలన వ్యవహారాలన్నీ సచివాలయం నుంచే నడుస్తుంటాయి. సీఎం, మంత్రులు, విభాగాధిపతులు అంతా ఇక్కడే ఉన్న నేపథ్యంలో ఎంట్రీపై కొంత నియంత్రణ ఉంటుంది. ఉద్యోగులతో పాటు మంత్రులను కలవాలనుకునే విసిటర్స్.. ఓ పద్ధతి ప్రకారం పాసులు తీసుకుని లోపలికి వెళ్ళ్సి ఉంటుంది. కానీ ఇటీవలి కాలంలో అన్ని ఫ్లోర్లలో విజిటర్స్ సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఈ క్రమంలో పాసులు ఉన్నవారినే లోపలికి అనుమతిస్తూ నిఘాను పెంచారు సచివాలయ భద్రతా సిబ్బంది. ఈ నేపథ్యంలో ఉద్యోగుల పేరుతో నకిలీ ఐడెంటిటీ కార్డులతో కొందరు వ్యక్తులు లోపలికి వెళ్తున్న విషయం బయటకు వచ్చింది. కొంతమంది ఫేక్ ఐడెంటికీ కార్డుతో లోపలికి ప్రవేశించి ఎంతో దర్జాగా సెక్షన్ ఆఫీసుల్లో తిరుగుతూ దందాలు చేస్తున్న పరిస్థితి. ఈ విషయం సచివాలయ భద్రతా సిబ్బంది దృష్టికి వచ్చింది. దీంతో ఇంటెలిజన్స్ అధికారులు ఎంతో చాకచక్యంగా నకిలీ ఉద్యోగులను పట్టుకున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ మీడియా సమావేశంలో ఉద్యోగి పేరిట హల్‌చల్ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తే అసలు విషయం బట్టబయలైంది. నకిలీ ఐడెంటిటీ కార్డుతో చలామణి అవుతున్న విషయం బయటపడింది. ఖమ్మం జిల్లాకు చెందిన భాస్కర్ అనే వ్యక్తి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగిగా నకిలీ ఐడెంటిటీకార్డు తీసుకుని సెక్షన్‌లో దర్జాగా తిరుగుతున్నట్లు ఇంటెలిజెన్స్ గుర్తించారు. ఇతనికి సహకరించిన రవి అనే వ్యక్తిని కూడా అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు పోలీసులు.




# ఏపీ సీఎం చంద్రబాబు ప్రత్యేక సమావేశం

- ప్రధానంగా 15 ప్రాజెక్టుకు ఆమోదం తెలుపుతూ నిర్ణయం

**అమరావతి,జనవరి31( వెలుతురు):**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం అమరావతిలో స్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డ్ 3వ సమావేశం జరుగుతోంది. ఈ భేటీలో ప్రధానంగా 15 ప్రాజెక్టులకు సంబందించి పెట్టుబడులకు ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకోనున్నారు. రూ. 44,776 కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఈ సమావేశంలో ఆమోదం తెలుపనున్నారు. ఈ పెట్టుబడుల ద్వారా దాదాపు 20 వేల మందికి ఉద్యోగాలు వచ్చే అవకావముంది. గత రెండు సమావేశాల్లో ఆమోదం పొందిన ప్రాజెక్టుల స్థితిగతులపైనా ఈ రోజు చర్చ జరుగుతోంది. ఒప్పందాలపై పరిశ్రమల యాజమాన్యాలతో నిరంతర చర్చల ద్వారా సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేలా చూడాలని సిఎం సిఎం చంద్రబాబు సూచించారు. అధికారులు, మంత్రులు పెట్టుబడులను ట్రాక్ చేయడం ద్వారా త్వరితగతిన ఫలితాలు చూపించాలన్నారు. తీవ్రమైన పోటీ నెలకొన్న నేటి పరిస్థితుల్లో ఫలితాలు రావాలంటే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేసి చూపాలని మంత్రులకు చంద్రబాబు సూచించారు. రాష్ట్ర స్థాయిలో అనుమతులు, క్షేత్ర స్థాయిలో పనులపై కలెక్టర్లతో సమీక్ష చేయాలని ప్రధాన కార్యదర్శికి ముఖ్యమంత్రి ఆదేశించారు. పెట్టుబడులపై దిగ్గజ సంస్థల నుంచి, జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తల నుంచి వస్తున్న స్పందన సంతృప్తి కరంగా ఉందని చంద్రబాబు అభిప్రాయ పడ్డారు. ప్రతి అవకాశాన్ని రాష్ట్రానికి పెట్టుబడులు సాధించేందుకు ఉపయోగించుకోవాలని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. కాగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు శుభవార్త అందించింది. వాట్సాప్ గవర్నెన్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఏపీలో గురువారం నుంచి వాట్సాప్ గవర్నెన్స్ అందుబాటులోకి రానుంది. దీనిద్వారా మొదటి విడతగా 161 సేవలను ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. రెండో విడతలో మరిన్ని సేవలు అందుబాటులోకి తెస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై సీఎం చంద్రబాబు సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించడానికి, పౌరులకు అవసరమైన సమాచారం అందించడం, ధ్రువపత్రాల జారీ లాంటి పలు సేవలు ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందుబాటులోకి రానున్నాయి. వాట్సాప్ ద్వారా సేవలు అందించేందుకు గతేడాది అక్టోబర్ 22న మెటాతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. తొలి విడతగా పౌరులకు 161 సేవలను కూటమి ప్రభుత్వం అందించనుంది. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు అధికారులు సచివాలయంలో సమీక్షలో ప్రజంటేషన్ ఇచ్చారు. వాట్సాప్ ద్వారా సేవలను ఏ విధంగా పొందవచ్చో దానిపై సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా మొదటి విడతలో ఏపీఎస్ ఆర్టీసీ, రెవెన్యూ, దేవాదాయ, ఎనర్జీ, సీఎంఆర్ఎఫ్, అన్నక్యాంటీన్, మున్సిపల్ వంటి పలు శాఖల్లో సుమారు 161 సేవలను పౌరులకు అందుబాటులోకి తెచ్చింది.



# ఏపీలో వాట్సాప్ సేవలను ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్

- వాట్సప్ గవర్నెన్స్ కోసం నెంబర్ 9552300009ను సంప్రదించాలని సూచన

**అమరావతి,జనవరి31( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్‌లో వాట్సప్ సేవలను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఇక నుంచి ప్రభుత్వ ధృవ పత్రాలన్నీ వాట్సప్ ద్వారానే ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా వాట్సప్ సేవల కోసం నెంబర్‌ను విడుదల చేశారు మంత్రి లోకేష్. వాట్సప్ గవర్నెన్స్ కోసం నెంబర్ 9552300009ను అనౌన్స్ చేశారాయన. దేశంలోనే తొలిసారి వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలు అందించనుంది ఏపీ సర్కార్. మొదటి విడతలో 161 సేవలను వాట్సప్ ద్వారా అందించనున్నారు. ఈ తొలి విడతలో దేవాదాయ, విద్యుత్ శాఖ, ఆర్టీసీ, రెవెన్యూ, అన్నా క్యాంటీన్, సీఎంఆర్ఎఫ్, మున్సిపల్ శాఖలలోని సేవలు అందిస్తారు. సర్టిఫికెట్ల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి స్వస్తి పలకాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. పౌరుల సమాచారం సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా ఫోరెన్సిక్, సైబర్ సెక్యూరిటీ ఇవ్వాలని సీఎం ఆదేశించారు. వాట్సప్ ద్వారా పౌరసేవలు అందించేందుకు 2024 అక్టోబరు 22న మెటా సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం మేరకు ఇప్పుడు వాట్సప్ గవర్నెన్స్ తీసుకువస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. వేగంగా పౌరసేవలు అందించటం, పారదర్శకత, జవాబుదారీతనంలో భాగంగా వాట్సప్ గవర్నెన్స్ అందుబాటులోకి తీసుకువచ్చారు. సమాచార గోప్యత, వేగంగా సేవలందించేందుకు జనరేటివ్ ఆర్టీఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వాట్సప్ గవర్నెన్స్ పని చేస్తుంది. దేవాదాయ శాఖలోని ప్రముఖ దేవాలయాల్లో దర్శనాల టికెట్లు, గదుల బుకింగ్, డోనేషన్ల సేవల్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెవెన్యూ శాఖలో దరఖాస్తుల స్టేట్స్ ల్యాండ్ రికార్డులు, ఇతర ముఖ్యమైన సర్టిఫికెట్లను జారీ చేయనున్నారు. మున్సిపల్ శాఖలో ఆస్తిపన్ను చెల్లింపులు, జనన మరణ ధృవీకరణ పత్రాలు, ట్రేడ్ లైసెన్సులు జారీకి నిర్ణయించారు. ఇతర శాఖల్లో యుటిలిటీ బిల్లులు, ఎలక్ట్రిసిటీ బిల్లులు తదితర సేవల్ని వాట్సప్ పేమెంట్ వ్యవస్థ ద్వారా చెల్లింపులు చేసేందుకు అవకాశం కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సేవలు పొందాలనుకునే వారి కోసం ప్రభుత్వం ఒక నెంబర్ అనౌన్స్ చేసింది. 9552300009 ద్వారా వాట్సప్‌లో ప్రభుత్వ సేవలను పొందవచ్చునని మంత్రి లోకేష్ తెలిపారు.




# విశాఖకు చేరుకున్న కేంద్ర మంత్రులు

- ఘన స్వాగతం పలికిన కూటమి నేతలు

**అమరావతి,జనవరి31( వెలుతురు):**
విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించినతర్వాత తొలిసారిగా కేంద్ర ఉక్కు శాఖామంత్రి కుమార స్వామి, కేంద్ర ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ విశాఖకు వచ్చారు. ఈ సందర్భంగా విశాఖ ఎయిర్‌పోర్టులో వీరికి కూటమి నేతలు ఘనస్వాగతం పలికారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్, విజయనగరం ఎంపీ అప్పలనాయుడు, కూటమి నేతలు, కార్యకర్తలు అందరూ కూడా విమానాశ్రయానికి చేరుకున్న కేంద్రమంత్రులకు ఘనంగా స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టులో కేంద్ర మంత్రులకు కూటమి మహిళ నేతలు, కార్యకర్తలు పూల వర్షం కురిపించారు. అనంతరం అక్కడి నుంచి స్టీల్ ప్లాంట్‌కు బయలుదేరారు. మార్గ మధ్యలో కూడా కేంద్రమంత్రులకు కూటమి పార్టీ నేతలు గజమాలలు వేసి స్వాగతం తెలిపారు. షీలా నగర్ వద్ద కేంద్ర మంత్రులు కుమార స్వామి, శ్రీనివాస వర్మలకు గజమాలతో సగౌరవంగా స్వాగతించారు. కాసేపట్లో స్టీల్ ప్లాంట్‌కు కేంద్రమంత్రులు చేరుకోనున్నారు. స్టీల్‌ప్లాంట్ పరిపాలన భవనం వద్దకు చేరుకోనున్న కేంద్రమంత్రులు అక్కడ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఎటువంటి చర్యలు తీసుకుంటామనే దానిపై కేంద్రమంత్రులు స్పష్టమైన ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ తర్వాత తొలిసారి కేంద్రమంత్రులు పర్యటిస్తున్న నేపథ్యంలో అధిక ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్ర మంత్రుల పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. మరోవైపు స్టీల్ ప్లాంట్‌కు సంబంధించి స్పష్టమైన ప్రకటన చేయాలని ఉక్కు కార్మిక సంఘాలు కోరుతున్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయమని ప్రకటన చేయాలని, సెయిల్‌లో విలీనం చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయొద్దంటూ గత1449 రోజుల నుంచి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. స్టీల్ ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్రం మంత్రులు ప్రకటన చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.




# సుష్మాస్వరాజ్ కూతురిని కలిసిన తండేల్ టీం



టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య నటిస్తోన్న తాజా చిత్రం తండేల్. చందూమొండేటి డైరెక్షన్‌లో రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోన్న ఈ మూవీని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ మూవీ ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుందని తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. తాజాగా బన్నీవాసు అండ్ తండేల్ టీం దివంగత మాజీ కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్ కూతురు బన్సూరి స్వరాజ్‌ను కలిసింది. ఇంతకీ వీరంతా ఎందుకు కలిశారో తెలుసా..? 2017-2018 కాలంలో పాకిస్థానీ జైళ్లలో చిక్కుకుపోయిన మత్స్యకారులను వెనక్కి తీసుకురావడంలో మాజీ కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్ కీలక పాత్ర పోషించారని తెలిసిందే. సుష్మా స్వరాజ్ చిరస్మరణీయ సేవలను గుర్తు చేసుకుంటూ తండేల్ టైటిల్ కార్డ్స్‌లో ఆమె పేరును షేర్ చేసేందుకు అనుమతిచ్చిన బన్సూరి స్వరాజ్‌కు ధన్యవాదాలు తెలియజేసింది. ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.

## స్టైలిష్‌తో అదరగొడుతున్న ఆ హీరో భార్య

పై ఫొటోలో అల్ట్రా స్టైలిష్ లుక్‌లో మెరిసిపోతున్నదెవరో గుర్తు పట్టారా? ఆమె ఓ టాలీవుడ్ హీరో సతీమణి. పెళ్లికి ముందు పలు సినిమాల్లో హీరోయిన్ గా నటించింది. సహాయక నటిగానూ మెరిసింది. అయితే పెళ్లి తర్వాత కుటుంబానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చింది. సినిమాలకు క్రమంగా దూరమైపోయింది. అయితే సోషల్ మీడియా ద్వారా అభిమానులతో టచ్ లో ఉంటోంది. ఎప్పటికప్పుడు తన లేటెస్ట్ గ్లామర్ అండ్ ఫ్యాషనబుల్ ఫొటోస్, వీడియోలను అందులో షేర్ చేస్తుంటుంది. అలా తాజాగా ఆమె షేర్ చేసిన కొన్ని ఫొటోలు తెగ వైరలవుతున్నాయి. ఇందులో ఆమె అల్ట్రా స్టైలిష్ లుక్ లో కనిపించింది. అది కూడా రాత్రి పూట రోడ్డు మీద పోజులిచ్చింది. వీటిని చూసిన సినీ అభిమానులు, నెటిజన్లు షాక్ అవుతున్నారు. హీరో సతీమణి ఇంత స్టైలిష్ లుక్‌లోకి మారిపోయిందేంటి? అని క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. ఇంతకీ ఈ అందాల తార ఎవరో గుర్తు పట్టారా? తను మరెవరో కాదు వరుణ్ సందేశ్ సతీమణి వితికా షేరు. వితిక 11 సంవత్సరాల వయస్సులో బాలనటిగా తన నటన జీవితాన్ని ప్రారంభించింది. 2008లో అంతు ఇంతు ప్రీతి బంతు (తెలుగులో ఆడవారి మాటలకు అర్థాలే వేరులేలో కలర్స్ స్వాతి పాత్ర) కన్నడచిత్రంతో సినీరంగ ప్రవేశంచేసింది.ఆ తరువాత కన్నడలోనే 2009లో ఉల్లాస ఉత్సాహ సినిమాలో నటించింది. 2009లో ప్రేమించు రోజుల్లో అనే సినిమాతో టాలీవుడ్ కు పరిచయమైంది. ఆ తర్వాత సందడి, ఝుమ్మంది నాదం, భీమిలి కబడ్డీ జట్టు, ప్రేమ ఇష్క్ కాదల్, పడ్డానండి ప్రేమలో మరి, మహాబలిపురం సినిమాల్లో హీరోయిన్ గా, సహాయక నటిగా అలరించింది.



## ప్రభాస్ వంటకాలకు ఆ హీరోయిన్ ఫిదా

గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి హను రాఘవపూడి డైరెక్ట్ చేస్తున్న ఫౌజీ. ఈ చిత్రంలో ఇమాన్వీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ప్రభాస్ ఇంటి నుంచి పసందైన రుచులతో కూడిన భోజనం సెట్స్‌కు వస్తుంటుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రభాస్ తన ఆతిథ్యంతో ఊపిరాడకుండా చేస్తాడని ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు చాలా సందర్భాల్లో కూడా చెప్పారు. కాగా ఇప్పుడు ప్రభాస్ ఇంటి విందుకు ఫిదా అయిపోయిన వారి జాబితాలో ఫౌజీ హీరోయిన్ కూడా చేరిపోయింది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ రామోజీ ఫిలిం సిటీలో కొనసాగుతోంది. సెట్స్‌లో బ్రేక్ టైంలో ప్రభాస్ కిచెన్‌లో వండిన హెూం ఫుడ్‌ను ఆరగించింది ఇమాన్వీ. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో గ్లింప్స్ షేర్ చేసింది. రుచికరమైన యమ్మీ యమ్మీ భోజనం రుచి చూపించిన ప్రభాస్‌కు ధన్యవాదాలు అంటూ క్యాప్షన్ ఇచ్చింది. సీతారామం, రాధేశ్యామ్ లైన్‌లో వింటేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఫౌజీ సాగనుందట. ప్రభాస్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో సలార్ 2, సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్‌లో స్పిరిట్, మారుతి డైరెక్షన్‌లో రాజాసాబ్ సినిమాలు చేస్తున్నాడు.



# ప్రముఖ నిర్మాత మృతి



ప్రముఖ నిర్మాత మృతితో టాలీవుడ్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆ నిర్మాత ఎవరంటే.. అల్లరి నరేష్‌తో 'మడత కాజా', 'సంఘర్షణ' వంటి చిత్రాలను నిర్మించిన నిర్మాత వేదరాజు టింబర్ (54) శుక్రవారం ఉదయం మృతిచెందారు. సినిమాలపై ఇష్టంతో ఓ వైపు కనస్ట్రక్షన్ రంగంలో బిజీగా ఉంటూనే మరోవైపు సినిమాలను నిర్మించిన నిర్మాత వేదరాజు టింబర్. త్వరలో మరో చిత్ర నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్న సమయంలోనే ఆయన అకాల మరణం ఇండస్ట్రీని విషాదంలోకి నెట్టివేసింది. గత కొంతకాలంగా ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఎఐజి హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్న వేదరాజు.. త్వరలోనే కోలుకుని క్షేమంగా తిరిగి వస్తారని ఆయన సన్నిహితులు, కుటుంబ సభ్యులు భావిస్తున్న తరుణంలో.. సడెన్‌గా ఇలా జరగటం వారందరిలో విషాదాన్ని నింపింది. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. అంత్య క్రియలు శుక్రవారమే జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. నిర్మాత వేదరాజు టింబర్ మృతికి టాలీవుడ్ ఇండస్ట్రీ నివాళులు అర్పిస్తూ.. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నారు.



## ప్రియాంక చోప్రాకు టాప్ రెమ్యునరేషన్

బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా పాపులర్ అమెరికన్ సింగర్ నిక్ జోనస్‌ను పెళ్లి చేసుకున్న తర్వాత హాలీవుడ్‌కు పరిమితమైపోయిందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. లాంగ్ గ్యాప్ తర్వాత ఈ భామ ఆర్ఆర్ఆర్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి, మహేశ్ బాబు కాంబోలో వస్తోన్న గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్ ఎస్-ఎస్ఎంబీ 29తో ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌పైకి గ్రాండ్ రీఎంట్రీకి రెడీ అయిందని తెలిసిందే. ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా రానున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీ చిత్రీకరణ కొనసాగుతున్నట్టు ఫిలింనగర్ సర్కిల్‌లో ఇప్పటికే వార్తలు రౌండప్ చేస్తున్నాయి. ఇదిప్రియాంకా చోప్రా తెలుగులో ఫుల్ లెంగ్త్ రోల్‌లో నటిస్తోన్న తొలి సినిమా అని తెలిసిందే. ఈ సినిమాకు తీసుకుంటున్న రెమ్యునరేషన్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తాజా కథనాల ప్రకారం జక్కన్న ప్రాజెక్ట్ కోసం ప్రియాంకా చోప్రా ఏకంగా రూ.30 కోట్లు తీసుకుంటుందట. ఇదే నిజమైతే రీఎంట్రీ తర్వాత ప్రియాంకా చోప్రా తీసుకుంటున్న భారీ మొత్తం అవుతుందంటున్నారు సినీ జనాలు. మరి దీనిపై ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలి. 2002లో తొలిసారి తమిళ సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ప్రియాంకా చోప్రా ఆ తర్వాత తన ఫోకస్ అంతా బాలీవుడ్‌పైనే పెట్టింది. రాంచరణ్ నటించిన తుఫాన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా హాయ్ చెప్పింది.

# భారీ అంచనాలను పెంచుతున్న వీడి-12

లైగర్ లాంటి భారీ డిజాస్టర్ తర్వాత ఫ్యామిలీ స్టార్‌తో ప్రేక్షకుల ముందుకొచ్చాడు విజయ్ దేవరకొండ. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఢీలా పడిపోయింది. ఇక ఎలాగైనా మంచి హిట్టు కొట్టాలన్న కసితో ఉన్న విజయ్ దేవరకొండ వరుస సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి వీడీ12. జెర్సీ ఫేం గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తున్నాడు. మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా అప్‌డేట్ కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు నిర్మాత సూర్య దేవర నాగవంశీ అదిరిపోయే అప్‌డేట్ అందించాడు. మీ అందరి నిందల తర్వాత నేను గౌతమ్‌ను చాలా హింస పెట్టాక.. ఫైనల్‌గా టైటిల్‌ను లాక్ చేశాం.




వీడీ 12 టైటిల్ త్వరలోనే వెల్లడిస్తామని నాగవంశీ ట్వీట్ చేశాడు. ఈ నేపథ్యంలో ఇంతకీ ఆ టైటిల్ ఏమై ఉంటుందా అని తెగ చర్చించుకుంటున్నారు సినీ జనాలు. ఈ సినిమాను మే 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారని వార్తలు వస్తుండగా.. మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. ఈ మూవీ టీజర్‌ను ఫిబ్రవరి 7న విడుదల చేయనున్నట్టు సమాచారం. ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్-శ్రీకర స్టూడియోస్ బ్యానర్ సంయుక్తంగా తెరకెక్కిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ తొలిసారి ఖాకీ డ్రెస్ వేసుకోబోతున్నాడు. విజయ్ దేవరకొండ ఇందులో పవర్ ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నాడని సమాచారం.

# మా నాన్న ఆశీర్వాదం వల్లే పద్మభూషణ్ వచ్చింది

- సొంత లాభం కొంతమానుకొని సమాజం కోసం చేయాలి : నందమూరి బాలకృష్ణ



**హైదరాబాద్,జనవరి31(వెలుతురు):**
మా నాన్న గారి ఆశీర్వాదం వల్లే పద్మ భూషణ్ వచ్చింది' అని నందమూరి బాలకృష్ణ అన్నారు. శుక్రవారం నాడు బసవతారకం ఆస్పత్రిలో బాలయ్యకు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. పద్మ భూషణ్ తనను వరించిందన్నారు. పదవులు మనకు అలంకారం కాదని.. మనకు పదవులు అలంకారం కావాలని అన్నారు. తాను ఎప్పుడూ ఏదీ ఆశించి చేయలేదన్నారు. ఇది తన నాన్న ఆశీర్వాదం అని పేర్కొన్నారు. ఇలాంటి సన్మానాలు మరింత బాధ్యతను పెంచుతాయని చెప్పారు. ఇంకా చాలా విషయాలు బాలయ్య మాట్లాడారు. 'నాకు వచ్చిన ఈ అవార్డు మీకు అందరికి వచ్చినట్లే. ఈ రోజు నాకు వచ్చిన అవార్డు రేపు మీకు రావచ్చు. స్వంత లాభం కొంత మానుకొని సమాజం కోసం పని చేయండి. వరుసగా నాలుగు సినిమాలు హిట్ అవటం, వరుసగా మూడుసార్లు గెలవటం, ఇప్పుడు ఈ అవార్డు రావడం సంతోషంగా ఉంది. నా కుటుంబం అయిన.. బసవతారకం, హిందూపూర్ నియోజకవర్గం ప్రజలు వారికి అవార్డు వచ్చినట్లు భావిస్తున్నారు. ఎన్నో జన్మల పుణ్యం అయితే ఇలాంటి కుటుంబం దొరుకుతుంది. కాలం మారుతుంది. కాన్సర్ పెరుగుతుంది. దానికి తగ్గట్లుగా మనం పయనించాలి. కొత్త మెషినరీస్‌కి స్వాగతం పలకాలి. మా అమ్మ గారి ఆశయం కోసం ఎంతో మందికి తక్కువ ఖర్చుతో వైద్యం చేస్తున్నాం. సహకారం అందిస్తున్న దాతలకి, ప్రభుత్వాలకి, బ్యాంకర్స్‌కి కృతజ్ఞతలు. కళారంగానికి చేసిన సేవలు మరువలేనిది. దానికి గుర్తింపే ఈ గొప్ప అవార్డు. ఏ సినిమా చేసినా ఎంతో ఆలోచించి చేస్తాం. ఈ అవార్డు మా నాన్న, అమ్మకి అంకితం. మా నాన్న ఎన్నో సేవలు చేశారు. ఆయనకి భారతరత్న రావాలి.' అని బాలకృష్ణ అన్నారు. పద్మ భూషణ్ అవార్డు అందుకున్న సందర్భంగా నందమూరి బాలకృష్ణకు బలవతారకం ఆస్పత్రిలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలకృష్ణ, వసుంధర దంపతులు హాజరయ్యారు. బసవతారకం హాస్పిటల్‌లో అడ్వాన్సడ్ రోబోటిక్ డివెన్సీ ఎక్విప్‌మెంట్‌ను బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బాలయ్య.. దీని ద్వారా అతి తక్కువ ఖర్చుతోనే అత్యంత తక్కువ పెయిన్‌తో ఖచ్చితమైన వైద్యం అందించే వీలుంటుందని చెప్పారు. శస్త్ర చికిత్సలో అత్యాధునిక వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని, ఈ విషయంలో గర్వపడుతున్నామని పేర్కొన్నారు. 800 లకు పైగా రోబోటిక్ సర్జరీలు చేశామని బాలకృష్ణ తెలిపారు. దేశంలోనే ఇన్ని రోబోటిక్ సర్జరీలు చేసిన ట్రస్ట్ ఒక్క బసవతారకం హాస్పిటల్ మాత్రమేనని చెప్పారాయన. కార్పొరేట్ హాస్పిటల్స్‌తో పోలిస్తే యాభై శాతం తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తున్నామన్నారు. రోబోటిక్ సర్జరీ ద్వారా క్యాన్సర్ రోగులు త్వరగా కోలుకుంటారని.. సంకల్పం, సేవ బలంతో ముందుకు సాగుతున్నామని బాలయ్య పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్,జనవరి31(వెలుతురు):**
తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వ్యవహారంపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ జార్జి మైస్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. హైకోర్టు నాలుగు నెలల్లో ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని గత ఏడాది మార్చిలో చెప్పినా ఇంత వరకు నిర్ణయం తీసుకోలేదని కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తగిన సమయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదని న్యాయవాది తెలిపారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చామని అసెంబ్లీ కార్యదర్శి తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి.. కోర్టుకు చెప్పారు. నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్ ఎమ్మెల్యేలకు తగిన సమయం ఇవ్వాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందని రోహత్గి గుర్తు చేశారు. "బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి... మీ దృష్టిలో తగిన సమయం అంటే ఎంత? రీజనబుల్ టైమ్ అంటే.. మహారాష్ట్ర తరహాలో శాసనసభ గడువు ముగిసేవరకా?" అంటూ తెలంగాణ స్పీకర్‌ను సుప్రీం ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. స్పీకర్‌ను అడిగి నిర్ణయం చెపుతామని సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి తెలిపారు. ఎంత సమయం కావాలో మీరే స్పీకర్‌ను కనుక్కొని చెప్పాలని రోహత్గికి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం సూచించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి సుప్రీం కోర్టు వాయిదా వేసింది. సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్ , తెల్ల వెంకటరావుపై అనర్హత వేటు వేయాలనే పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద ఈ పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ పై గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి కడియం, దానం నాగేందర్ , తెల్ల వెంకటరావు సహా పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారు. దీనిపై జస్టిస్ బి ఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ ధర్మాసనం విచారణ జరిపింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు తెల్లం, కడియం, దానంపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపులపై నాలుగు వారాల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్ వేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు తెలంగాణ స్పీకర్ కనీసం నోటీసు ఇవ్వలేదని పిటిషన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

# ప్రపంచంలో మూడో ఆర్థికశక్తిగా భారత్

- సామాజిక, ఆర్థిక, రాజకీయ సుస్థిరతతో ఆదర్శం
- వికసిత భారత్ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం
- మూడో టర్మ్‌లో ..మూడురెట్ల వేగంతో అభివృద్ధి
- బడ్జెట్‌లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం
- స్వయంసమృద్ధి, స్వావలంబన దిశగా దేశం పురోగతి
- 370 ఆర్టికల్ రద్దుతో కాశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితులు
- 25 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి బయటకు తీసుకొచ్చాం
- 3కోట్ల మంది పేదలకు ఇల్లు నిర్మించబోతున్నాం
- కృత్రిమ మేధ రంగంలో 'భారత ఏఐ మిషన్'
- ప్రయాగ్‌రాజ్ తొక్కిసలాట ఘటన విచారకరం
- పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం

## దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా బడ్జెట్

సమావేశాలకు ప్రతిపక్షాలు సహకరించాలి

మీడియాతో ప్రధాని మోదీ ఆకాంక్ష





**న్యూఢిల్లీ,జనవరి31(వెలుతురు):**
సామాజిక, ఆర్థిక, రాజకీయ సుస్థిరతలో ఈ ప్రపంచానికి భారత్ ఆదర్శంగా నిలిచిందని, మన ముందున్న ఏకైక లక్ష్యం.. 'వికసిత్ భారత్' నిర్మాణమే..అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ప్రపంచంలోనే భారత్‌ను మూడో ఆర్థిక శక్తిగా నిలపనున్నట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు. భారత సామాజిక చేతనకు మహాకుంభమేళా నిదర్శంగా నిలుస్తోందన్నారు. దేశాభివృద్ధి కోసం వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తమ ప్రభుత్వ మూడో టర్మ్‌లో మూడు రెట్ల వేగంతో అభివృద్ధి సాగుతోందని రాష్ట్రపతి తెలిపారు. ఆరంభంలో ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. ఇటీవలే తుదిశ్వాస విడిచిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. 'మహా కుంభమేళా జరుగుతున్న సమయంలో పార్లమెంట్ సమావేశాలు ప్రారంభించుకుంటున్నాం. ఇటీవల గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నాం' అని రాష్ట్రపతి హర్షం వ్యక్తంచేశారు. బడ్జెట్‌లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఉంటుందని ఆమె తెలిపారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే సర్కారు.. గత ప్రభుత్వాల పాలనతో పోలిస్తే మూడు రెట్లు వేగంతో పనిచేస్తోంది. త్వరలో ప్రపంచంలో మూడో ఆర్థికవ్యవస్థగా భారత్ మారనుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పేదరిక నిర్మూలన కోసం అనేక పథకాలు అమలుచేస్తున్నాం. 25 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి బయటకు తీసుకొచ్చాం. అర్హులందరికీ లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలను వేగంగా అమలుచేస్తున్నాం అని అన్నారు. మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం. అదనంగా మూడు కోట్ల కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజనను పొడిగించాం అన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద.. 70 ఏళ్లు పైబడిన ఆరు కోట్ల మంది వృద్ధులకు ఆరోగ్య బీమా అందిస్తోంది. అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు ప్రవేశపెడుతున్నాం. విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. యువతకు నూతన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. నూతన విద్యా విధానంతో ఆధునిక విద్యా వ్యవస్థను ఏర్పాటుచేశాం. సంస్కరణలు వేగవంతం చేశాం. ఒకే దేశం-ఒకే ఎన్నిక, వక్ఫ్ సవరణ బిల్లు అమలు దిశగా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నాం అని అన్నారు. దేశంలో కార్పొరేట్ సంస్థలకు మహిళలు నాయకత్వం వహిస్తున్నారు. ఒలింపిక్ పతకాలు సాధిస్తూ దేశం గర్వించేలా చేస్తున్నారు. వారి సాధికారకతకు కృషి చేస్తున్నాం. మారుమూల ప్రాంతాల్లో డిజిటల్ సేవల కల్పనలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు గొప్ప ముందడుగు. నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ కింద 91 లక్షలకు పైగా స్వయం సహాయక బృందాలకు సాధికారికత కల్పిస్తున్నాం. 3 కోట్ల మందిని లక్‌పతీ దీదీగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం అన్నారు. భారత్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్‌హౌస్‌గా మార్చడమే మా లక్ష్యం. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను ప్రారంభించాం. కృత్రిమ మేధ రంగంలో 'భారత ఏఐ మిషన్'ను మొదలుపెట్టాం. భారత్ తన సొంత మానవ సహిత అంతరిక్ష ప్రయోగం గగన్‌యాన్‌ను ప్రయోగించే రోజు ఎంతో దూరంలో లేదు. ఎంఎస్‌ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ పథకాలు, ఇ-కామర్స్ ఎగుమతి కేంద్రాలు దేశంలో అన్ని రంగాల్లో వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నాయి. సైబర్ సెక్యూరిటీలో సమర్థత కోసం నిరంతరం కృషి చేస్తున్నాం. డిజిటల్ మోసాలు, సైబర్ నేరాలు, డీప్‌ఫేక్ వంటివి సామాజిక, ఆర్థిక, దేశ భద్రతకు పెను సవాళ్లుగా మారాయి. ప్రపంచ వేదికపై డిజిటల్ టెక్నాలజీలో భారత్ కీలకపాత్ర పోషిస్తోంది. మన యూపీఐ లావాదేవీల వ్యవస్థ విజయాన్ని అభివృద్ధి చెందిన దేశాలు కూడా ప్రశంసించాయి. భారత మెట్రో నెట్‌వర్క్ 1000 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా నిలిచింది. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం దేశవ్యాప్తంగా 1.75లక్షల ఆరోగ్య మందిర్‌లను ఏర్పాటుచేశాం. క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల కోసం వారు ఉపయోగించే పలు ఔషధాలపై కస్టమ్ సుంకాన్ని రద్దు చేశాం. గర్భిణులు, పిల్లల వ్యాక్సినేషన్ కోసం యు-విన్ పోర్టల్‌ను ప్రారంభించాం. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు సాగు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందిస్తున్నాం. కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు రూ.2000 కోట్లతో 'మిషన్ మౌసం'ను ప్రారంభించాం. సహకార రంగంలో అనేక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం అని వివరించారు. ఆర్టికల్ 370 తర్వాత జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు మెరుగయ్యాయి. సంస్కరణలు, పనితీరు, పరివర్తన అనేవి ప్రభుత్వ పాలనకు బలమైన స్తంభాలుగా మారాయన్నారు. సరిహద్దుల రక్షణ, అంతర్గత భద్రత కోసం ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. వామపక్ష అతివాదానికి వ్యతిరేకంగా పోరాటం చివరిదశకు చేరింది. నక్సల్స్ ప్రభావిత జిల్లాల సంఖ్య 38కు తగ్గింది. రక్షణ రంగంలో స్వావలంబన దిశగా కీలక అడుగులు వేస్తున్నాం అని రాష్ట్రపతి అన్నారు. బడ్జెట్-2025లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. రూ.70 వేల కోట్లతో గ్రామీణ రహదారులను అభివృద్ధి చేస్తున్నాం. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్నదే మా లక్ష్యం. పేద, మధ్యతరగతి ప్రజలకు హోమ్ లోన్ సబ్సిడీ ఇస్తున్నాం. ఉద్యోగుల కోసం 8వ వేతన సంఘాన్ని నియమించాం. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చాం. వన్ నేషన్ ? వన్ ఎలక్షన్ దిశగా అడుగులు వేస్తున్నాం. ట్యాక్స్ విధానాలను సరళీకరించాం. భారత్ త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లతో గొప్ప ముందడుగు వేస్తున్నాం. 70 ఏళ్లు దాటిన 6 కోట్లమందికి ఆరోగ్య బీమా కల్పిస్తున్నాం. యువతకు ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాం. దేశంలో లక్షా 15 వేల మంది మహిళలు లక్‌పతీ దీదీలుగా మారారు. మూడు లక్షలమంది మహిళలను లక్‌పతీ దీదీగా మార్చాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం' అని రాష్ట్రపతిముర్ము తన ప్రసంగంలో వివరించారు. రాజ్యాంగం ముందునాటి చట్టాలను సమీక్షిస్తున్నాం..ప్రస్తుత కాలానికి తగినట్లు ఆ చట్టాలను మారుస్తున్నాం. అటల్ టన్నెల్, సోన్‌మార్గ్ టన్నెల్ వంటివి నిర్మించాం. భారత మెట్రో నెట్‌వర్క్ 1000 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా నిలిచిందిభావితరాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకుంటున్నాం.

చ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు రూ.2000 కోట్లతో మిషన్ మౌసంను ప్రారంభించాం అని వివరించారు. ఆమె ప్రసంగిస్తున్నంత సేపు ప్రధాని మోడీ సహా అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు. అంతకుముందు రాష్ట్రపతి సంప్రదాయ పద్ధతిలో పార్లమెంట్‌కు చేరుకోగానే ఉప రాష్ట్రపతి ధన్‌కడ్, స్పీకర్ ఓంబిర్లాలు స్వాగతం పలికారు.

### దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా బడ్జెట్

పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోయే బడ్జెట్ దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉంటుందని ప్రధాని మోడీ అన్నారు. పార్లమెంటు సమావేశాలు ప్రారంభం అయిన సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. ఈ సమావేశాలు ప్రారంభమయ్యే ముందు పార్లమెంటు వెలుపల ప్రధాని మోడీ మీడియాతో మాట్లాడారు. 'పార్లమెంటు సమావేశాలు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరిస్తాయని నేను భావిస్తున్నాను. మూడోసారి ఎన్డీయేకు ప్రజలు పట్టం కట్టారు. పార్లమెంటులో సంపూర్ణ బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నాం. ఈ బడ్జెట్ ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుందని ఆశిస్తున్నాను. ఈ బడ్జెట్ వికసిత్ భారత్‌కు ఊతం ఇస్తుంది. ఇన్నేవేషన్, ఇన్‌క్లూజన్, ఇన్వెస్ట్‌మెంట్ లక్ష్యంతో దూసుకెళ్తున్నట్లు' మోడీ చెప్పారు. కొత్త విధానాలైనే ఆర్థిక ప్రగతి ఆధారపడి ఉంటుంది. ఈ సమావేశాల్లో కీలక బిల్లులను ప్రవేశపెట్టనున్నట్లు మోడీ తెలిప్పారు. ఇప్పుడు జరిగే పార్లమెంటు సమావేశాల్లో అన్ని అంశాలపై సమగ్ర చర్చ జరిపేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని మోడీ విజ్ఞప్తి చేశారు. జనవరి 31 నుండి ఏప్రిల్ 4 వరకు రెండు విడతల్లో బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. మొదటి విడత సమావేశాలు ఫిబ్రవరి 13న ముగుస్తాయి. ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం 16 బిల్లులను ప్రవేశపెట్టాలని చూస్తోంది. వీటిల్లో వక్ఫ్ (సవరణ) బిల్లు, బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు, రైల్వే (సవరణ) బిల్లు, విపత్తు నిర్వహణ (సవరణ) బిల్లుతోపాటు పలు బిల్లులను ప్రభుత్వం పెట్టనుంది. బడ్జెట్ ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుందని భరోసా ఇచ్చారు. అలాగే పదేళ్ల కాలంలో పార్లమెంట్ సెషన్‌కు ముందు ఈసారే విదేశీ జోక్యం కనిపించలేదని విపక్షాలకు చురకలు అంటించారు.'పేదలు, సామాన్యులపై మహాలక్ష్మి కృప ఎప్పటికీ ఉండాలి. భారత శక్తిసామర్థ్యాలు మనకు విశేష గుర్తింపును ఇస్తాయి. మూడోసారి ఎన్డీయేకు ప్రజలు పట్టం కట్టారు. మూడోసారి పార్లమెంట్‌లో సంపూర్ణ బడ్జెట్ ప్రవేశపెడుతున్నాం. ఈ వార్షిక పద్దు ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుంది. భారత్ అభివృద్ధి లక్ష్యంతో మిషన్ మోడ్‌లో ముందుకెళ్తున్నాం. ఇన్నోవేషన్, ఇన్‌క్లూజన్, ఇన్వెస్ట్‌మెంట్ లక్ష్యంతో దూసుకెళ్తున్నాం. కొత్త విధానాల పైనే ఆర్థిక ప్రగతి ఆధారపడి ఉంటుంది.

# మెడికల్ సీట్లలో స్థానిక కోటాపై పోరుకు సర్కారు నిర్ణయం

**హైదరాబాద్,జనవరి31(వెలుతురు):**
విద్య విద్య పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ) సీట్లలో స్థానిక కోటా రద్దుపై పోరాటం చేయాలని రాష్ట్ర సర్కారు నిర్ణయించుకుంది. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేలా ఉన్న సుప్రీంకోర్టు తీర్పుపై రాజ్యాంగ ధర్మాసనం వద్దకు వెళ్లడంపై న్యాయనిపుణుల సలహాలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు స్థానిక విద్యార్థులకు తీవ్ర నష్టం చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. దక్షిణాదిలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రానికి పీజీ మెడికల్ సీట్ల కోటా రద్దుపై లెటర్ రాయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటల రాష్ట్రాల ముఖ్యమంత్రులతోనూ ఈ అంశం ప్రస్తావించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఎంబీబీఎస్ లో స్థానిక కోటా కింద రాష్ట్రంలో అర్హత పొందిన వారే.. పీజీలో స్థానిక కోటా రిజర్వేషన్లకు అర్హులు అవుతారని రాష్ట్ర సర్కారు జీవో148, 149లను తీసుకువచ్చింది. ఇతర రాష్ట్రాల వారు రాష్ట్రంలో ఎంబీబీఎస్ చదివినంత మాత్రాన పీజీ స్థానిక కోటా వర్తించదని ఆ జీవోలో పేర్కొంది. ఈ క్రమంలో రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు స్థానిక కోటా కింద పీజీ ప్రవేశాల్లో ఎక్కువగా అవకాశాలు లభిస్తాయి. తాజాగా స్థానిక కోటాను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో సీట్లన్నీ ఆలిండియా కోటాలోకి వెళ్లనున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో ఉన్నస్థానిక విద్యార్థులకు సీట్లు తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీహెచ్‌ఎంఎస్/బీఏఎంఎస్ చేసిన వారికి పీజీలో స్థానిక కోటా పరిధిలోనే ప్రవేశాలు కల్పించాల్సి ఉంటుందని తెలంగాణ సర్కారు పేర్కొంది. తెలంగాణ స్థానికులై ఉండి రాష్ట్రంలోనే ఎంబీబీఎస్, ఇన్ సర్వీస్ అభ్యర్థులకు రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం పీజీ ప్రవేశాలు కల్పించాల్సి ఉంటుందని అధికారులుల చెబుతున్నారు. రాష్ట్రంలో విద్యకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు అమల్లోనే ఉన్నాయని పేర్కొంటున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో దాదాపు 13 వేల మందికి ఒక పీజీ స్టూడెంట్ సేవలు అందిస్తుండగా.. ఉత్తరాదిలో అంతకు మూడింతల మందికి ఒక పీజీ స్టూడెంట్ సేవలు అందిస్తున్నారు. రాష్ట్రంలో కాలేజీల సంఖ్య పెరిగిపోయింది. 2014 వరకు 5గా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్య ఇప్పుడు పెరిగి 34కు చేరింది. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారు. 2025 నాటికి రాష్ట్రంలో 2,924 పీజీ సీట్లు అందుబాటులో ఉంటే అందులో 50 శాతం స్థానిక కోటా రిజర్వేషన్ ప్రకారం 1,462 పీజీ సీట్లు రాష్ట్రంలోని విద్యార్థులకు మాత్రమే రాగా.. తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో 1462 సీట్లు కూడా ఆలిండియా కోటాలోకి వెళ్లిపోనున్నాయి. ఈ నిర్ణయంతో ఆయా రాష్ట్రాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు దెబ్బతింటాయని అధికారులు పేర్కొంటున్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com